RNI.No.TELTEL/2013/52694

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam



# వుదయం



Simultaneously published from Adilabad, Hyderabad, Khammam, Karimnagar,Guntur & Warangal

సంపుటి : 13 || సంచిక : 52 || ఆదిలాబాద్ || మంగళవారం,జూన్ 24, 2025 || VOODAYAM Telugu Daily || వెల : రూ. 3.00 || పేజీలు : 12



ఈనెల జూలై 13 న సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాల ఆహ్వాన పత్రికను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆశీర్వచనం అందించిన ఉజ్జయినీ మహంకాళి ఆలయ అర్చకులు.

# 9 రోజుల్లో రూ.9 వేల కోట్ల రైతు భరోసా

- రాష్ట్ర చరిత్రలోనే ఇదే తొలిసారి
- ప్రజాప్రభుత్వం సాధించిన ఘనత
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్ : రాష్ట్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని గాంధీ భవన్ లో జరిగిన సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేన్నట్లుగా కేవలం 9 రోజుల్లోనే.. 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసాను ప్రజా ప్రభుత్వం రైతులకు అందించింది అని చెప్పారు. అందులో మహిళలకు ఉచిత బస్సు, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, రైతులకు ఉచిత కరెంట్, సబ్సిడీ గ్యాస్ సిలండర్, పేదలకు సన్నబియ్యం వంటి పథకాలను అమలు చేస్తోందని చెప్పారు. వీటితో పాటుగా ఎవరూ ఊహిచనంత పెద్ద స్థాయిలో రైతు భరోసాను ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అమలు చేస్తోందని చెప్పారు. అందులో భాగంగా ఈ సీజన్ మొదలు కాగానే ఎకరాకు గతంలో రూ. 10 వేలుంటే.. మనం రెండువేలు జోడించి.. రూ. 12 వేలు ఇవ్వడం జరిగింది. కోటి 49 లక్షల 39 వేల 111 ఎకరాలకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతోంది. గతంలో 5.. 10 ఎకరాలకు మాత్రమే అని పరిమితులు ఉండేదన్నారు. మన ప్రభుత్వంలో అవేమీ లేకుండా వ్యవసాయం యోగ్యమైన అన్ని భూములకు రైతు భరోసా ఇవ్వడం జరుగుతోంది. రైతు భరోసా వేయడం మొదలు పెట్టి కేవలం 9 రోజుల్లోనే పూర్తి చేయడం జరిగింది. ఇంత తక్కువ కాలంలో రైతు భరోసాను పూర్తిగా వేయడం రాష్ట్ర చరిత్రలోనే ఇద తొలిసారని అన్నారు. ఈ నెల 16న మొదలు పెట్టి 24 తారుఖున పూర్తి చేయడం జరుగుతోంది. అదే రోజున రాష్ట్రంలోని రైతు వేదికల వద్ద రైతులను సమావేశ పరుస్తాం. ప్రభుత్వం తరఫున సచివాలం ఎదురుగా ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద ముఖ్యమంత్రితో సహా రాష్ట్ర మంత్రులంతా వారిని ఉద్దేశించి సందేశాన్న ఇస్తారు. కాంగ్రెస్ పార్టీ ఆలోచనను అనుసరించి ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేసింది కావున.. అన్ని మండల కేంద్రాల్లో మండల కమిటీల ఆధ్వర్యంలో కేవలం 9 రోజుల్లో కోటిన్నర ఎకరాలకు సుమారు 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా నిధులను అందించిన విషయాన్ని వివరిచాలి. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించాలని కోరుతున్నా అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.ఈ సమావేశంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్ రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



# నేడు రైతు భరోసా విజయోత్సవ సభ

-సి.ఎస్ తో కలసి ఏర్పాట్లను పరిశీలించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



హైదరాబాద్, జూన్ 23 : రైతు భరోసా విజయోత్సవ సభ ను మంగళవారం నాడు సచివాలయం ఎదురుగా గల రాజీవ్ గాంధీ విగ్రహ ఆవరణలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ, సహకార,మార్కెటింగ్ జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. హైదరాబాద్ సెక్రటేరియట్ ముందు గల రాజీవ్ విగ్రహం ఆవరణ ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం రైతు భరోసా విజయోత్సవం సభ నేపథ్యంలో చేపట్టబోయే ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితో పాటు సహచర మంత్రులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతాంగానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని, తెలంగాణ రైతులను రాజులుగా చూడాలన్నదే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని అన్నారు. రైతుల వ్యవసాయ పనులకు తొలకరికి ముందుగానే రైతు భరోసాను తొమ్మిది రోజులలో రూ. 9 వేల కోట్ల రూపాయలు రైతు ఖాతాలో జమ చేయడం జరిగిందని స్పష్టం చేశారు. రైతుల సంతోషాలు పంచుకోవడం కోసం రైతు నేస్తం వేదిక ద్వారా మంగళవారం సెక్రటేరియట్ ముందుగల రాజీవ్ విగ్రహం ప్రాంగణంలో విజయోత్సవ సభ నిర్వహించనున్నట్లు , దేశంలో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ గారి ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రైతులకు రూ. 70 వేల కోట్లు రుణమాఫీ జరిగితే తెలంగాణలో ఇప్పుడు 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ. 21 వేల కోట్లు చెల్లించటం జరిగిందని అన్నారు. ఇట్టి కార్యక్రమానికి అన్ని జిల్లాల నుండి రైతు భరోసా పొందిన లబ్ధిదారులు పాల్గొననున్నారని , కార్యక్రమం ఏర్పాట్లు ఎక్కడ కూడా లోపాలు లేకుండా, రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలని మంత్రి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. విద్యుత్, త్రాగునీరు, షామియానాలు, సీటింగ్ కెపాసిటీ, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్ తదితరు అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తో అధికారులకు కలిసి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్ రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ అహమ్మద్ నదీమ్, హైదరాబాద్ కమిషనర్ పోలీస్ సివి ఆనంద్, అడిషనల్ డీజీ లా అండ్ ఆర్డర్స్ ఎంఎం భగవ త్, ట్రాన్స్పోర్ట్ శాఖ కమిషనర్ సురేందర్ మోహన్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్ వి కర్ణన్,, ఐ అండ్ పి ఆర్ కమిషనర్ సిహెచ్ ప్రియాంక, ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ భాష, SPDCL ఎండి ముష్రాఫ్ అలీ, వ్యవసాయ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సెక్యూరిటీ గార్డ్‌లకు కొనసాగింపు ఉత్తర్వులు

- నెలనెలా కాకుండా సంవత్సరానికి ఒకేసారి ఇవ్వాలి.
- వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు సిఐటియు వినతి

హైదరాబాద్ : వ్యవసాయ మార్కెట్ సెక్యూరిటీ గార్డుల రాష్ట్ర కమిటీ సమావేశం సోమవారం హైదరాబాద్‌లోని సిఐటియు కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు కా? తుమ్మల సాంబయ్య అధ్యక్షతన జరిగింది. గత 2 నెలలుగా వ్యవసాయ మార్కెటింగ్ కమిటీలో సెక్యూరిటీ గార్డుల కొనసాగింపు ఉత్తర్వులు నెలనెలా ఇవ్వడాన్ని రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిరచింది. కొనసాగింపు ఉత్తర్వులు నెలనెలా కాకుండా సంవత్సరానికి ఒకేసారి ఇవ్వాలని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తూ వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులు కె. సురేంద్ర మోహన్, ఐఏఎస్ గారికి వినతి పత్రాన్ని అందించారు. సంచాలకులు స్పందిస్తూ సంవత్సరానికి కొనసాగింపు ఉత్తర్వులు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాము. ఆ ప్రతిపాదనలు ప్రభుత్వం నుండి త్వరగా రానందున నెలనెలా కొనసాగింపు ఉత్తర్వులు ఇస్తున్నామని,

ప్రభుత్వం నుండి ప్రతిపాదనలు రాగానే సంవత్సరానికి ఒకేసారి ఉత్తర్వులు ఇస్తాని తెల్పారు. వినతి పత్రం అందించిన వారిలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గొంగిడి లక్ష్మణ్, రాష్ట్ర కమిటీ సభ్యులు బొట్ల వెంకటేష్‌లు ఉన్నారు.ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాటల సోమన్న మాట్లాడుతూ తెలంగాణలోని 192 వ్యవసాయ మార్కెట్ కమిటీలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన సుమారు 1,200 మంది సెక్యూరిటీ గార్డులు గత 30 సం రాల నుండి (1994) మార్కెట్ యార్డులలో, చెక్‌పోస్టులలో, కార్యాలయాలల్లో విధులు నిర్వహిస్తున్నారు. సెక్యూరిటీ గార్డులకు ప్రతి ఆర్థిక సంవత్సరం విధులు కొనసాగించుటకు సం?రం మొత్తానికి అనుమతిచ్చి కొనసాగింపు ఉత్తర్వులు ఇచ్చేవారు. కానీ 2025%-%26 ఆర్థిక సం?రం వార్షిక బడ్జెట్‌లో సం?నికి వేతనాల నిధులు కేటాయించినప్పటికీ నెలనెలా కొనసాగింపు అనుమతి ఇవ్వడం కాకుండా గత రెండు నెలల నుండి ఏ నెలకు ఆ నెలకు కొనసాగింపు అనుమతినిస్తున్నారు. దీంతో సెక్యూరిటీ గార్డులు అభద్రతకు గురవుతూ తీవ్ర ఆందోళన చెందుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున నెలనెలా అనుమతి కాకుండా ఆర్థిక సం?రం మొత్తానికి ఒకేసారి కొనసాగింపు అనుమతి ఉత్తర్వులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శతాబ్ద కాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 లేబర్ కోడ్‌లుగా తీసుకొచ్చి వాటి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తున్నది. ఈ లేబర్ కోడ్స్ అమలు జరిగితే కార్మిక సంఘాల ఏర్పాటు, కార్మిక హక్కులు హరించబడతాయి. జీతాల పెంపుదలకు కార్మికుల సమిష్టి బేరసారాల శక్తి బలహీనపడుతుంది. ఉద్యోగ భద్రత, ఉపాధికి గ్యారంటీ లేకుండా పోతుంది. దేశంలోని అన్ని రంగాల కార్మికులతో పాటు తెలంగాణ వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ యొక్క స్థితిగతులను సమీక్షించి కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు 2025 జూల్కె 9న దేశవ్యాప్త సమ్మెలో రాష్ట్రంలోని అన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీల సెక్యూరిటీ గార్డ్స్ అందరూ పాల్గొనాలని యూనియన్ రాష్ట్ర కమిటీ నిర్ణయించింది. సమ్మె నోటీస్‌ను వ్యవసాయ మార్కెటింగ్ సంచాలకులకు అందించింది.

# బాలకార్మికుల రక్షణలో తెలంగాణదే అగ్రస్థానం

## 2024-25లో 11,063 మంది బాలల రక్షణ

హైదరాబాద్ : 2024-25లో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్సీ) 38,388 రెస్క్యూ ఆపరేషన్ల ద్వారా మొత్తం 53,651 మంది పిల్లలను రక్షించగా, తెలంగాణ అగ్రస్థానంలో ఉన్నది, బీహార్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ తర్వాతి స్థానాల్లో నిలిచాయి. జేఆర్సీ అనేది 250కి పైగా ఎన్జీవోల నెట్వర్క్, బాలల రక్షణ కోసం పనిచేస్తున్న దేశంలోనే అతిపెద్ద నెట్వర్క్ ఇది. జేఆర్సీ పార్టనర్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ విడుదల చేసిన నివేదికలో బాలకార్మిక వ్యవస్థను అంతమొందించేందుకు జాతీయ మిషన్, రక్షించిన పిల్లల కోసం పునరావాస నిధిని ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది. బాలకార్మికులు, అక్రమరవాణా నెట్ వర్క్ లపై ఉక్కుపాదం మోపడం%శ్రీశీ% తెలంగాణ 2024-25లో బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనలో దేశంలోనే అగ్రగామిగా నిలిచింది. దేశవ్యాప్తంగా 250కి పైగా స్వచ్ఛంద సంస్థల నెట్వర్క్ ద్వారా 53,651 మంది చిన్నారులను రక్షించగా, ఒక్క తెలంగాణలోనే 11,063 మంది ఉన్నారు. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (జేఆర్సీ) అనే నెట్వర్క్ 24 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో నిర్వహించిన 38,388 చర్యల్లో 7,632 సహాయక చర్యలకు నాయకత్వం వహించింది. చట్టాన్ని అమలు చేసే సంస్థల సమన్వయంతో జేఆర్సీ పార్టనర్ లు ఈ ఆపరేషన్లు నిర్వహించారు. తాజాగా విడుదల చేసిన ఒక రిపోర్ట్ మరింత ఆందోళనకరమైన ధోరణులను వెల్లడిస్తుంది: భారతదేశం అంతటా రక్షించబడిన పిల్లలలో దాదాపు 90% మంది స్పాలు, మసాజ్ పార్లర్లు మరియు ఆర్కెస్ట్రాలతో సహా బాలకార్మికుల ఉపయోగించిన చెత్త



పనులుగా వర్గీకరించబడిన రంగాలలో పనిచేస్తున్నట్లు కనుగొనబడింది, ఇక్కడ పిల్లలు వ్యభిచారం, అశ్లీలత మరియు ఇతర రకాల లైంగిక దోపిడీకి గురవుతున్నారు. జేఆర్సీ పార్టనర్ ఇండియా చైల్డ్ ప్రొటెక్షన్ రీసెర్చ్ విభాగమైన సెంటర్ ఫర్ లీగల్ యాక్షన్ అండ్ బిహేవియర్ ఛేంజ్ (సీ-ల్యాబ్) ప్రచురించిన 'బిల్డింగ్ ది కేస్ ఫర్ జీరో: ప్రాసిక్యూషన్ బాలకార్మిక వ్యవస్థను అంతమొందించడానికి టిప్పింగ్ పాయింట్ గా ఎలా పనిచేస్తుంది' అనే రిపోర్ట్ లో ఈ విషయాలు వెల్లడయ్యాయి.

దాడుల అనంతరం 38,388 ఎఫ్ఐఆర్లు నమోదు చేసి, 5,809 మందిని అరెస్టు చేశామని, వీటిలో 85 శాతం బాలకార్మిక వ్యవస్థకు సంబంధించినవేనని నివేదిక పేర్కొంది. అత్యధికంగా జరిగిన దాడుల్లో తెలంగాణ అగ్రస్థానంలో నిలవగా, ఉత్తరప్రదేశ్ (2,469), రాజస్థాన్ (2,453), మధ్యప్రదేశ్ (2,335) తర్వాతి స్థానాల్లో నిలిచాయి. సహాయక చర్యల్లో తెలంగాణ 11,063 మంది, బీహార్ 3,974, రాజస్థాన్ 3,847, ఉత్తరప్రదేశ్ 3,804, ఢిల్లీ 2,588 మంది చిన్నారులను రక్షించాయి.మొత్తం 5,809 మందిని అరెస్టు చేయగా, వారిలో 85 శాతం మంది బాలకార్మిక సంబంధిత కేసుల్లో ఉన్నారు. తెలంగాణ, బీహార్, రాజస్థాన్ లో అత్యధిక అరెస్టులు నమోదయ్యాయని, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో రెస్క్యూ సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ తక్కువ అరెస్టులు జరిగాయని నివేదిక తెలిపింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా బాలకార్మిక వ్యవస్థను అంతమొందించేందుకు జాతీయ మిషన్ ను ప్రారంభించాలని, దానికి తగిన వనరులను కేటాయించాలని, జిల్లా స్థాయి బాలకార్మిక టాస్క్ ఫోర్స్ లను ఏర్పాటు చేయాలని నివేదిక సిఫార్సు చేసింది.బాలల రక్షణ కోసం పనిచేస్తున్న దేశంలోని అతిపెద్ద ఎన్జీవో నెట్వర్క్ నిర్వహించిన రెస్క్యూ ఆపరేషన్ల డేటా ఆధారంగా రూపొందించిన ఈ నివేదిక 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు ఉంది.బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చట్టపరమైన చర్యలు, విద్య, పునరావాసం వంటి అంశాలను ఈ నివేదిక నొక్కిచెప్పి పలు సిఫార్సులు చేసింది. నేరస్థులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోకపోతే బాలకార్మిక వ్యవస్థను అరికట్టడం కష్టమవుతుందని నివేదిక పేర్కొంది. అంతేకాక రక్షించబడిన పిల్లల విద్య మరియు పునరావాసానికి ఏర్పాట్లు చేయకపోతే, వారు తిరిగి బాలకార్మికుల విషవలయంలో పడిపోతారు.అందువల్ల బాలకార్మిక పునరావాస నిధి అవసరం. అలాగే, 18 సంవత్సరాల వరకు ఉచిత మరియు నిర్బంధ విద్యను నిర్ధారించడం బాలకార్మిక వ్యవస్థను నివారించడంలో సహాయపడుతుందని, బడి మానేసిన పిల్లలు దోపిడీ కార్మికులలో చిక్కుకునే అవకాశం ఉందని నివేదిక పేర్కొంది.సమగ్ర విధాన మార్పులు, ప్రభుత్వ సేకరణలో బాలకార్మికుల వినియోగంపై జీరో టాలరెన్స్ విధానం, ప్రమాదకర పరిశ్రమల జాబితా విస్తరణ, రాష్ట్ర నిర్దిష్ట బాలకార్మిక విధానాలు, ఎస్ డి జి 8.7 గడువును 2030 వరకు పొడిగించడం, నేరస్థులపై కఠినమైన, కాలపరిమితితో కూడిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నివేదిక పిలుపునిచ్చింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ మరియు భారత ప్రభుత్వం గుర్తించిన విధంగా బాలకార్మిక వ్యవస్థ యొక్క అత్యంత చెత్త పనుల్లో పిల్లలను నిమగ్నం చేయడంపై ఆందోళన వ్యక్తం చేసిన జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ నేషనల్ కన్వీనర్ రవి కాంత్ మాట్లాడుతూ, "ఇంత పెద్ద సంఖ్యలో పిల్లలు బాలకార్మిక వ్యవస్థ యొక్క అత్యంత దారుణమైన పనుల్లో నిమగ్నమయ్యారు, ప్రభుత్వం మరియు పౌర సమాజం కృషి చేసినప్పటికీ, బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న మా జాతీయ సంకల్పం అసంపూర్తిగా మిగిలిపోయింది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుబడి ఉన్న ఐఎల్ వో కన్వెన్షన్ 182పై భారత్ సంతకం చేసింది. ఈ దిశగా భారత్ చిత్తశుద్ధితో ప్రయత్నాలు చేస్తోందని, ప్రోత్సాహకర ఫలితాలు వస్తున్నాయన్నారు.

ఇంకా ఆయన మాట్లాడుతూ "చట్టపరమైన చర్యలు ప్రజల మనస్సులో చట్టం పట్ల భయాన్ని సృష్టిస్తాయని, ఇది బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పనిచేస్తుందని ఈ నివేదిక రుజువు చేస్తుందని ఆయన అన్నారు. బాలకార్మికుల్లో అత్యంత దారుణమైన పరిస్థితుల్లో చిక్కుకున్న చిన్నారులకు న్యాయం జరుగుతుందని, దోషులను శిక్షించి, బాధితుల రక్షణ, పునరావాసం కోసం పటిష్టమైన యంత్రాంగాలను ఏర్పాటు చేసినప్పుడే సాధ్యమవుతుందన్నారు.ప్రభుత్వం ప్రాసిక్యూషన్ వ్యవస్థను బలోపేతం చేయాలి, బాలకార్మిక పునరావాస నిధిని ఏర్పాటు చేయాలి మరియు ఈ పిల్లలు స్వయం సమృద్ధి సాధించడానికి సమగ్ర పునరావాస విధానాన్ని రూపొందించాలి" అన్నారు.

# ఇరాన్‌పై అమెరికా దాడులను ఖండిరచండి

- రేపు అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు
- తెలంగాణ వామపక్ష పార్టీల పిలుపు

ఇరాన్‌పై సామ్రాజ్యవాద అమెరికా చేసిన బాంబుదాడులను ఖండిస్తూ అఖిల భారత వామపక్ష పార్టీలు దేశ వ్యాపితంగా నిరసన కార్యక్రమాలను చేయాలని పిలుపునిచ్చాయి. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాపితంగా అన్ని జిల్లా కేంద్రాల్లో రేపు (జూన్ 24న) నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ కార్యక్రమాల్లో ప్రజలు, ప్రజాతంత్రవాదులు, ప్రపంచ శాంతి కోరుకునే వారు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాయి. అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేసి ఇరాన్ సార్వభౌమాధికారాన్ని దెబ్బతీసేలా అమెరికా దాడులకు పాల్పడుతున్నది. ఇరాన్ అణ్వాయుదాలు తయారుచేస్తున్నాయనడానికి తమ వద్ద ఎలాంటి ఆధారాలు లేవని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ మరియు అమెరికా ఇంటలీజెన్స్ సంస్థలు వెల్లడిరచినా కూడా, అణ్వాయుదాలు తయారు చేస్తున్నదనే నెపంతో ఇరాన్‌పై ఈ దాడికి అమెరికా పూనుకోవడం ఉద్రిక్తతలను రెచ్చగొట్టడమే. ఇరాన్‌ను ధ్వంసం చేయడం, పశ్చిమాసియాపై సామ్రాజ్యవాద ఆధిపత్యం చెలాయించడానికే అమెరికా ఈ దుశ్చర్యలకు పాల్పడుతున్నది. ఇది ప్రపంచశాంతికి భంగం కలిగించడంతో పాటు, పశ్చిమాసియాపై ఆధారపడుతున్న భారత్ వంటి దేశాలపై, కార్మికులపై, సాధారణ ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపుతున్నది.సామ్రాజ్యవాద అమెరికా దుశ్చర్యను భారత ప్రభుత్వం ఖండిరచాలని, అమెరికా%-% ఇజ్రాయిల్ అనుకూల విదేశాంగ విధాన వైఖరిని విడనాడి, యుద్ధాన్ని ఆపడంలో భాగస్వామి కావాలని వామపక్ష పార్టీల సమావేశం డిమాండ్ చేస్తున్నది. శాంతిని కోరుకునే వారంతా సామ్రాజ్యవాద అమెరికా దాడులను ఖండిరచాలని సమావేశం కోరుతున్నది.

# హౌసింగ్ బోర్డు స్థలాలకు డిమాండ్

**మరోసారి రికార్డు స్థాయి ధరలతో కొనుగోళ్లు**

**గచ్చిబౌలిలో రూ. 33 కోట్లకు ఒక ప్లాట్ కొనుగోలు**

**హైదరాబాద్, జూన్ 23**

రాజధాని పరిసర ప్రాంతాల్లోని హౌజింగ్ బోర్డుకు చెందిన భూముల బహిరంగ వేలంలో మరోసారి రికార్డు స్థాయి ధరలు పలికాయి. గచ్చిబౌలి ప్రాంతంలోని ఒక కమర్షియల్ ప్లాట్ ను ఏకంగా రూ.33 కోట్లకు కొనుగోలు చేయడానికి ముందుకు రాగా, మరో చోట రూ. 13.51 కోట్లు పలికింది. రెండు ఎంఐజి ప్లాట్లను (%ుశ్రీశీం%) కూడా సుమారు 4.50 కోట్లకు పైగా వెచ్చించి బహిరంగ వేలంలో దక్కించుకోడానికి పోటీపడ్డారు. అలాగే చింతల్ ప్రాంతంలోని ప్లాట్లను కూడా కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేశారు. మొత్తం 11 ప్లాట్లను వేలం వేయగా రూ.65.02 కోట్ల మేర ఆదాయం వచ్చిందని హౌజింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ , హౌజింగ్ కమిషనర్ శ్రీ వి.పి.గౌతం తెలిపారు. నగరంలోని చింతల్, గచ్చిబౌలి, నిజాంపేట తదితర ప్రాంతాల్లో వివిధ రకాలైన ప్లాట్లకు సోమవారం నాడు హౌజింగ్ బోర్డు అధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. చింతల్ ప్రాంతంలో 266 చదరపు గజాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ ప్లాట్లు, గచ్చిబౌలి ప్రాంతంలో కమర్షియల్ ప్లాట్లు, నిజాంపేటలో 413 చదరపు గజాల ప్లాట్లు వీటిలో ఉన్నాయి. కూకట్ పల్లి కెపిహెచ్ బి కాలనీ కమ్యూనిటీ హాల్ లో నిర్వించిన ఈ స్థలాల వేలం పాటలో 55 మంది పాల్గొన్నారని హౌజింగ్ కమిషనర్ పేర్కొన్నారు. గచ్చిబౌలి ప్రాంతంలో 3271 చదరపు గజాల భూములు, చింతల్ ప్రాంతంలో 799.98 చదరపు గజాలు, నిజాంపేటలో 1653 చదరపు అడుగుల విస్తీర్ణంలోని %ఖీశ్రీఫ్ం%, వేలం వేయగా రూ.65.02 కోట్లు బోర్డుకు ఆదాయంగా వచ్చింది.గచ్చిబౌలి భూముల ద్వారానే సుమారు రూ.56 కోట్లు గచ్చిబౌలి హౌజింగ్ బోర్డు కాలనీలో ఉన్న 1487 గజాల కమర్షియల్ ల్యాండ్ ను గజానికి రూ.2.22 లక్షలు చొప్పున సుమారు రూ. 33 కోట్లకు కొనుగోలు చేశారు.

# సంపాదకీయం

## ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధ ప్రభావం

ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య ప్రస్తుతం జరుగుతున్న యుద్ధం ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ సంఘర్షణ కేవలం రెండు దేశాల మధ్య మాత్రమే కాకుండా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, భద్రత, వాణిజ్యంపై గణనీయమైన దుష్పరిణామాలను కలిగి ఉంది. ఈ యుద్ధం కేవలం తాజా ఘర్షణల పర్యవసానం కాదు, ఇది అనేక దశాబ్దాలుగా పాతుకుపోయిన రాజకీయ, మతపరమైన, వ్యూహాత్మక విభేదాల ఫలితం. ఈ రెండు దేశాలు భౌగోళికంగా పక్కపక్కన లేనప్పటికీ, వాటి మధ్య వైరం పశ్చిమ ఆసియా భౌగోళిక రాజకీయాలకు కీలకమైనది. ఇరాన్– ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధం భారత ఆర్థిక వ్యవస్థపై అనేక విధాలుగా ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా, భారత్ ఇంధన అవసరాల కోసం దిగుమతులపై ఎక్కువగా ఆధారపడి ఉన్నందున ఈ యుద్ధం కీలక పరిణామాలకు దారితీస్తుంది. భారత్ తన చమురు అవసరాలలో దాదాపు 85% దిగుమతులపై ఆధారపడి ఉంది. హోర్ముజ్ జలసంధిలో రవాణాకు అంతరాయం ఏర్పడితే ప్రపంచవ్యాప్తంగా ముఖ్యంగా భారతదేశంలో ముడి చమురు ధరలు భారీగా పెరుగుతాయి. చమురు ధరలు పెరిగితే, పెట్రోల్, డీజిల్, ఎల్‌పిజి, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్(ఏటిఎఫ్) వంటి ఇంధన ధరలు కూడా పెరుగుతాయి. ఇది ద్రవ్యోల్బణానికి దారితీస్తుంది. దిగుమతి బిల్లు పెరిగి, రూపాయి విలువ బలహీనపడే అవకాశం ఉంది. ఇంధన ధరలు పెరగడం వల్ల రవాణా ఖర్చులు పెరుగుతాయి. ఇది నిత్యావసర వస్తువులతో సహా అన్ని వస్తువుల ధరల పెరుగుదలకు దారితీస్తుంది. దిగుమతి చేసుకునే వస్తువుల ధరలు కూడా పెరుగుతాయి. ఇది సాధారణ ప్రజల కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది. ఇజ్రాయెల్‌కు ఆసియాలో భారతదేశం రెండో అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. బాస్మతి బియ్యం, వస్త్రాలు, రత్నాలు, ఆభరణాలు వంటి వస్తువులను భారత్ ఇజ్రాయెల్‌కు ఎగుమతి చేస్తుంది. యుద్ధం వాణిజ్యాన్ని ప్రభావితం చేస్తుంది. మధ్యప్రాచ్య దేశాలకు భారతదేశం చేసే ఎగుమతుల కోసం బీమా ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. ఇది భారతీయ ఎగుమతిదారులను ప్రభావితం చేస్తుంది. ఎర్ర సముద్రం గుండా వాణిజ్య మార్గాల్లో అంతరాయం ఏర్పడితే, షిప్పింగ్ ఖర్చులు, డెలివరీ సమయాలు పెరుగుతాయి. ఇది అంతర్జాతీయ సరఫరా గొలుసులను దెబ్బతీస్తుంది. మధ్యప్రాచ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెరిగే కొద్దీ, ప్రపంచ స్టాక్ మార్కెట్లలో ఒడిదొడుకులు పెరుగుతాయి. భారతీయ స్టాక్ మార్కెట్లు కూడా దీనికి మినహాయింపు కాదు. పెట్టుబడిదారులు అనిశ్చితి సమయంలో బంగారం వంటి 'సురక్షిత ఆశ్రయం' (%ఖుటవ ష్ఘుజవఅ%) ఆస్తులలో పెట్టుబడులు పెడతారు. ఇది స్టాక్ మార్కెట్ల నుండి నిధులను మళ్లిస్తుంది. అనిశ్చితి పరిస్థితులలో విదేశీ పెట్టుబడిదారులు భారత్ నుండి తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవచ్చు. మధ్యప్రాచ్యంలో ఉన్న భారతీయ కార్మికుల భద్రత, వారి స్వదేశానికి తిరిగి వచ్చే అవకాశం కూడా ఒక ఆందోళన కలిగించే అంశం. భారత్‌కు ఇజ్రాయెల్, ఇరాన్ రెండింటితోనూ మంచి సంబంధాలు ఉన్నాయి. ఇజ్రాయెల్‌తో రక్షణ, సాంకేతిక, వ్యవసాయ రంగాలలో సహకారం ఉంది. ఇరాన్ నుండి గతంలో పెద్ద ఎత్తున చమురును దిగుమతి చేసుకునేది, ఆంక్షలు ఉన్నప్పటికీ వారితో సంబంధాలను కొనసాగిస్తోంది. ఈ పరిస్థితులలో ఏ వైపు మొగ్గు చూపినా దౌత్యపరమైన సవాళ్లు ఎదురవుతాయి.

ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధం పశ్చిమ ఆసియాకు తీవ్ర అస్థిరత, ఆర్థిక సంక్షోభం, మానవతా సవాళ్లను తెచ్చిపెడుతుంది. ఈ సంక్షోభాన్ని పరిష్కరించడంలో, నియంత్రించడంలో అమెరికా పాత్ర కీలకమైనది. అయితే అది ఇజ్రాయెల్ భద్రతకు తన నిబద్ధతను, ప్రాంతీయ స్థిరత్వాన్ని కొనసాగించాల్సిన అవసరం మధ్య సమతుల్యతను సాధించాల్సి ఉంటుంది. అదే సమయంలో ఈ యుద్ధం భారతదేశానికి ఆర్థికంగా గణనీయమైన సవాళ్లను ఎదుర్కొనేలా చేస్తుంది. ఇంధనభద్రత, ద్రవ్యోల్బణ నియంత్రణ, వాణిజ్య మార్గాల భద్రత వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించాల్సి ఉంటుంది.

# తెలుగు కథకు ప్రపంచ గుర్తింపు తెచ్చిన పాలగుమ్మి



తెలుగు కథా సాహిత్యంలో ప్రముఖ రచయిత పాలగుమ్మి పద్మరాజు. అయన తన జీవిత కాలమంతా రచనలతోనే జీవనం సాగించారు. పాలగుమ్మి పద్మరాజు 1915 జూన్ 24న పశ్చిమ గోదావరి జిల్లా, అత్తిలి మండలంలోని తిరుపతిపురంలో జన్మించారు. విద్యాభ్యాసం స్వస్థలంలోనూ, ఇతర ప్రాంతాల లోనూ పూర్తి చేసుకున్న ఆయన 1939వ సంవత్సరం నుండి 1952 వరకు కాకినాడలోని పి.ఆర్. ప్రభుత్వ కళాశాలలో సైన్సు లెక్చరర్‌గా విధులు నిర్వహించారు. తన పంతొమ్మిదో యేట నుంచే రచనలు మొదలు పెట్టారు. మొదట ఛందోబద్ధంగా పద్యాలు రాసి తర్వాత వచనం లోకి వచ్చారు. పాలగుమ్మి పద్మరాజు తన సాహిత్య జీవన యానంలో 60 కథలు, ఎనిమిది నవలలు, 30 కవితలు... ఇంకా లెక్కలేనన్ని నాటికలు మరియు నాటకాలను రచించారు. ఆయన రాసిన 60 కథలలో గాలివాన, పడవ ప్రయాణం, ఎదురు చూసిన ముహూర్తం అనే మూడు సంపుటాలుగా వెలువడ్డాయి. తెలుగు మీద ఎంత పట్టు ఉందో ఇంగ్లీష్ మీద కూడా అంతే అధికారం ఉంది. అందుకే తాను రాసిన కథానికలను తానే ఆంగ్లంలోకి తర్జుమా చేసుకునే వారు. ఆ క్రమంలోనే 1958లో అంతర్జాతీయ కథానికల పోటీలో 'గాలివాన' కథ రాసి పంపితే బహుమతి వచ్చింది. "గాలివాన" తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మికే చెందుతుంది. ఈ కథను ప్రపంచం లోని అనేక బాషలలోకి అనువదించారంటే ఆ నవల సాహితీ ప్రపంచంలో ఎంతగా పేరు తెచ్చుకుందో అర్థం అవుతుంది. అయన మొదటి కథ "సుబ్బి". ఎన్నో కథలు రాసినప్పటికీ వాటిలో ప్రపంచ వ్యాప్తంగా పేరు తెచ్చిన కథ "గాలివాన" మాత్రమే. ఈ కథ 1952వ సంవత్సరంలో న్యూయార్క్‌లోని "హెరాల్డ్ ట్రిబ్యూన్"వారు నిర్వహించిన ప్రపంచ కథల పోటీలలో రెండువ బహుమతిని గెలుచుకుంది. ఈ పోటీలకు మొత్తం 23 దేశాల నుంచి 59 కథలు ఎంపిక కాగా, అందులో భారత దేశం నుంచి మూడు కథలు ఎంపికవగా.. అందులో గాలివాన ఒకటి. అలా తెలుగు కథను ప్రపంచ సాహితీ చరిత్రలో సగౌరవంగా నిలబెట్టిన ఘనత పాలగుమ్మి పద్మరాజుకే చెందుతుంది. ఆయన రాసిన నవలలో బతికిన కాలేజీ, నల్లరేగడి, రామరాజ్యానికి రహదారి, రెండో అశోకుడి మూన్నాళ్ల పాలన మొదలైన రచనలు ముఖ్యమైనవి. ఆయన రాసిన కవితలు, పద్యాలు, పాటలు, కథానికలు, నవలలు. రేడియో నాటకాల గురించి అందరికీ తెలిసినా సినిమా రచనల గురించి చాలా మందికి తెలియదు. ఆయన సినిమా ప్రవేశం కృష్ణశాస్త్రి ద్వారా జరిగింది. నాటికే దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు సినిమాలకు పాటలు రాస్తున్నారు. బిఎన్‌రెడ్డి సినిమా తీయాలనుకున్న సంగతి తెలిసి పద్మరాజుకు కబురు చేస్తే మద్రాసు వెళ్లారు. 1954వ సంవత్సరంలో ప్రముఖ తెలుగు సినిమా నిర్మాత బొమ్మిరెడ్డి నరసింహారెడ్డి, తాను వాహినీ పతాకం కింద నిర్మించిన "బంగారు పాప" అనే చిత్రానికి మాటలు రాయమని పద్మరాజును కోరారు. అప్పటి నుంచి దాదాపు మూడు దశాబ్దాల పాటు అనేక సినిమాలకు కథలు, పాటలు పాలగుమ్మి కలంనుంచి జాలు వారాయి. 'బంగారుపాప' సినిమాలో కోటయ్య పాత్ర ఎస్‌వి రంగారావుకు చాలా పేరు వచ్చింది. 'ఇటువంటి పాత్ర మళ్లీ నాకు దొరకలేదు' అని ఎన్నోసార్లు చాలామందితో సంబరంగా అనేవారట. ఆ తరవాత 'రంగుల రాట్నం' చిత్రానికి కథ మాటలు రాశారు. ఆ కథకు నంది అవార్డు వచ్చింది. రంగుల రాట్నం నటుడు చంద్రమోహన్ పాత్రకు ప్రాణం పోసి, ఆయనను చిత్ర సీమలో నిలబెట్టింది. తర్వాత భావ నారాయణ తీసిన 'గోపాలుడు భూపాలుడు' జానపద చిత్రానికి కథ, మాటలు అందించారు. మురారి నిర్మాణంలో వచ్చిన 'సీతామాలక్ష్మి' చిత్రానికి స్క్రీన్‌ప్లే రాశారు. సినిమా అంటే అవగాహన ఉండి పాటలు, మాటలు, కథ, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే, సంగీతం,.. అన్ని శాఖల లోనూ పని చేశారు. దేవుడిచ్చిన భర్త, బికారి రాముడు... చిత్రాలకు దర్శకత్వం వహించారు. మొత్తం 30కి పైగా సినిమాలకు పని చేశారు. ఎడిటింగ్, ప్రాసెసింగ్, బ్లాక్ అండ్ వైట్ నుంచి కలర్ దాకా అన్నీ చూసి నేర్చుకున్నారు. శ్రీరాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ సినిమాకు పాటలు రాయడానికి కృష్ణశాస్త్రి రావడం కొంచెం ఆలస్యం అయితే పద్మరాజు తో ఒక పాట రాయించారు, అదే 'రాకోయీ అనకోని అతిథి'. అంతకు ముందే 'భక్త ప్రహ్లాద' చిత్రానికి 'జననీ వర దాయనీ భవానీ' అనే గీతం కూడా రచించారు. దాసరిగారితో చాలా సినిమాలు చేశారు. దాసరి, పద్మరాజును 'మా గురువు గారు' అనే వారు. దాసరి, పద్మరాజు వద్ద రైటర్‌గా పని చేశారు. దాసరి ఒకేసారి నాలుగైదు సినిమాలు తీయడం వల్ల పద్మరాజు సలహాలను ఎక్కువగా అడిగేవారు. తరువాత భక్త శబరి, బంగారు పంజరం లాంటి అనేక సినిమాలలో పాలగుమ్మి పనిచేసినా... తన సినిమాలు విమర్శకుల ప్రశంసలు పొందినా, వ్యాపారపరంగా నష్టాలను చవి చూశాయి. పాలగుమ్మి దర్శకుడిగా "బికారి రాముడు" అనే సినిమాను తీసినా అది కూడా విజయవంతం కాలేదు. ఆ తరువాత పాలగుమ్మి నవల "నల్లరేగడి"ని "మాఊరి కథ" అనే పేరుతోనూ, "పడవ ప్రయాణం" అనే కథను "స్త్రీ" పేరు తోనూ సినిమాలు తీశారు. సాహితీ వినీలాకాశంలో వెలుగులు విరజిమ్ముతూ, ప్రత్యేక గుర్తింపు పొందిన అచ్చ తెలుగు రచయిత పాలగుమ్మి పద్మరాజు 1983 ఫిబ్రవరి 27న మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల...

# భారతీయ తత్త్వశాస్త్రానికి మార్గదర్శక దీపస్తంభాలు

భారతీయ తత్వశాస్త్రం, వేదాంత సిద్ధాంతం, సంస్కృత సాహిత్య పరిష్కారానికి తన జీవితాన్నే అంకితం చేసుకున్న మహా మనిషి పుల్లెల శ్రీరామ చంద్రుడు (అక్టోబరు 24, 1927 – జూన్ 24, 2015). 20వ శతాబ్దపు భారతీయ పండిత లోకంలో ఆయన ఒక వెలుగొందిన నక్షత్రంగా నిలిచారు. సంస్కృత భాష పట్ల అపారమైన ప్రేమ, వేదాల మీద లోతైన అవగాహన, తత్త్వ గ్రంథాలపై నిబద్ధత, విశ్లేషణ సామర్థ్యం ఆయన్ను ఋషి సమానంగా చేసి మానవ సంస్కృతిలో అమర చరిత్రగా నిలిపాయి. ఆయన జీవితం ఒక నిరంతర విజ్ఞానాధ్యయన ప్రయాణం. జీవన ధ్యేయంగా సంస్కృతం, తత్త్వ చింతనను స్వీకరించి, అన్వేషణను, అధ్యయనాన్ని, బోధనను త్రిబంధంగా మలిచిన వారిలో పుల్లెల ప్రథమ శ్రేణిలో నిలిచారు. పాండిత్యంలో, వ్యాస రచనలో, ఉపనిషత్ వ్యాఖ్యానంలో, వేదాంత విశ్లేషణలో ఆయనకు సమకాలీనుల్లో సాటి లేరు. ఆయన పదునైన తత్త్వ దృష్టి, సారగ్రాహిత్యం, భాషా పటిమ ఆయన రచనల్లో ప్రతిఫలించి, భక్తజన హృదయాల్లో చిరస్థాయిగా నిలిచాయి. 1927 అక్టోబరు 24న తూర్పుగోదావరి జిల్లా ఐనవోలు మండలం ఇందుపల్లి గ్రామంలో పుల్లెల సత్యనారాయణ శాస్త్రి, సత్యవతి దంపతులకు జన్మించిన శ్రీరామ చంద్రుడు చిన్ననాటి నుంచే పాండిత్య వాతావరణంలో ఎదిగారు. తండ్రి వద్దే పంచ కావ్యాలు, నైషధం, అనర్ఘ రాఘవం వంటి ప్రాచీన కావ్యాలను, సిద్ధాంత కౌముదిని అధ్యయనం చేశారు. ఆయన విద్యారంభం నరేంద్రపురం లోని సంస్కృత పాఠశాలలో మొదలై మైలాపూర్ సంస్కృత కళాశాలలో వేదాంత శిరోమణి విద్యతో పరిపుష్టి చెందింది. ఆంగ్ల భాషను వి.వెంకటాచలం అనే సహపాఠి వద్ద నేర్చుకొని, హిందీలో విశారదగా ఉత్తీర్ణులై మలికిపురం హైస్కూలులో హిందీ పండితుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. విద్య పట్ల ఉన్న అసాధారణ అభిరుచి ఆయనను అనేక విశ్వ విద్యాలయాల దాకా తీసుకెళ్లింది. బెనారస్ హిందూ యూనివర్సిటీలో అలంకార శాస్త్రంలో ఎం.ఎ., ఆంగ్లంలో ఎం.ఎ., హిందీలో ఎం.ఎ. పూర్తి చేశారు. 1966లో ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్.డి పొందారు. Contributions of Panditaraja Jagannatha to Sanskrit Poetics అనే అంశంపై చేసిన పరిశోధన ఆయన్ను తత్త్వ సాహిత్యంలో అధ్యయన శ్రేణి లోనూ, విశ్లేషణా దృష్టి లోనూ అగ్రగామిగా నిలిపింది. ఉద్యోగ జీవితంలో మలికిపురం నుండి అమలాపురం, వరంగల్, హైదరాబాద్, తిరుపతి వరకు వివిధ కళాశాలల్లో సంస్కృత పండితునిగా, లెక్చరర్‌గా, ప్రొఫెసర్‌గా సేవలందించారు. ఉస్మానియా విశ్వ విద్యాలయం ఆర్ట్స్ కళాశాలలో సంస్కృత విభాగ అధిపతిగా, సంస్కృత అకాడెమీ డైరెక్టర్‌గా, సురభారతి సమితి కార్యదర్శిగా, ఉపాధ్యక్షునిగా పలు బాధ్యతలు నిర్వర్తించారు.

ఆయన బోధనా శైలి లోతైన తత్త్వాన్ని సరళంగా వివరిస్తూ, శిష్యులకు ఆధ్యాత్మిక అధ్యయనంలో ఆరాటాన్ని కలిగించేదిగా ఉండేది. ఆయన రచనలు భారతీయ తత్త్వ శాస్త్రానికి మార్గదర్శక దీప స్తంభాలు. ఉపనిషత్తులపై ఆయన చేసిన వ్యాఖ్యానాలు – ఐతరేయ, కేన, కఠ, మాండూక్య, ఇశావాస్య, శ్వేతాశ్వతర, బృహదారణ్యక – విశ్లేషణా దృష్టిలో, భాషా నైపుణ్యంలో, తత్త్వనిష్ఠలో అత్యున్నతంగా నిలిచాయి. వేదాంత ప్రసారం కోసం రాసిన శంకర విజయం, ఉపనిషత్తుల సారం, శ్రీరామకృష్ణ పరమహంస చరితం, భగవద్గీత భావ దీపిక, వేదాంత దర్శనం, భారతీయ తత్త్వశాస్త్ర పరిచయం వంటి గ్రంథాలు ఆధ్యాత్మిక విభూతుల దృష్టికీ, సాధారణ పాఠకుల ప్రశ్నలకూ సమాధానాలుగా నిలిచాయి. బ్రహ్మసూత్ర శంకర భాష్యానికి తెలుగులో వ్యాఖ్యానం, భరతముని నాట్య శాస్త్రానికి తెలుగు వ్యాఖ్యానం, మహాభారత. సార సంగ్రహం" తో పాటు, శ్రీ వాల్మీకి రామాయణము (అనువాదం – 10 సంపుటాలు), అలంకార శాస్త్రంలో 16 గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానం వ్రాసిన ఏకైక పండితులు పుల్లెల. తమ పదునాలుగవ యేట నుండి రచనలు చేయడం ప్రారంభించారు. తెలుగు, సంస్కృత, ఆంగ్ల భాషలలో 200లకు పైగా పుస్తకాలను వెలువరించారు. ఆయన భాషాశైలి శాస్త్రీయంగా ఉండి కూడా అర్థవంతంగా ఉంటుంది. సంస్కృతం, తెలుగు, ఆంగ్లం భాషల్లో సమానమైన పట్టు కలిగిన పుల్లెల శ్రీరామ చంద్రుడు మల్టీ లింగ్వల్ స్కాలర్‌గా అంతర్జా తీయంగా గుర్తింపు పొందారు. భాషల మధ్య మాధుర్యాన్ని, తత్త్వాల మధ్య అన్వయాన్ని, భావాల మధ్య సంస్కారాన్ని నిర్మించిన తత్త్వవేత్త ఆయన. ఆయనకు భారత ప్రభుత్వం 2011లో పద్మశ్రీ పురస్కారం ప్రకటించింది. కేంద్ర సాహిత్య అకాడెమీ నుండి ఉత్తమ అనువాద పురస్కారం (1996), ఉత్తమ సాహితీ విమర్శ పురస్కారం (2002) లభించాయి. బిర్లా ఫౌండేషన్ వాచస్పతి పురస్కారం (2004), మహామహోపాధ్యాయ బిరుదు, తెలుగు విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ (2011), కేంద్ర రాష్ట్రీయ సంస్కృత సంస్థాన్ గౌరవ డి.లిట్ (2013), సి.పి. బ్రౌన్ అకాడమీ తెలుగు భాషా పురస్కారం (2011) తదితర ఎన్నో అవార్డులతో ఆయన్ను సత్కరించారు. రాష్ట్రపతి పురస్కారం, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాల విశిష్ట సత్కారాలు ఆయన సేవలకు గౌరవ సూచకాలు. విద్యార్థులపై ఆయనకున్న మక్కువ, ఉపాధ్యాయ ధర్మంపై ఆయనకున్న నిబద్ధత ఆయనను గౌరవప్రదమైన గురువుగా మార్చాయి. పరిశోధన పరంగా విద్యార్థులకు సహకరించడంలో ఆయన చిరస్థాయిగా గుర్తింపు పొందారు. జ్ఞానాన్ని వితరణగా పరిగణించి,

అధ్యయనాన్ని సాధనగా స్వీకరించి, తన శిష్య బృందానికి దారి దీపంగా నిలిచారు. శిష్యులు ఆయనకు కనకాభిషేకం చేసి, తన తత్త్వ ప్రయాణానికి అక్షర సాక్ష్యం ఇచ్చారు. ఆయన చివరి రోజుల్లో అనారోగ్యంతో బాధ పడుతూ, 2015 జూన్ 24న హైదరాబాద్ బంజారా. హిల్స్‌లోని స్టార్ హాస్పిటల్‌లో తుదిశ్వాస విడిచారు. భారతీయ తత్త్వ విజ్ఞానానికి జీవ రూపం ఇచ్చిన పుల్లెల శ్రీరామ చంద్రుడు, తన జీవితాన్ని ధర్మ సిద్ధాంతానికి, వేదాంత ప్రచారానికి అంకితం చేశారు. ఆయన రచనలు, బోధనలు, జీవన ఆదర్శం భావితరాలకు బోధనా చరిత్రగా నిలిచిపోతాయి. పుల్లెల శ్రీరామ చంద్రుడి జీవితకథ, భారతీయ ఆధ్యాత్మిక విజ్ఞాన సముపార్జనకు వెలకట్టలేని సంపద. భావితరాల్ని ప్రభావితం చేసే ఆయన సాహిత్య ప్రస్థానం, తపస్సుతో కూడిన పాండిత్యం, నిరంతర అధ్యయన సంకల్పం భారతీయ సంస్కృతిని, తత్త్వ దృష్టిని పదిలంగా నిలిపే శాశ్వత దీపం. అలాంటి మహానుభావుని వర్ధంతి (జూన్ 24) రోజున మనం ఆయనకు జ్ఞాపకార్థాంజలి ఘటించాల్సిందే.

# పాత్రికేయ దిగ్గజం జి.వి. కృపానిధి

తెలుగు నేలపై జన్మించి ఆంగ్ల పత్రికా రంగంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తెలుగు వారు ఎందరో ఉన్నారు. అలా స్వాతంత్ర్యానికి పూర్వం, అనంతరం కూడా తమ సత్తా చాటుకున్నారు. ఆంగ్ల భాషపై పట్టు, పాత్రికేయ విలువల పట్ల తమ నిబద్ధత నిరూపించు కున్నారు. అలాంటి వృత్తి నిబద్ధత కలిగిన వారిలో చాలా మంది పేర్లు నేటి తరానికీ తెలియవు. లంకా సుందరం, కోటంరాజు పున్నయ్య, మానికొండ చలపతి రావు, కోటంరాజు రామారావు, ఖాసా సుబ్బారావు, వరదరాజులు నాయుడు, జి.ఎస్ భార్గవ, జి.కె. రెడ్డి, కుందూరి ఈశ్వరదత్తు, సి. వై. చింతామణి, కె.వి రామశర్మ, మల్లాది రామారావు, జి.వి కృపానిధి, సి.వి. హెచ్ రావు, ఎ.ఎస్ రామన్, మొదలైన వారెందరో మేధావులు ఉన్నారు. వారిలో పలు ఆంగ్ల పత్రికలలో తన సత్తా చాటిన అనుభవశాలి, పత్రికా సంపాదకులు జి.వి. కృపానిధి ఒకరు. కృపానిధి 1896, జూన్ 24వ తేదీన కృష్ణా జిల్లా, మచిలీపట్నంలో జన్మించారు. అయన విద్యాభ్యాసం మచిలీపట్నంలో జరిగింది. తరువాత మద్రాసు ప్రెసిడెన్సీ కళాశాలలో బి.ఎ.ఆనర్స్ చదివి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైనారు. మద్రాసు న్యాయ కళాశాలలో చదివి బి.ఎల్.పట్టా పొందారు. టంగుటూరి ప్రకాశం పంతులు మద్రాసు నుండి ఒక ఆంగ్ల దినపత్రిక ప్రారంభించాలని నిర్ణయించుకుని 1928, అక్టోబరు 28 నుండి స్వరాజ్య అనే ఆంగ్ల దినపత్రికను ప్రకటించారు. కృపానిధి పత్రికలో మొదట కార్యాలయ నిర్వహణలో బాధ్యత వహించి తరువాత పత్రికా సంపాదక వర్గంలో సహాయ సంపాదకుడిగా చేరారు. ఆ పత్రిక ప్రారంభం నుండి 1935లో నిలిచిపోయే సమయానికి మూడు నెలల ముందు వరకు ఈ పత్రికలో పనిచేశారు. అయన ఇండియన్ న్యూస్ క్రానికల్ అనే పత్రికను స్థాపించిన వారిలో ఒకరు. ఆ పత్రిక 1947-50ల మధ్యకాలంలో వెలువడింది. కృపానిధి ఈ పత్రికకు అసోసియేటెడ్ ఎడిటర్‌గా వ్యవహరించారు. స్వరాజ్య పత్రిక నుండి వచ్చిన తరువాత ఢిల్లీలో దేవదాస్ గాంధీ సంపాదకత్వంలో వచ్చిన హిందుస్తాన్ టైమ్స్ పత్రికలో స్పెషల్ కరెస్పాండెంట్‌గా ప్రవేశించి కొంత కాలం పార్లమెంట్ కార్యకలాపాలను నివేదించిన విలేఖరిగా ఆ పదవిలో ఉండి, ఆ తర్వాత పత్రిక సంయుక్త సంపాదకునిగా (జాయింట్ ఎడిటర్)గా పనిచేశారు. స్వాతంత్ర్య సముపార్జన తర్వాత కృపానిధి ఆ పత్రికకు కొంతకాలం అసోసియేట్ ఎడిటర్ హోదాలో కూడ పనిచేశారు. ఆయన సుమారు 15 సంవత్సరాలు హిందుస్తాన్ టైమ్స్ పత్రికలో వివిధ హోదాలలో పనిచేశారు. హిందుస్తాన్ టైమ్స్ పత్రిక నుండి బయటకు వచ్చి, తర్వాత సౌత్ ఇండియా బుక్ ట్రస్ట్ ఛైర్మన్‌గా మూడు సంవత్సరాలు పనిచేసారు. తన సేవలు పత్రికా రంగానికే పరిమితం కావాలని పునరాలోచించి, తిరిగి పత్రికా రంగంలోనికే వెళ్ళి, బెంగుళూరు నుండి వెలువడే డెక్కన్?హెరాల్డ్ దినపత్రికలో పోతన్ జోసెఫ్ తర్వాత సంపాదకులుగా చేరారు. ఆ పత్రికకు 1958 నుండి 1966 వరకు మధ్య కాలంలో సంపాదకునిగా పనిచేశారు. డెక్కన్ హెరాల్డ్ పత్రికనుండి విరమించిన తరువాత ఆయన బెంగళూరులోనే తన విశ్రాంత జీవితాన్ని గడుపుతూ ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా వివిధ పత్రికలకు రచనలు చేశారు. పాత్రికేయులుగా, సంపాదకులుగా ఆంగ్ల పత్రికలలో విశిష్ట సేవలందించిన తెలుగువారిగా, కీర్తి ప్రతిష్టలను గడించిన కృపానిధి తమ 75వ యేట 1970, మే 5వ తేదీన బెంగుళూరులో మరణించారు. జర్నలిస్టులకు ఆదర్శనీయులుగా, మార్గదర్శకులుగా నిలిచారు.

# ఇరాన్‌పై అమెరికా దాడులు 3వ ప్రపంచ యుద్ధంగా మారనుందా !

ఇరాన్ చేస్తున్న అణ్వాయుధాల తయారీ ప్రయత్నాలను వ్యతిరేకించిన ఇజ్రాయిల్ తీసుకున్న తీవ్ర నిర్ణయంతో ఇరాన్ న్యూక్లియర్ ప్రదేశాలను లేదా ఫెసిలిటీలను నేరుగా "ఆపరేషన్ రైజింగ్ లయన్" కోడ్‌తో బాంబులతో పేల్చి మరో యుద్ధానికి తెర లేపారు ఇజ్రాయిలీ అగ్రనేత నేతన్యాహు. ఇప్పటికే ఉక్రెయిన్ – రష్యా, ఇజ్రాయిల్ – పాలస్తీనా యుద్ధాలు తీవ్ర స్థాయిలో కొనసాగుతున్న వేళ నేడు ఇజ్రాయిల్ – ఇరాన్ సంక్షోభం ముదిరినా వేళ అమెరికా 21 జూన్ 2025న ఇరాన్‌లోని మూడు అణ్వాయుధ తయారీ కేంద్రాలను బాంబులతో పేల్చడంతో ఈ సంక్షోభం మరో ప్రమాదకర మలుపు తిరగవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. నేడు ఇజ్రాయిల్ పక్షాన అమెరికా చేసిన తీవ్ర దాడులతో చైనా, రష్యా ఇరాన్ పక్షాన చేరితే మరో 3వ ప్రపంచ యుద్ధానికి తెర లేస్తుందేమో అని పౌర సమాజం భయపడుతున్నది. ఇప్పటికే గత 10 రోజులుగా జరుగుతున్న ఇజ్రాయిల్ – ఇరాన్ యుద్ధంలో ఇరాన్‌కు చెందిన 865 మంది చనిపోగా, 3,500ల వరకు గాయపడడం, టెహరాన్ నగరంలో కోట్ల డాలర్ల ఆస్తులు నష్టం కావడం జరిగింది. ఇజ్రాయిల్‌పై ఇరాన్ చేసిన ప్రతి దాడుల్లో రాజధాని టెల్ ఎ వీవ్‌తో పాటు ఇతర పౌర ఆవాసాలు నేలమట్టం కావడం, వంద వరకు ప్రాణాలు పోవడం, 500 వరకు గాయపడడంతో పాటు ప్రధాన రక్షణ కేంద్రాలే లక్ష్యంగా మారడం జరిగింది. ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయెతుల్లా అలీ ఖోమినీని చంపడానికి కూడా వెనకాడబోమని ఇజ్రాయిల్ తెలుపడం ఈ యుద్ధ తీవ్రతను సూచిస్తున్నది. 21 జూన్‌న అకస్మికంగా, అనూహ్యంగా అమెరికన్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న ఆక్షేపణీయ నిర్ణయంతో ఇరాన్‌లోని మూడు అణ్వాయుధ ప్రదేశాలు ఫర్డో, నటాంజ్, ఇస్ఫాహన్ కేంద్రాలను క్షణాల్లో నేలమట్టం చేయడంతో ఈ సంక్షోభం ముదిరి మరో భీకర యుద్ధంగా మారుతూ పాకానపడుతున్నట్లు తోస్తున్నది. ఇజ్రాయిల్ పక్షాన చేరి అమెరికా విజయవంతంగా చేసిన ఈ మూడు దాడులకు ప్రతిస్పందనగా చైనా, రష్యాలు ఇరాన్ పక్షాన చేరితే రానున్న రోజుల్లో 3వ ప్రపంచ యుద్ధ వాతావరణం నెలకొనవచ్చని అంచనా వేయడం జరుగుతున్నది. నేడు అమెరికా చేసిన బాంబు దాడులకు స్పందించిన చైనా ఈ చర్య మరో "ప్రమాదకర మలుపు తిరగవచ్చు (జేంజరస్ టర్నింగ్ పాయింట్)" అని తెలుపడం గమనార్హం. రెండు దేశాల మధ్య నెలకొన్న సంక్షోభంలో మూడవ దేశంగా అమెరికా దూరడంతో పాటు మిలటరీ చర్యలకు ఉపక్రమించడం సరైన నిర్ణయం కాదని, ఇది మరో యుద్ధానికి ఆజ్యం పోసినట్లు కనిపిస్తున్నదని చైనా విమర్శించడం చూస్తున్నాం. రష్యన్ అధ్యక్షులు పుతున్ మాట్లాడుతూ ఇజ్రాయిల్‌లో రష్యన్ భాష మాట్లాడే ప్రజలు 2 మిలియన్లకు పైగానే ఉన్నారని అంటూనే అనాదిగా రష్యా అరబ్, ఇస్లామిక్ దేశాలతో రష్యా మంచి సంబంధాలను కలిగి ఉందని తెలిపారు. నేడు యుద్ధ విరమణకు మార్గాలను వెతకాలని, కాల్పుల విరమణ చేసి చర్చలతో సమస్య పరిష్కారానికి కృషి చేయాలంటూ పరోక్షంగా అమెరికన్ ట్రంప్‌కు సలహా చురుకు ఇవ్వడం జరిగింది. ఇరాన్‌పై అమెరికా చేసిన బాంబు దాడులు నేటి సంక్షోభ మంటలకు ఆజ్యం పోస్తున్నాయి. నేడు తీవ్రంగా దెబ్బతిన్న ఇరాన్ ప్రతి చర్యలు ఎలా ఉండనున్నాయో అంచనాకు దొరకడం లేదు. అమెరికా దాడులకు ప్రతిగా ఇరాన్ కూడా తగు సమాధానం ఇస్తుందని ఇరాన్ విదేశాంగా మంత్రి స్పందించడా కొన మెరుపు. నేడు అన్ని విధాలుగా దెబ్బతిన్న ఇరాన్ తిరిగి ప్రతి చర్యలకు పూనుకోవడం ప్రశ్నార్థకంగానే తోస్తున్నది. నేడు ట్రంప్ తీసుకుంటున్న వివాదాస్పద నిర్ణయాలతో అమెరికా అంతర్గత సంక్షోభ నిరసన మంటలు కొనసాగడం, ప్రపంచ దేశాలు సుంకాల భారంతో వ్యతిరేకించడం జరుగుతోంది. ఇరాన్‌లోని బషేహర్ అణు కేంద్రంపై ఇజ్రాయిల్ దాడి జరిగితే నాటి "చెర్నోబిల్ తరహా మారణహోమం" జరగవచ్చని కూడా హెచ్చరిస్తున్నారు.

# ప్రజావాణికి (76) ఫిర్యాదులు

**ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిస్తూ సత్వరమేపరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు.**



రంగారెడ్డి జిల్లా జూన్ 23(వుదయం ప్రతినిధి): సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమవేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చినప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపుకలెక్టర్ ప్రతిమ సింగ్, డీఆర్ఓ సంగీతతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు ప్రతి సోమవారంనిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపైసత్వరమే స్పందించి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు.అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ,సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోజు నిర్వహించినప్రజావాణి కార్యక్రమానికి మొత్తం (76) ఫిర్యాదులు వచ్చాయని, వాటినివెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలనిసూచించారు. రెవెన్యూ శాఖ 31, ఇతర శాఖలకు 45, మొత్తం 76 దరఖస్తులు అందాయి.అనంతరం జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో మాట్లాడుతూవన మహోత్సవం లో జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయుటకు సంబంధితశాఖల అధికారులు మొక్కలు నాటేందుకు స్థలాలను గుర్తించి గుంతలు తీసిసిద్ధంగా ఉంచాలని, అవసరమైన మొక్కలను నర్సరీలలో అందుబాటులో ఉంచాలని,నాటిని ప్రతి మొక్కను సంరక్షించాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లావైద్యాధికారికి సూచించారు. జిల్లాలో రైతులకు ఎరువులు, విత్తనాలుఅందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు,సమస్యలు తలెత్తకుండా చూడాలని వ్యవసాయ శాఖాధికారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూఅధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండలతహశీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ ప్రగతి నగర్‌లో శాన్‌ఫోర్ట్ గ్రూప్ 4వ ప్రీస్కూల్‌ను ప్రారంభం

**1.5 నుండి 5ం సంవత్సరాల వయస్సు గల పిల్లలకు శాన్‌ఫోర్ట్ యొక్క సరికొత్త హైదరాబాద్ కేంద్రంలో ఇప్పుడు అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి.**



హైదరాబాద్,జూన్ 23(వుదయం పతినిధి): : హైదరాబాద్‌లో ప్రగతి నగర్‌లో పనిచేస్తున్న నాల్గవ ప్రీస్కూల్ శాఖను ప్రారంభించడంతో శాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రారంభ బాల్య విద్యలో తన ఊపును బలోపేతం చేస్తూనే ఉంది. ఈ విస్తరణ తెలంగాణలో బ్రాండ్ వారసత్వాన్ని మరింత పెంచుతుంది, ఈ ప్రాంతంలోని అదనపు కుటుంబాలకు ప్రపంచ స్థాయి ప్రారంభ అభ్యాస అనుభవాలను అందిస్తుంది.

ఎన్ ఆర్ ఐ కాలనీలోని జగన్ స్టూడియోస్ సమీపంలోని మాగ్విస్టా విల్లాస్‌లోని విల్లా నంబర్ 15 వద్ద ఉన్న ఈ కొత్తగా ప్రారంభించబడిన కేంద్రం ఇప్పటికే తల్లిదండ్రుల నుండి ఉత్సాహభరితమైన ప్రతిస్పందనను పొందింది. 2025 26 విద్యా సంవత్సరానికి ప్రారంభమయ్యాయి, ప్రస్తుతం 1.5 సంవత్సరాల నుండి 5ం సంవత్సరాల వయస్సు గల పిల్లలను చేర్చుకుంటున్నారు.ఈ సందర్భంగా డాక్టర్ ఎస్.కె. మాట్లాడుతూ, "హైదరాబాద్‌లో మా ఉనికిని విస్తరించడానికి మేము సంతోషిస్తున్నాము. ప్రగతి నగర్ ఒక అభివృద్ధి చెందుతున్న ప్రగతిశీల సమాజం, ఇక్కడి కుటుంబాలకు ప్రపంచ ఆవిష్కరణలను భారతీయ విలువలతో మిళితం చేసే ప్రీస్కూల్‌ను అందించడానికి మేము గర్విస్తున్నారు ఇది నగరంలో మా నాల్గవ కేంద్రం – ఖచ్చితంగా చివరిది కాదు" అని సాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకుడు & ఛైర్మన్ రాథోడ్ అన్నారు.

సృజనాత్మక ఆట, కళ చేతిపనులు, సంగీతం కదలిక సెషన్‌లు, కథ చెప్పే థియేటర్ కాన్సెప్ట్–ఆధారిత డిస్కవరీ ల్యాబ్‌ల కోసం ప్రత్యేక కార్యాచరణ మండలాలు అదనపు లక్షణాలలో ఉన్నాయి. ఈ కేంద్రం ఇంటరాక్టివ్ స్మార్ట్ ప్యానెల్‌లు, ఏఆర్–ఆధారిత అనుభవ మాడ్యూల్స్, డిజిటల్ ప్రోగ్రెస్ ట్రాకింగ్ సజావుగా అభ్యాస అనుభవాన్ని నిర్ధారించడానికి యాప్‌ను కూడా అనుసంధానిస్తుంది.శాన్‌ఫోర్ట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ సహ వ్యవస్థాపకురాలు & డైరెక్టర్ కవితా రాథోర్ ఇలా మాట్లాడుతూ , "ప్రతి శాన్‌ఫోర్ట్ కేంద్రం ప్రేమ శ్రద్ధతో నిర్మించబడింది, కానీ ఇది ప్రత్యేకంగా ప్రత్యేకమైనది. సందర్శించే తల్లిదండ్రుల నుండి మాకు ఇప్పటికే అందిన వారి అభిప్రాయం చాలా సానుకూలంగా ఉంది. ఉత్సాహంగా వారి పిల్లల అభ్యాస ప్రయాణంలో భాగం కావడం మాకు గౌరవంగా ఉంది."1999లో విద్యావేత్తలు డాక్టర్ ఎస్.కె. రాథోర్ కవితా రాథోర్ స్థాపించిన శాన్‌ఫోర్ట్, భారతదేశంలో ప్రీస్కూల్ విద్యను దాని పిల్లల–కేంద్రీకృత, ప్లేవే–ప్రేరేపిత యకె–ఆధారిత పద్ధతితో విప్లవాత్మకంగా మార్చింది. దీని యాజమాన్య కోర్ వాల్యూ సర్కిల్ ప్రతి బిడ్డ అభివృద్ధి ప్రయాణంలో నైతిక విలువలు, జీవిత నైపుణ్యాలు, భావోద్వేగ మేధస్సు అనుభవపూర్వక అభ్యాసాన్ని పొందుపరచడానికి ఒక విలక్షణమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందిస్తుంది.

నేడు, ఈ బృందం భారతదేశం, నేపాల్ బంగ్లాదేశ్ అంతటా 250 కి పైగా కేంద్రాలను నిర్వహిస్తోంది. టచ్ 'ఎన్' లెర్న్ టెక్నాలజీని ఇటీవల, బాల్య విద్యలో ఆగ్మెంటెడ్ రియాలిటీ మాడ్యూళ్ళను ప్రవేశపెట్టినందుకు గుర్తింపు పొందింది. ప్రీస్కూల్ అభ్యాసంలో దాని ఆవిష్కరణకు శాన్‌ఫోర్ట్ 90 కి పైగా జాతీయ అంతర్జాతీయ అవార్డులను గెలుచుకుందన్నారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే ఫైన్ కట్టాల్సిందే

–కార్పొరేషన్ పరిధిలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన మున్సిపల్ సిబ్బంది
–ఇకపై చెత్త బహిరంగ ప్రదేశాల్లో వేస్తే ఎంతటి వారికైనా ఫైన్ తప్పదని హెచ్చరిక
–స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది, వార్డు ఆఫీసర్ లింగమయ్య





మేడిపల్లి జూన్ 23(వుదయం ప్రతినిధి): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మున్సిపల్ కమిషనర్ త్రిళేశ్వర్ రావు ఆదేశాల మేరకు సోమవారం మున్సిపల్ సిబ్బంది, 18వ డివిజన్ వార్డు ఆఫీసర్ బాస లింగమయ్య 18వ డివిజన్ లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పీర్జాదిగూడ మినీ ట్యాంక్ బండ్ సమీపంలో చెత్త పడవేసిన ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారి దగ్గర నుండి ఫైన్ కట్టించుకొని వారికి రషీద్ ఇచ్చారు.అనంతరం వార్డు ఆఫీసర్ లింగమయ్య మాట్లాడుతూ...ప్రజలు ఎట్టి పరిస్థితుల్లో కూడా చెత్తను బహిరంగ ప్రదేశాల్లో పడ వెయ్యొద్దని,తమ ఇంటిలోని తడి, పొడి చెత్తని కేవలం చెత్త సేకరణ వాహనాలలో మాత్రమే వేసి మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశ సమైక్యత కోసం తపించిన ఆ మహానేత డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ

**ముఖర్జీ గారి వర్ధంతి సందర్భంగా నివాళులు అర్పించిన బీజేపీ నాయకులు**





హుస్నాబాద్ జూన్ 23(వుదయం ప్రతినిధి): ఈ రోజు హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద భారతీయ జనసంఘ్ వ్యవస్థాపక అధ్యక్షులు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి వర్ధంతి (బలిదాన్ దివాస్) సందర్భంగా దేశ ఐక్యత కోసం పరితపించిన ఆ మహానేతకు బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు, బీజేపీ నాయకులు ఘనంగా నివాళులు అర్పించారుఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ ఆధునిక భారతదేశపు గొప్ప జాతీయవాది, రాజనీతిజ్ఞుడు డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 1901 జూలై 6 కలకత్తాలో జన్మించారు. 1921 లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రెసిడెన్సీ కళాశాల నుంచి ఇంగ్లీష్ లో బి.ఎ. పట్టభద్రుడయారు. 1937–41 మధ్య కృషక్ ప్రజా పార్టీ – ముస్లిం లీగ్ సంకీర్ణ ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకుడుగా ఉన్నారు. హిందువుల ప్రతినిధిగా హిందూ మహాసభలో చేరి, 1944లో హిందూ మహాసభ అధ్యక్షుడయారు. తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడినపుడు ఆయన కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి అయ్యారు. లియాకత్ అలీ ఖాన్ తో కుదుర్చుకున్న ఒప్పందంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ 1950 ఏప్రిల్ 6 మంత్రి పదవికి రాజీనామా చేశారు. 1951 అక్టోబర్ 21న భారతీయ జనసంఘ్ పార్టీ ఏర్పాటు చేసి, ఆ పార్టీకి అధ్యక్షుడయ్యారు. భారతదేశంలో జమ్మూ కాశ్మీర్ విలీనం కోసం అవిశ్రాంతంగా పోరాటం చేసిన ఏకైక రాజకీయ నాయకుడు శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారిని తెలిపారు. 2019 డిసెంబర్ 6న జమ్మూ కాశ్మీర్ కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే రాజ్యాంగ అధికరణం 370ని రద్దు చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో డా.శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయం సాకారమైందన్నారు. కాశ్మీర్ స్వయం ప్రతిపత్తి రద్దు కోసం గురుజీ పోరాటాన్ని ప్రారంభించగా, శ్యామా ప్రసాద్ ముఖర్జీ ముందు తీసుకెళ్లారు. శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారు 'ఏక్ దేశ్ మే, దో విధాన్, దో ప్రధాన్ ఔర్ దో నిషన్ నహీ చలేగా' ( ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు, ఇద్దరు ప్రధానులు, రెండు జెండాలకు స్థానం లేదని) ఉద్ఘాటిస్తూ ఉధృతంగా పోరాడారు. భారత్ లో కాశ్మీర్ ను విలీనం చేయాలన్న పిలుపు కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ప్రతిధ్వనించేలా శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోరాడారు. ఆ రోజుల్లో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రంలోకి ప్రవేశించడానికి అనుమతి అవసరం. ఈ ఆంక్షలను ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించి, అనుమతి లేకుండా ఢీల్లీ నుంచి కాశ్మీర్ లోకి ప్రవేశించేందుకు బయలుదేరి, కాశ్మీర్ లో అడుగు పెట్టగానే పోలీసులు ఆయనను అరెస్టు చేశారు. జైలు గదిలో పరిస్థితులు సరిగా లేక ఆరోగ్యం క్షీణించి, సరైన వైద్యం అందకపోవడంతో వాతావరణ పరిస్థితులు, ప్రజల నుంచి దూరం కావడం వంటివన్నీ ఆయనను మానసికంగా, శారీరకంగా కుగదీశాయి. 1953 జూన్ 23 డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారు అనుమానాస్పద పరిస్థితుల్లో జైలులోనే మరణించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారు చెప్పినట్లుగా పార్లమెంటులో 3 నుంచి 300 వరకు మన ప్రయాణం చాలా వరకు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ వల్లనే సాధ్యమైంది. ఆయన విజ్ఞానాన్ని, అరమరికలు లేని తీరును, దృక్పథాన్ని ఆయన మిత్రులతో పాటు శత్రువులు మెచ్చుకున్నారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడైన డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి బీజేపీ హుస్నాబాద్ పట్టణ శాఖ వినమ్ర పూర్వకంగా నివాళులు అర్పిస్తున్నాము. %ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గోళ్లపెల్లి వీరాచారి, బీజేవైయం జిల్లా ప్రధాన కార్యదర్శి కర్ణకంటి నరేష్, బీజేపీ సీనియర్ నాయకులు బోనగిరి రవి, వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్, కాదాసు నర్సయ్య, అశాడపు శ్రీనివాస్,హుస్నాబాద్ పట్టణ ఉపాధ్యక్షులు గాదాసు రాంప్రసాద్, కార్యదర్శులు వేల్పుల నాగార్జున్, వడ్డెపల్లి లక్ష్మయ్య, కోశాధికారి అకోజు అరుణ్ కుమార్, అధికార ప్రతినిధి నారోజు నరేష్, మండల కార్యదర్శులు బసిరెడ్డి రాకేష్ రెడ్డి, బానోతు అనిల్ నాయక్, మహిళా మోర్చా నాయకురాలు మేడవేని స్వరూప, కుంట స్వప్న, బీజేవైయం పట్టణ అధ్యక్షుడు పోలోజు రాజేందర్ చారీ, బూత్ అధ్యక్షుడు బుర్ర రాజు, బీజేపీ నాయకులు అబ్బిడి లింగారెడ్డి, లింగాల శ్రావణ్, నల్లా కుమార్, వొద్దుల అశోక్, సిరికొండ రమేష్, దాసరి లక్ష్మీ నారాయణ, మల్లెత్తుల మహేష్, నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

# జన్మదిన వేడుకలు

- భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రజలు
- విజయవంతమైన రక్తదాన శిబిరం













నాగర్ కర్నూల్ జూన్ 23(వుదయం ప్రతినిధి) ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పుట్టిన రోజు వేడుకలను జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు కేక్‌లు కట్ చేశారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక జిల్లా కేంద్రంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ కుచుకుళ్ళ సరిత రాజేష్ రెడ్డి దంపతులుచే సత్యనారాయణ స్వామి వ్రతం చేశారు. క్యాంప్ కార్యాలయంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయగా యువకులు, కార్యకర్తలు భారీగా రక్తదానం చేశారు. నియోజకవర్గం నుండి తరలివచ్చిన వేలాదిమంది ఎమ్మెల్యేకు బొకేలు ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. స్వీట్లు, కేక్‌లు తినిపించారు. పలువురు అధికారులు, వ్యాపార, వర్తక సంఘాలు, యువజన సంఘాల నాయకులు, జర్నలిస్టులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ , గ్రంథాలయ ఛైర్మన్ రాజేందర్ బర్త్ డే శుభాకాంక్షలు చెప్పారు.. పెద్దలు ఎంఎల్సీ దామోదర్ రెడ్డి ఆశీర్వాదం తీసుకున్నారు. బ్రాహ్మణ వేద పండితులు ఆశీర్వచనాలు ఇచ్చారు. అనంతరం గవర్నమెంట్ హాస్పిటల్ లో ఏర్పాటుచేసిన అన్నదానంలో అన్నం వడ్డించారు . భారీగా వచ్చిన వేలాది మందికి సాయి గార్డెన్స్ లో భోజనాలు ఏర్పాటు చేశారు.ప్రజాసేవకు జీవితం అంకితం : ఎమ్మెల్యేనా జీవితం ఇక ప్రజా సేవకే అంకితమని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తెలిపారు. డాక్టర్ గా ఉండి చేసిన సేవకంటే రాజకీయంలో ప్రజలకు చేస్తున్న సేవ ఎంతో సంతృప్తి ఇస్తుందన్నారు. మా నాన్న, ఎంఎల్సీ దామోదర్ రెడ్డిగారి అడుగుజాడల్లో చివరి శ్వాఅ వరకు రాజీయాల్లో ప్రజా సేవకు అంకితం అవుతానన్నారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదం, అండదండలతో ముందుకు సాగుతా అన్నారు. రాబోయే కాలంలో నాగర్‌కర్నూల్ ను విద్యా, వైద్యపరంగా అభివృద్ధి చేపడతానని అన్నారు.. ఈ కార్యక్రమంలోవివిధ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

# గ్రీవెన్స్ డే...

**బాధితుల సమస్యల పరిష్కారానికి చర్యలు...**
**జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్**
**బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశం...**

జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి) అనేక రకాల సమస్యలతో పోలీసులను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకోవడమే గ్రీవెన్స్ డే ముఖ్య లక్ష్యమని జిల్లా సుపరెండెంట్ ఆఫ్ పోలీస్ అశోక్ కుమార్ అన్నారు ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా తేదీ 23 6 2025 సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 21 మంది అర్జీదారులతో ఎస్పీ అశోక్ కుమార్ స్వయంగా కలసి వారి సమస్యలను తెలుసుకున్నారు సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి ఫిర్యాదుల పూర్తి వివరాలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు గ్రీవెన్స్ డే లో వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడంతో పాటు పెండింగులో లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు



బాధితుల యొక్క ప్రతి ఫిర్యాదును ఆన్ లైన్ లో పొందుపరుస్తూ నిత్యం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు

# పజావాణికి ఫిర్యాదులు

**ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారలకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.**

మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా జూన్ 23(వుదయం ప్రతినిధి): సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ హరిప్రియతో కలిసి కలెక్టరు (117) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే ధరఖాస్తుల గురించి అర్జీదారులకు ఎందుకు తిరస్కరిస్తున్నామనే విషయాన్ని తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు.

స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



**బిఆర్ఎస్ పార్టీ అధినేత ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో వినతిపత్రం అందించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు....**



చంద్రుగొండ, జూన్ 23ప్రుదయం ప్రతినిధి): మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో బిఆర్ఎస్ పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు సోమవారం ప్రభుత్వం అమలు చేయాల్సిన ఆరు గ్యారెంటీ లపై డిమాండ్ చేస్తూ బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు వినతి పత్రాన్ని గ్రామపంచాయతీ సెక్రెటరీ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామపంచాయతీ అధ్యక్షులు భూపతి రమేష్,సూర వెంకటేశ్వర్లు, చల్ల జానకి రాముడు, కొమ్మినేని చిన్న లక్ష్మయ్య, కీలవత్ శ్రీను నాయక్, ఉగ్గం శ్రీను, వెంకటేశ్వర్లు, అంజన రావు, పత్తిపాటి వెంకటేశ్వర్లు, ఆయా గ్రామ పంచాయతీ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పాల్గొని వినతి పత్రాలు అందజేయడం జరిగింది...

# అంత మా ఇష్టం...మేము ఇలాగే చేస్తాం...

- నిజాంపేట్ కార్పొరేషన్ లో ప్రజావాణి నిర్వహించేది ఇలాగేనా ?
- ప్రజావాణి నిర్వహణ తీరుపై ప్రజల అసంతృప్తి



కుత్బుల్లాపూర్, జూన్ 23,(ప్రుదయం ప్రతినిధి),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నామమాత్రంగా నిర్వహిస్తున్నారు. ప్రజావాణి అంటే మున్సిపల్ కమిషనర్, వివిధ విభాగాల అధికారులు సమక్షంలో ప్రజల ఫిర్యాదులు తీసుకొని పరిష్కరించే విధంగా నిర్వహించాలి కానీ ఒక వార్డ్ ఆఫీసర్ తో ఆరు బయట చైర్లు వేసి వచ్చిన ఫిర్యాదులు తీసుకొని స్టాంపేసి ఇవ్వడం ఇది ప్రజావాణి అంటారా ? నిజాంపేట్ కమిషనర్ సమాధానం చెప్పాలి అని ప్రజా నాయకుడు ఆకలి సతీష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కార్పొరేషన్ లో అధికారుల తీరు అంత మా ఇష్టం మేము ఇలాగే చేస్తాం అన్నట్టు ఉన్నదని, ప్రజావాణి నిర్వహణ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారని, అధికారుల తీరు మారాలని ఇప్పటికైనా అన్ని విభాగాల అధికారులతో కార్పొరేషన్ హాల్లో ప్రజావాణి నిర్వహించి ప్రజా సమస్యల ఫిర్యాదుల్ని తక్షణమే ప్రజావాణిలో పరిష్కరించే విధంగా ఏర్పాటు చేయాలని తెలిపారు.

# చెట్టును ఢీకొని వ్యక్తి మృతి



నిజాంసాగర్, జూన్ 23(ప్రుదయం ప్రతినిధి): చెట్టును ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన నిజాంసాగర్ మండలంలోని సుల్తాన్‌నగర్ గ్రామ సమీపంలో చోటు చేసుకుంది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మహ్మద్‌నగర్ మండలానికిచెందిన ఘని(30) అనే వ్యక్తి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు.

ఈ క్రమంలో సోమవారం కిరాణా సామాగ్రిని తీసుకువచ్చేందుకు నిజాంసాగర్‌కు తన టీవీఎస్ ఎక్సెల్ వాహనంపై వెళ్తుంగా అదుపుతప్పి చెట్టును ఢీకొన్నాడు. ఈ ఘటనలో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెళ్ళడిరచారు.

## నవోదయ రెండవ విడతలో ప్రవేశానికై స్లేట్ ఎక్సెలెన్స్ విద్యార్థుల ఎంపిక





జన్నారం, జూన్ 23,(ప్రుదయం విలేకరి) నవోదయ రెండవ విడతలో ప్రవేశానికై స్లేట్ ఎక్సెలెన్స్ విద్యార్థులు అర్హత సాధించారని ప్రిన్సిపల్ ఏనుగు శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.జన్నారం పట్టణంలోని స్లేట్ ఎక్సెలెన్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒడిసె మురళీకృష్ణ,బుద్దే రిషిత్ లు 2025-2026 విద్యా సంవత్సరం కి గాని 9వ తరగతిలో ప్రవేశానికై నిర్వహించిన నవోదయ విద్యాలయ ప్రవేశ పరీక్షల్లో రెండవ విడతలో అర్హత సాధించారని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు తల్లిదండ్రులు అభినందించారు.

# గ్రామపంచాయతీ సమస్యలను పరిష్కరించాలి

**-బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా**



భద్రాద్రి కొత్తగూడెం జూన్ 23 (ప్రుదయం ప్రతినిధి)లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని రేగళ్ల పెద్ద తండా గ్రామపంచాయతీలో బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి లావుడ్య పూర్ణ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు పిలుపు మేరకు పంచాయతీలలో నెలకొన్న సమస్యల పై రేగళ్ల పెద్ద తండా పంచాయతీ సెక్రెటరీ కి వినతిపత్రం అందజేశారు. అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని,సైడ్ కాలవలలో చెత్త చదరం పిచ్చి మొక్కలను తొలగించి పంచాయతీ లో పారిశుధ్యం బ్లీచింగ్ పౌడర్ శానిటేషన్ చేయాలని డిమాండ్ చేసారు. ఇండ్లలోని చెత్తను ప్రతిరోజు సేకరించి డంపు యాడుకు తరలించాలని, దోమల నివారణ చర్యలు వెంటనే తీసుకోవాలని, పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్నటువంటి గ్రామపంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్స్ ను తక్షణమే నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు భూక్యా సాగర్, లావుడ్య శ్రీహరి, నువ్వు నాతో రమేష్, అరుణ్, గూగులోత్ వీరన్న, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దమ్మపేట పోలీసువారి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిషాదం పై అవగాహన



దమ్మపేట, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 23ప్రుదయం ప్రతినిధి): దమ్మపేట పోలీస్ వారి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా సోమవారం మందలపల్లి హైస్కూల్ నందు చెట్లు నాటి అక్కడ గల విద్యార్థులకు మరియు గ్రామస్తులకు మరియు టీచర్లకు మాదకద్రవ్యాల నిషేధంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, దమ్మపేట పోలీస్ సిబ్బంది అలాగే హై స్కూల్ టీచర్లు మరియు గ్రామ పెద్దలు, పర్వతనేని వరప్రసాద్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొనడం జరిగింది.

# ఎమ్మార్పీఎస్ నాయకులపై పెట్టిన కేసులు వెంటనే ఎత్తివేయాలి.

## -జిల్లా కోర్టుకు హాజరైన ఎమ్మార్పీఎస్ నేతలు
## -ఎమ్మార్పీఎస్ నేత నక్క సతీష్ మాదిగ డిమాండ్




జగిత్యాల జూన్ 23(ప్రుదయం విలేఖరి):జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రధాన కోర్టు కు హాజరైన ఎమ్మార్పీఎస్ నాయకులు 2022 ఆగస్టు 3న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎస్సీ వర్గీకరణ సాధనే లక్ష్యంగా ప్రధానమంత్రి తెలంగాణ పర్యటన సందర్భంగా జాతీయ రహదారు దిగ్బంధంలో భాగంగా కరీంనగర్ ప్రధాన రహదారి మల్యాల ఎక్స్ రోడ్ వద్ద దిబ్బంధం చేయడం జరిగింది. దిగ్బంధం చేస్తున్న సమయంలో మల్యాల పోలీసులు స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించి ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.ఏ1 మీసాల సాయిలు, ఏ 2 నక్క సతీష్, ఏ 3 సురుగు శ్రీనివాస్ ఏ4 బొల్లె అనిల్, ఏ5 నలవాల వినోద్, ఏ6 బెజ్జంకి శ్రీనివాస్, ఏ7 దొనకొండ నరేష్, ఏ 8 కట్కూరి కరుణాకర్ లపై కేసు నమోదు అయ్యాయి. ఈ కేసుల నేపథ్యంలో సోమవారం స్థానిక కోర్టుకు హాజరయ్యారు. ఈ నక్క సతీష్ మాదిగ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో సుదీర్ఘకాలం పోరాడి ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని, న్యాయబద్ధమైన మా పోరాటాన్ని అణచి వేయడానికై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఉద్యమాన్ని ఆపే విధంగా ప్రయత్నించారని అన్నారు. ప్రభుత్వం వెంటనే ఎమ్మార్పీఎస్ ఉద్యమకారులపైన పెట్టిన కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

# ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కందికట్ల జయ.

**ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్.**



ఖానాపురం జూన్ 23ప్రుదయం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా కందికట్ల జయను నియమించి నియామక పత్రంను అందజేసినట్లు ఉద్యమకారుల పోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యమకారుల పోరం మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ నన్ను ఉద్యమకారుల ఫోరం మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించడం సంతోషంగా ఉందని తెలుపుతూ ఈనెల 19 వరకు ఉమ్మడి జిల్లా మహిళా విభాగం కో కన్వీనర్ గా పూర్తిస్థాయిలో పనిచేశానని తెలుపుతూ, రాష్ట్ర అధ్యక్షుని సలహా సూచన మేరకు ఉద్యమకారుల సమస్యలపై పోరాడుతానని తెలుపుతూ నా నియమాకానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు పత్రికా ముఖంగా తెలుపుతున్నట్లు ఆమె తెలిపారు. ఉద్యమకారుల ఫోరం మహిళ విభాగం రాష్ట్ర కార్యదర్శికి పలువురు ఉద్యమకారులు అభినందనలు తెలిపారు.

# తిమ్మారనిపహాడ్ చెన్నరావుపేట మండలం, నర్సంపేట నియోజకవర్గం వరంగల్ జిల్లా

**చెన్నరావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం తిమ్మరాని పహాడ్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించినారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నర్సంపేట మాజీ శాసనసభ్యులు గౌరవ శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ**




**చెన్నారావుపేట మండలాన్ని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీది**చెన్నరావుపెట జూన్ 23(ప్రుదయం ప్రతినిధి): చెన్నరావుపేట మండలంలోని ప్రతి తండా, గ్రామ అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళికతో పనిచేసిన గెలిచిన ఎమ్మెల్యే తన సొంత మండలానికి 18 నెలల కాలంలో ప్రత్యేకంగా ఎన్ని నిధులు తెచ్చాడో ప్రెస్ మీట్ ద్వారా ప్రజలకు చెప్పాలిచెన్నారావుపేట మండలంలోని పది తండాలకు బీటీ రోడ్లను 9 కోట్లతో మంజూరు చేస్తే నేడు వాటన్నింటినీ రద్దు చేసిన ఘనత గెలిచిన ఎమ్మెల్యేది సొంత ఏజెన్సీ కోసం, కాంట్రాక్టర్ పనుల కోసం తండాలకు మంజూరైన బీటీ రోడ్లను రద్దు చేశారు నేను తెచ్చిన నిధులతోనే గెలిచిన ఎమ్మెల్యే, బీటీ రోడ్ల పనులు చేస్తున్నాడునేను మంజూరు చేసిన బ్రిడ్జిలను చెక్ డ్యాములను బీటీ రోడ్లను కమిషన్ల కోసం అమ్ముకుంటున్నారుచెన్నారావుపేట మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజకీయాల కోసం ఓట్ల కోసం ప్రజలను వాడుకుంటున్నారు

నేను ఓటమి చెందినప్పుడు బాధపడలేదు కానీ ఇప్పుడు అభివృద్ధి నిలిచిపోయినందుకు బాధపడుతున్నానునాడు నేను శాసనసభ్యుడి గా ఉన్నప్పుడు ముఖ్యమంత్రికేసీఆర్ గారిని ఒప్పించి ఇరిగేషన్ మరియు పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ల ద్వారా ప్రత్యేక జీవో నెంబర్ 396 %డ% 20 ద్వారా బ్రిడ్జిల నిర్మాణానికి 35 కోట్లా రూపాయల నిధులు తీసుకు రావడం జరిగింది. నాడు అసాధ్యం అనుకున్న బ్రిడ్జి నిర్మాణాన్ని మొండి పట్టుదలతో ఇరిగేషన్ డిపార్ట్మెంట్ ద్వారా ఇంటర్ స్టేట్ పర్మిషన్ తీసుకొని హైడ్రాలిక్ క్లియరెన్సతోపాటు అన్ని అనుమతులను తీసుకువచ్చాను.రెండు మండలాలను అనుసంధానం చేస్తూ మూడు వారదుల నిర్మాణానికి పూర్తిస్థాయి అనుమతులు తీసుకువచ్చినా18 నెలలు గడిచినా కూడా బ్రిడ్జిల్లా పనులు ప్రారంభం కాకపోవడం దురదృష్టకరంఈ ప్రాంత ప్రజల దీవెనలతో కే.సి.ఆర్ గారి అసీస్సులతో గెలిచిన అనతి కాలంలోనే ఎన్నడూ లేని విధంగా చెన్నారావుపేట మండలాన్ని,నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించినాపాకాల రంగాయ చెరువు ప్రాజెక్టు, జిల్లాహాస్పిటల్ %డ% మెడికల్ కాలేజ్ , నర్సింగ్ కళాశాల హార్టికల్చర్ రీసెర్చ్ సెంటర్ , ఎస్ సి బి సి ఎస్ టి. గురుకుల పాఠశాలలు ,కళాశాలలు ఏర్పాటు చేశాంచెన్నారావుపేట మండల కేంద్రంలో డబుల్ రోడ్డు సెంట్రల్ లైటింగ్ కు నిధులు,రైతు వేదికలు,గోదాములు, పల్లె దావకానలు, వివిధ గ్రామాలకు డబుల్ రోడ్లు,బీటీ రోడ్లు, సిసి రోడ్లతో పాటు , చెక్ డ్యాం కం..బ్రిడ్జి లాంటి చరిత్రలో నిలిచిపోయే అభివృద్ధి పనులను చేశాం ఎన్నికలు ఎప్పుడు వచ్చినా చెన్నారావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలికాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చినా ఆరు గ్యారెంటీలు 420 హామీల పైన ప్రజలు నిలదీయాలిగ్రామాలలో, తండాలలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలిరైతు భరోసాను ఎన్నికల భరోసాగా మార్చి, సంక్షేమ పథకాల పేరుతో ఎన్నికల్లో లబ్ది పొందాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు చూస్తున్నారుచెన్నరావుపేట మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అంకిత భావంతో పనిచేస్తున్నారు వారికి నా అభినందనలు,

కృతజ్ఞతలు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ ఇంచార్జ్, మాజీ జెడ్పిటిసి, మాజీ ఎంపీపీ, మండల పార్టీ నాయకులు, క్లస్టర్ బాధ్యులు , మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, మహిళా మరియు యువజన సంఘాల బాధ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిశీలనకు అధికారులతో కమిటీ ఏర్పాటు.



సూర్యాపేట జూన్ 23 (ప్రుదయం) ప్రజావాణి ధరఖాస్తులను పరిష్కరించేటప్పుడు ఖచ్చితమైన సమాధానం అర్జిదారాలకి తెలియజేయాలని అధికారులకి జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబుతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్ పవార్ పాల్గొని ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ధరఖాస్తులు శాఖల వారిగ పరిశీలించి పరిష్కరించాలని తెలిపారు. ధరఖాస్తులు ఎప్పటికప్పుడు వేగవంతంగా పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అన్నారు.జిల్లా అధికారులు వారి శాఖ పరిధిలోని సిబ్బందితో సమావేశం నిర్వహించి కార్యాలయ అధికారులకి విధుల విభజన గురించి తెలియజేయాలని అన్నారు.ఈ సంవత్సరం శాఖ పరంగా చేయపోయే కార్యాచరణ గత సంవత్సరం కంటే మెరుగ్గా,వేగవంతంగా ఉండేలా చూడాలని తెలిపారు.జిల్లా అధికారులు తమ శాఖ పరిధిలో ఉన్న లోకాయుక్త, మానవ హక్కుల కమిషన్, ఎస్ సి, ఎస్ టి కమిషన్, స్థానిక కోర్ట్ కేసు లకి సంబందించి కౌంటర్ ఫైల్, కేసు క్లోజ్, కోర్ట్ ఆర్డర్ అమలు లాంటివి తప్పనిసరిగా అమలు చేయాలని ప్రతి కార్యాలయంలో ఒక సీనియర్ అధికారిని కోర్ట్ కేసు లను చూసేందుకు నియమించుకోవాలని అన్నారు.ప్రజావాణి దరఖాస్తులలో భూ సమస్యల పై 34,ఇరిగేషన్ 6, మున్సిపాలిటీ 2, డిపిఓ 4,డిడబ్ల్యు ఓ 4 ఇతర శాఖలకు సంబందించినవి 49 మొత్తం 99 మొత్తం ధరఖాస్తులు వచ్చాయని వాటిని పరిష్కరించేందుకు సంబందిత అధికారులకి పంపించటం జరుగుతుందని తెలిపారు.ఈ సమావేశంలో డి ఆర్ డి ఎ పిడి వివి అప్పారావు, డి ఎఫ్ ఓ సతీష్ కుమార్, డి పి ఓ యాదగిరి, ఆడిటింగ్ అధికారి శ్యామ్ సుందర్, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, డి డబ్ల్యూ ఓ నరసింహారావు,డి ఈ ఓ అశోక్, సి పి ఓ కిషన్, సంక్షేమ అధికారులు దయానంద రాణి, శంకర్, శ్రీనివాస నాయక్, జగదీశ్వర్ రెడ్డి, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల అండగా సీఎంఆర్ఎఫ్ పథకం

బోథ్, జూన్ 23ప్రుదయం ప్రతినిధి): అత్యవసర సమయంలో నిరుపేదలకు సీఎం సహాయ నిధి పథకం అండగా నిలుస్తున్నదని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం నెరడిగొండ మండల కేంద్రానికి చెందిన గోతి చత్తర్ సింగ్ కు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరు అయిన రూ. 60 వేల విలువ గల చెక్కును బోథ్ ఎమ్మెల్యే అందజేశారు. సీఎంఆర్ఎఫ్ పథకం కోసం తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు

# డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు...



కుత్బుల్లాపూర్, జూన్ 23,(ప్రుదయం ప్రతినిధి),భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ బలి దివస్ సందర్భంగా నిజాంపేట బిజెపి అధ్యక్షులు బిక్షపతి యాదవ్ నిజాంపేటలోని హనుమాన్ టెంపుల్ వద్ద ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆ మహనీయుడి సేవలను గుర్తు చేసుకుంటూ అతని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించి వారి సేవలను గుర్తు చేసుకుంటూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎస్ సి మోర్చా అధికార ప్రతినిధి దాసి నాగరాజు, ప్రధాన కార్యదర్శి సచిన్, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, జిల్లా ఓబీసీ మోర్చా సెక్రెటరీ రవి యాదవ్, జిల్లా బిల్డర్ సెల్ కన్వీనర్ పద్మ ప్రసాద్, నిజాంపేట్ సెక్రెటరీ కౌశిక్ నాయుడు, ఓబిసి మూర్ఛ అధ్యక్షులు వెంకటేష్ ముదిరాజ్, సీనియర్ నాయకులు వేణు, ఈశ్వరరావు, బీజేవైఎం రఘు, నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# మధిర మున్సిపాలిటీలో కనీస అవసరాలు సౌకర్యాలు ఏర్పాటు చేయాలి: సిపిఎం



మధిర జూన్ 23 (వుదయం ప్రతినిధి) మధిర మున్సిపాలిటీ లో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు పేర్కొన్నారు.మధిర స్థానిక బోడెపూడి భవనం నందు మధిర పట్టణ కమిటీ, శాఖ కార్యదర్శుల,ముఖ్య కార్యకర్తల సమావేశం మండవ ఫణీంద్ర కుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మడిపల్లి గోపాలరావు మాట్లాడుతూ మధిర మున్సిపాలిటీలో కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలో పేద ప్రజలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, రేషన్ కార్డులు ఇవ్వటంలో ఈ ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని పేర్కొన్నారు. అభివృద్ధి అంటే కోట్ల రూపాయలతో రింగ్ రోడ్లు, డ్రైనేజీలు, మాత్రమే కావని వాటికన్నా ముందు కనీసం కనీస అవసరాలు పేద ప్రజలు బతకాలి అంటే వారికి ఇండ్లు ఇళ్ల స్థలాలు, విద్యా, వైద్యం, ఉపాధి లాంటి కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలు ఇప్పటికీ అమలు పరచటంలో పూర్తిగా వైఫల్యం చెందాయని తెలిపారు. మధిరలో కోట్ల రూపాయలతో వంద పడకల ఆసుపత్రిని నిర్మించి దానిని ఇప్పటికీ ప్రారంభించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు.మధిర నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ ఎమ్మెల్యేలు ఉన్న కాలంలో మాత్రమే పేదలకు రోడ్లు డ్రైనేజీలు ఏర్పాటు చేయబడ్డాయని అంతేకాకుండా మధిర మున్సిపాలిటీలో ఏ పేద కుటుంబానికి అయినా ఇండ్లు ఇళ్ల స్థలాలు అందాయంటే అది ఒక్క సిపిఎం పార్టీ ఎమ్మెల్యే ద్వారానే సాధ్యపడిందని తెలిపారు. మధిర మున్సిపాలిటీలో అర్జునవాడలో బంజారా కాలనీలో హనుమాన్ కాలనీలో ఎంప్లాయిస్ కాలనీలో ముస్లిమ్స్ కాలనీలో పేదలకు ఇండ్ల స్థలాలు ఇండ్లు ఇచ్చిన చరిత్ర ఒక్క సిపిఎం పార్టీ ఎమ్మెల్యేలకే సాధ్యపడింది అన్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు ప్రచారాల తప్ప ఒక్క పేదవాడికి కూడా ఇండ్లు ఇళ్ల స్థలాలు నేటికీ మధిర నియోజకవర్గంలో అందలేదని తెలిపారు. టిఆర్ఎస్ ప్రభుత్వంలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో పేద ప్రజలను మోసం చేసింది అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ఇందిరమ్మ ఇండ్ల పేరుతో దాచారం చేస్తుందన్నారు. టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీలు ఒకరిపై ఒకరు స్టేట్మెంట్ ఇవ్వటం కాకుండా పేద ప్రజల కనీస సౌకర్యాలు పై దృష్టి పెట్టాలని అన్నారు. మధిర నియోజకవర్గంలో పేద ప్రజల సమస్యలపై సిపిఎం పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఈ సందర్భంగా తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి పడకండి మురళి, జిల్లా కమిటీ సభ్యులు శీలం నరసింహారావు, పట్టణ కమిటీ సభ్యులు పాపినేని రామ నరసయ్య పుచ్చకాయల కిషోర్, ఫాతిమా బేగం, నాయకులు పెంటి వెంకటరావు సిద్దావలి, తేలపోలు రాధాకృష్ణ, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల్లో స్థిరమైన జీవన విధానాలపై ఆసక్తిని పెంచాలి,

## –పర్యావరణ సమస్యలపై చర్చలను ప్రోత్సహించాలి,

## –జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ,



నాగర్ కర్నూల్ జూన్ 23(వుదయం ప్రతినిధి) విద్యార్థి దశ నుంచే ప్రతీ ఒక్కరూ పర్యావరణ పరిరక్షణపై పూర్తి స్థాయి అవగాహన పెంపొందించుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ విద్యార్థి పర్యావరణ క్విజ్ పోటీల నమోదు అవగాహన పోస్టర్లును అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, డిఈఓ రమేష్ కుమార్ లతో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. నాగర్ కర్నూల్ జిల్లాలో కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ, విద్యా మంత్రిత్వ శాఖల ఆధ్వర్యంలో 1వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులకు అన్ని యాజమాన్య పాఠశాలల్లో 'హరిత్–జీవన మార్గం' నినాదంతో జాతీయ విద్యార్థి పర్యావరణ క్విజ్ పోటీలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ పోటీలు రూపొందించబడ్డాయని, విద్యార్థుల్లో స్థిరమైన జీవన విధానాలపై ఆసక్తిని పెంచడం, పర్యావరణ సమస్యలపై చర్చను ప్రోత్సహించడం ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశమని, ఈ క్విజ్ పోటీలు మొక్కలు నాటడం, వ్యర్థాలను వేరు చేయడం, నీటి సంరక్షణ వంటి కీలక అంశాలపై దృష్టి సారిస్తాయని కలెక్టర్ బాదావత్ సంతోష్ వెల్లడించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాల్లో చదివే విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు పర్యావరణ సమస్యలపై లోతైన అవగాహన పొందడమే కాకుండా, సమాజంలో సానుకూల మార్పులకు దోహదపడే విధంగా ప్రేరణ పొందుతారని కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న విద్యార్థులు జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు నమోదు కార్యక్రమాలను పూర్తి చేయించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాలయాల నిర్వాహకులు తమ విద్యార్థులను ఈ పోటీల్లో చురుగ్గా పాల్గొనేలా ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ కోరారు. ఈ క్విజ్ పోటీలు విద్యార్థులకు తమ జ్ఞానాన్ని పరీక్షించుకునే అవకాశంతో పాటు, హరిత భవిష్యత్తు నిర్మాణంలో భాగస్వాములవ్వే మార్గాన్ని సుగమం చేస్తాయని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు. ఇతర సమగ్ర సమాచారానికి జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయ జిల్లా సైన్స్ అధికారిని రాజశేఖర్ రావు 63025– 38858 నెంబర్ను సంప్రదించాలని కలెక్టర్ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రమేష్ కుమార్, కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, జిల్లా సైన్స్ అధికారి రాజశేఖర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

## –ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే జారే



జూన్ 23 దమ్మపేట, (వుదయం ప్రతినిధి) :దమ్మపేట విశాల సహకార పరమితి సంఘం ఆధ్వర్యంలో దమ్మపేట సొసైటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు భరోసా పథకం కింద వేలాది మంది రైతుల ఖాతాల్లో పెట్టుబడి సహాయం నేరుగా జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఉమ్మడి ఖమ్మంజిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి తుమ్మల నాగేశ్వరరావు చిత్రపటాలకు అశ్వారావుపేట నియోజకవర్గ రైతుల తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపి చిత్రపటాలతో పాటుగా కాంగ్రెస్ పార్టీ అగ్రనాయకుల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు మద్దిశెట్టి సత్యప్రసాద్, సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు కాకా రమేష్, ఆయిల్ ఫామ్ కమిటీ అడ్వైజర్ మెంబర్ ఆలపాటి శ్రీరామచంద్ర ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యురాలు సొంగా ఏసుమణి, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు రైతు సంఘాల నాయకులు సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు

# గ్రామ పంచాయితీల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని

## –బి ఆర్ యస్ పార్టీ డిమాండ్





జూన్ 23 దమ్మపేట, (వుదయం ప్రతినిధి): బిఆరెస్ పార్టీ పిలుపు మేరకు,జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు సూచన మేరకు, నియోజకవర్గ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు ఆదేశాల మేరకు సోమవారం మండల పార్టీ ఆధ్వర్యంలో 31 గ్రామ పంచాయతీలలో గ్రామ పార్టీ శ్రేణులందరూ వారి వారి గ్రామాలలో నెలకొన్న సమస్యలపై పంచాయతీ కార్యాలయ ముందు కాంగ్రెస్ ప్రభుత్వ వ్యతిరేక నినాదలతో నిరసన తెలియజేసి, పంచాయతీ కార్యదర్శులకు గ్రామ సమస్యలను వివరిస్తూ వినతి పత్రం ఇవ్వటం జరిగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలో ఉన్నటువంటి తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం వర్షాకాలం రాగానే పారిశుధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టడం జరిగింది, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు, మోస పూరిత వాగ్దానాలను ఇచ్చి గద్దెనెక్కిన ఈ ప్రభుత్వం టైం పాస్ రాజకీయాలతో ప్రజల జీవితాలతో ఆడుకుంటుంది, ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు గడిచినప్పటి నాటి నుండి నేటి వరకు గ్రామాల్లో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్న చందాగా ఉన్నది, కనీసం మురికి గుంటల వద్ద బ్లీచింగ్ చల్లే నాధుడు కూడా కరువైనాడని, వర్షాకాలం సీజన్ కావడంతో దోమలు,ఈగలతో ప్రజలు విష జ్వరాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు,మంచినీటి బావులలో ఇప్పటివరకు కనీసం బ్లీచింగ్ కూడా చల్ల లేదు, ప్రజలు కలుషితమైన నీటిని తాగడం వలన అనారోగ్య కారణాల వల్ల పేద ప్రజలు ఇబ్బంది పడుతున్నారు, రాత్రిపూట వీధిలైట్లు కూడా వెలగకపోవడంతో పాము,తేలు కుట్టి ప్రాణాలు పోయే పరిస్థితి ఉందని అన్నారు, రోడ్లన్నీ చెత్తాచెదారులతో నిండి కంపు కొడుతున్నాయని అన్నారు, గ్రామపంచాయతీ వర్కర్లకు సరైన జీతాలు ఇవ్వకపోవడం వలన వాళ్ళు కూడా ఆర్థికంగా ఇబ్బందులు ఎదురు కుంటున్నారని అన్నారు, తక్షణమే నిలిచిపోయిన పంచాయతీ నిధులను విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నాం. పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన వినతి పత్రం లో

1) అర్హత కలిగిన ప్రతి పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలి.

2) సైడ్ కాలువాలలో చెత్తా,చెదారం పిచ్చి మొక్కలను తొలగించి, బ్లీచింగ్ చల్లాలి.

3) మంచినీటి బావులు, నీరు నిల్వ ఉన్నచోట బ్లీచింగ్ చెల్లించి, వీధిలైట్లు వేయించాలి.

4) ఇండ్లల్లోని చెత్తను ప్రతిరోజు సేకరించి డంపు యార్డులకు తరలించాలి.

5) దోమల నివారణకు చర్యలు తీసుకొని ప్రజల ప్రాణాలు కాపాడాలి.

6) పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న గ్రామపంచాయతీలలో స్పెషల్ ఆఫీసర్లను నియమించి తక్షణమే అక్కడ సమస్యలను పరిష్కరించాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నాం.మండలంలోని 31 గ్రామ పంచాయతీ కార్యాలయల వద్ద నిరసన కార్యక్రమాలలో మండల కార్యదర్శి దొడ్డా రమేష్,నియోజకవర్గ నాయకులు సోయం విరభద్రం,వైస్ ఎంపీపీ దారా మల్లిఖార్జునరావు,మండల ఉపాధ్యక్షులు గాజుబోయిన యేసు బాబు,జిల్లా నాయకురాలు తూత నాగమణి,మాజీ సర్పంచ్ బెల్లం నాగమణి, సంకి వెంకట రమణ, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు యార్లగడ్డ శ్రీను, మండల యూత్ అధ్యక్షులు సత్య, నాయకులు జలగం వాసు, నాయకపోడు సంఘం జిల్లా అధ్యక్షులు రావుల శ్రీనివాసరావు, యస్, సి,సెల్ మండల అధ్యక్షులు రావూరి వీరయ్య,మద్దెల పుల్లారావు,తుమ్మల లక్ష్మనరావు, యలమంచి చంద్రశేఖర్, రెడ్డిమాళ్ళ నాగయ్య, చక్రదరావు,అబ్దుల్ జిన్న, పాకనాటి శ్రీను,మాజీ సర్పంచ్లు రూప్ సింగ్,నున్నం రాము, ఊకే వెంకటేశ్వరావు,సోయం రాజబాబు,బుడే,గోపి, కుకలకుంట రవి,, తదితరులు పాల్గొన్నారు.

# వాసవి కళ్యాణ మండపం లో ఆర్యవైశ్య మహాసభ ద్వితీయ కార్యవర్గ సమావేశం.

## సభ అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ గుప్తా.





నర్సంపేట జూన్ 23 (వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టనం లోని వాసవి కళ్యాణ మండపంలో వరంగల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ ద్వితీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి దుబ్బ శ్రీనివాస్ గుప్తా అధ్యక్షత వహించగా నర్సంపేట ఆర్యవైశ్య సంఘం ఆతిథ్యం అందించారు. ముఖ్య నాయకులు రాష్ట్ర కార్యదర్శి వంగేటి అశోక్ గుప్తా పాల్గొన్నారు. జిల్లా అధ్యక్షులు దుబ్బ శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ అన్ని మండలాల్లో కమిటీల నిర్మాణం ఏర్పాటు చేయాలని, మండల సమగ్ర సర్వే, సభ్యత్వ పెంపు, కొత్త కమిటీలు వేసి పునః నిర్మాణం చేయడం, పిల్లల ఆర్థిక స్థితిగతులు, సభ్యత టార్గెట్, జిల్లా కౌన్సిల్, స్టేట్ కౌన్సిల్ సభ్యత్వాలు ఎక్కువ చేసిన వారికి ఆర్థిక ప్రోత్సాహం అందించబడుతుందన్నారు. పర్మినెంటిగా జిల్లా కార్యాలయం ఏర్పాటు చేసుకోవడం కేటగిరీల వారిగా వివాహపరచవేదిక ఏర్పాటు చేసుకోవడం అమ్మాయిలు మరియు అబ్బాయిలు వచ్చి చూసుకోవాలని ఆరోగ్య విషయంలో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసుకోవాలన్నారు జిల్లాలో క్యాన్సర్ అండ్ మెగా హెల్త్ క్యాంపు ఏర్పాటు చేయాలన్నారు, విద్యా విభాగంలో హాస్టల్ మరియు స్కాలర్షిప్ విద్యలు పుస్తకాలు నోట్ బుక్స్ ఇతర సౌకర్యం కోసం కంపెనీ సంప్రదించాలన్నారు సేవాదళ్ ద్వారా సేవా కార్యక్రమాలు మండల వారి ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశానికి నర్సంపేట ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆతిథ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి గార్లపాటి నాగేంద్రబాబు, గంధ శ్రీనివాస్ గుప్తా, సింగగిరి కొండ మాధవ శంకర్ గుప్తా, పబ్బ రమేష్ గుప్తా, జిల్లా పొలిటికల్ ఇంచార్జ్ మల్యాల వినయ్ కుమార్ గుప్తా, జిల్లా కార్యవర్గం మండల అధ్యక్షులు మండల కార్యవర్గం తదితరులు పాల్గొన్నారు.

# ఒకే రాజ్యాంగం, ఒకే ప్రధాని, ఒకే చట్టం ఉండాలని ఆశించిన గొప్ప జాతీయవాది శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ.



నర్సంపేట వుదయం ప్రతినిధి జూన్ 23. భారతీయ జనతా పార్టీ నర్సంపేట నియోజకవర్గం కార్యాలయంలో బిజెపి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ (జనసంఘ్) వ్యవస్థాపకులు వర్ధంతి బలిదాన్ దివాస్ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించినారు. అనంతరం వివిధ వార్డులలో మొక్కలు నాటినారు. ఈ కార్యక్రమంను ఉద్దేశించి పట్టణ అధ్యక్షులు గూడూరు సందీప్, బిజెపి మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మల్యాల వినయ్ కుమార్ గుప్తా మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన మహనీయుడు శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ అని , నెహ్రూ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఆర్టికల్ 370 చట్టాన్ని వ్యతిరేకిస్తూ , కేంద్రమంత్రి పదవి కి రాజీనామా చేసి జనసంఘ్ ను స్థాపించి దేశంలో ఒకే రాజ్యాంగం ఒకే ప్రధాని, ఒకే చట్టం ఉండాలని ఆశించిన గొప్ప జాతీయవాదని, వారి స్ఫూర్తి తోనే మన ప్రియతమ ప్రధాని నరేంద్ర మోదీ ఆర్టికల్ 370, 35 –ఏ రద్దు చేయటం జరిగిందని గుర్తుచేశారు. దేశ సమగ్రతను, ఐక్యతను కాపాడేందుకు వారు చేసిన పోరాటం ప్రతి భారతీయుడికి ప్రేరణాత్మకం, విలువలు కోసం కట్టుబడిన వారి జీవితం మనకు స్ఫూర్తిదాయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మాజీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ మల్యాల వినయ్ కుమార్ గుప్తా, మాజీ కౌన్సిలర్ బోడ గోల్యా నాయక్, జిల్లా కౌన్సిల్ మెంబర్ పాదిళ్ల రామచందర్, నర్సంపేట పట్టణ ప్రధాన కార్యదర్శులు కందికొండ శ్రీనివాస్, సూత్రపు సరిత, మహిళా మోర్చా నాయకురాలు మార్త సంధ్యారాణి, బీజేవైఎం జిల్లా నాయకులు జూలూరి మనీష్ గౌడ్, అచ్చ దయాకర్, కొంకీస విగ్నేష్ గౌడ్, చిలువేరు అన్వేష్ నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు కాసుల నాగేంద్రబాబు, కందగట్ల నాగరాజు, పోనుగోడు రవీంద్ర చారి, తౌటమ్ నిశాంత్, ముత్యాల శ్రీనివాస్, మాస్ శివ, చేను నరేష్, తప్పెట్ల సతీష్, శ్రీకాంత్త తదితరులు పాల్గొన్నారు.

# పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

## –వర్ధన్నపేట మార్కెట్ చైర్మన్ నరకుడు వెంకటయ్య



రాయపర్తి జూన్ 23(వుదయం ప్రతినిధి ): గ్రామాలలో నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని వర్ధన్నపేట మార్కెట్ కమిటీ చైర్మన్ నరకుడు వెంకటయ్య అన్నారు. సోమవారం మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ వ్యవసాయ మార్కెట్ కమిటీ వర్ధన్నపేట ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్య, వైస్ చైర్మన్ సరికొండ కృష్ణా రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాడి పశువుల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరాల నిర్వహించాలని పశువులలో దీర్ఘకాలం గర్భం దాల్చని పశువులను గుర్తించి, కృతిమ గర్భధారం దూడలకు నట్టల నివారణ మందులు విటమిన్ ఇంజక్షన్లు ఇప్పించి. మేలు జాతి పాడి పశువుల పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుహమ్యానాయక్,మండలపార్టీఅధ్యక్షులుఈదులకంటి రవీందర్ రెడ్డి , మండల ప్రధాన కార్యదర్శి మంద పూరి మహేందర్, మండల సీనియర్ నాయకులు అశోక్ , కొండం రాంనర్సింహ రెడ్డి, గిరికట ఎల్లయ్య, మండకురి అశోక్ , మార్కెట్ కార్యదర్శి యమ్.శ్రీనివాస రాజు, మార్కెట్ డైరెక్టర్లు ఎండి.ఖాజామియా , పుల్లూరు దామోదర్ , మండలం పశు వైద్య అధికారి డాక్టర్ శృతి మార్కెట్ సిబ్బంది గ్రామస్థులు తదితరులుపాల్గొన్నారు.

# కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలి.

## ఇన్చార్జ్ ఎంపీడీవో సునీల్ కుమార్ రాజ్.



ఖానాపురం జూన్ 23 వుదయం ప్రతినిధి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగపర్చుకోవాలని ఇన్చార్జి ఎంపీడీవో సునీల్ కుమార్ రాజ్ గిరిజనులకు తెలిపారు. మండలంలోని కోర్తిమాటుతండ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్రి దర్తి ఆభా జాన్ భాగీదరి అభియాన్ గ్రామసభ ఏర్పాటుచేసి గిరిజనులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని తెలుసుకొని వారికి కేంద్ర రాష్ట్ర పథకాలు ఏ విధంగా అందజేయాలానె విషయాలపై ఎస్ టి తెగలుకు చెందిన అదివాసీ గిరిజనులు తమ నివాస ప్రాంతాలలో అన్ని రకాల ధృవీకరణ పత్రాలు ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందడానికి ఉద్ధేశించి గిరిజన గ్రామాలలో సదస్సులు నిర్వహించడం జరుగుతుందని తెలుపుతూ, ఆధార్ కార్డు,రేషన్ కార్డు,నివాస%శీ%,కుల ధృవీకరణ పత్రాలు, పిఎం మాతృవందనయోజన, మిషన్ ఇంద్రధనుష్, ముద్రయోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, ఆయుష్మాన్ భారత్, టిబి ముక్త అభియాన్, పిఎం జన్ ధన్ యోజన,పీఎం విశ్వకర్మ యోజన, పిఎం కిసాన్ తదితర అంశాలపై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దివ్య, ఎఈవో ఆశాదీప్, గంగయ్య, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

# సీసీ రోడ్లను ప్రారంభించిన కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి.



కుత్బుల్లాపూర్, జూన్ 23,(వుదయం ప్రతినిధి),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 30వ డివిజన్ పరిధిలో పలు కాలనీలలో సీసీ రోడ్లు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బంది అవుతుండడంతో కాలనీ వాసులు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డిని గత నెల సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి మున్సిపల్ కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా నిధులు మంజూరు చేయించి సీసీ రోడ్లు వేయించి కాలనీలలో పలు సీసీ రోడ్ల ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథులుగా పాల్గొని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎంసి అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ ప్రజలతో కలిసి ప్రారంభించారు. అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొలన్ జీవన్ రెడ్డి, టేకుల ప్రవీణ్ రెడ్డి, ఏనుగుల మధుసూదన్ రెడ్డి, పి. శ్రీనివాసరావు, శ్రీశైలం యాదవ్, కొలన్ లక్ష్మారెడ్డి, మామిళ్ళపల్లి శ్రీనివాసరావు, రామచంద్రనాయక్, ప్రభాకర్ రెడ్డి, మల్లేశ్వరరావు, ప్రేమ్ కుమార్, బిక్కన్ షా, శ్రీనివాసరాజు (మీసాల రాజు), సత్తిరెడ్డి, మోరంపూడి శ్రీనివాస్, ప్రశాంత్ రెడ్డి, ఆదిరెడ్డి, హరిబాబు, రఘు, రమా కాంగ్రెస్ పార్టీ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, కార్యకర్తలు, మహిళా కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పెరిగిన బస్ పాస్ చార్జీలను తగ్గించాలి

## –అడిషనల్ డిపో మేనేజర్ కు ఎస్ఎఫ్ఐ వినతి




నారాయణపేట టౌన్ జూన్23(వుదయం ప్రతినిధి) విద్యార్థులకు పెరిగిన బస్ పాస్ చార్జీలను వెంటనే తగ్గించాలని నారాయణపేట ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని బస్ డిపో ముందు వారు సోమవారం విద్యార్థులచే ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభం అయ్యి పది రోజులు పూర్తి అవుతున్న కూడా విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించకపోవడం చాలా దుర్మార్గమైన చర్య అని నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాలని వారు డిమాండ్ చేశారు. విద్యార్థులకు వెంటనే అనువైన బస్సు సౌకర్యాలు కల్పించి బస్ పాస్ చార్జీలను తగ్గించాలని లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు నరహరి, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాను ప్రసాద్, పవన్ కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమై పది రోజులు పూర్తి అవుతున్న ఇప్పటివరకు గ్రామీణ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కల్పించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉదయం సాయంత్రం విద్యార్థులు ఆటో జీపులకు వేలాడి వెళుతున్న పరిస్థితి ఒక్కొక్క విద్యార్థి లతో 30 నుండి 50 రూపాయల ఛార్జీలు ఆటో జీపు వాళ్ళు వసూలు చేస్తున్నారు అని దీనిని వెంటనే అధికారులు అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. తక్షణమే నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం విద్యార్థులకు కొన్ని ప్రాంతాలకు మహబూబ్ నగర్, మక్తల్, కోస్గి, వెళుతున్న సందర్భంగా బస్సు కాళీ లేదు అని విద్యార్థులకు బస్సు ఆపకుండా బస్సులు వెళుతున్న పరిస్థితి నెలకొందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు భారంగా మోపుతున్న బస్సు పాసు చార్జీలు తగ్గించాలని పేద మధ్యతరగతి కుటుంబంలో ఉన్నటువంటి విద్యార్థులు బస్ పాస్ చార్జీలు పెరగడంతో 300 ఉన్న ఛార్జీలు 500 కు పైగా 500 కున్న చార్జీలు 800 కు పైగా పెనుబారంగా మోపుతున్నటువంటి పరిస్థితి నెలకొందని వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయం వెనక్కి తీసుకొని పేద విద్యార్థులకు అండగా నిలవాలని వారు ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు నవీన్, నిర్మల లక్ష్మీనారాయణ, వివిధ గ్రామాల విద్యార్థులు 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

# మా గ్రామాన్ని పట్టించుకోండి మహాప్రభో.

## –బురదరోడ్డుపై నిలబడి నిరసన తెలిపిన గ్రామస్తులు.



చంద్రుగొండ, జూన్23 ( వుదయం ప్రతినిధి): మా గ్రామాన్ని పట్టించుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు బురద నిలబడి, నడుస్తూ నిరసన తెలిపారు. వివరాల్లోకి వెళితే.... భద్రాద్రికొత్తగూడెం జిల్లా, చంద్రుగొండ మండలం, వెంకటియాతండ గ్రామంలో డ్రైనేజి లేక రోడ్డుపై మోకాళ్లలోతు బురదనీరు నిలిచి దుర్గంధం వెదజల్లుతుంది. గ్రామంలో మురుగునీరు నిలిచిన విషయం గ్రామ, మండల స్థాయి అధికారులకు తెలియజేసిన పట్టించుకోకపోవడంతో సోమవారం గ్రామస్తులు బురదలో నిలబడి నిరసన తెలిపారు. బురద నీరు నిలబడి, దోమలు పెరిగి గ్రామంలో జ్వరాలు పెరుగుతున్నాయని, గ్రామంలో కనీసం పారిశుద్ధ పనులు సైతం చేయటంలేదన్నారు. గ్రామంలో పంచాయతీ ట్రాక్టర్ కనీసం చెత్త సేకరణ గత ఆరేడు నెలలుగా పనిచేయటం లేదన్నారు. గ్రామంలో గ్రామ పంచాయతీ అధికారులు, సిబ్బంది ఎక్కడ ఉంటున్నారో మాకు అర్ధంకావడంలేదన్నారు. బురదనీరు వాసన వస్తున్నా కనీసం పట్టించుకోవడంలేదన్నారు. ఇప్పటికైనా అధికారుల తీరు మారకపోతే మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని గ్రామస్తులు ఇస్లావత్ వీరన్న, రవి, రామా, బానోత్ భద్రు, బాలాజీ, కిషన్, వీరన్నలు హెచ్చరించారు...

# తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మల్లాది హన్మంతరావు పుట్టినరోజు వేడుకలు



మధిర జూన్ 23 (వుదయం ప్రతినిధి) టీడీపీ మధిర నియోజకవర్గ కార్యాలయం లో చావ నరేష్ అందజేసిన కేక్ కట్ చేసి,స్వీట్స్ పంచుకొని సంబరాలు చేసుకుని పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ శ్రేణులు. ఖమ్మం పార్లమెంట్ టీడీపీ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం ఎర్రుపాలెం మండల టీడీపీ అధ్యక్షులు, రాష్ట్ర ఎస్సి సెల్ టీడీపీ ఉపాధ్యక్షులు దోమందుల సామేలుహనుమంతురావు గారిని సత్కరించారు. జన్మదినోత్సవ కార్యక్రమం లో పాల్గొన్న మధిర టౌన్ టీడీపీ కార్యదర్శి చట్టు వెంకటేశ్వరు, ఉపాధ్యక్షులు మేడ వెంకటేశ్వర్లు సీనియర్ నాయకులు పాశమ్ రామనాధం, తెలుగు మహిళా నాయకురాలు మన్నెపల్లి రత్నకుమారి, మధిర నియోజక వర్గ ఐటీడీపి అధ్యక్షులు అనుమోలు సతీష్, అంగడాల గోపి, తమ్మి శెట్టి గోపి, అరవిందు బాజీ, జితేంద్ర, తోటకూర ప్రసాద్ తిరుపతి రావు బి. రాయప్ప రామకృష్ణ తదితరులు శుభాకాంక్షలు తెలిపి హనుమంతరావు సుఖ సంతోషాలకలిగిఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని చెప్పి టీడీపీ కి మరింత వెన్ను దన్నుగా ఉండాలని కోరారు.

# ముఖ్యమంత్రి సహా నిధి కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.

## ఎమ్మెల్యే డాక్టర్ యం సంజయ్ కుమార్





జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి) జగిత్యాల పట్టణ అర్బన్ మండలానికి చెందిన 126 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన 45 లక్షల 27 వేల రూపాయల విలువ గల చెక్కులను కళ్యాణ లక్ష్మీ పథకం ద్వారా 98 మంది ఆడబిడ్డలకు మంజూరైన 98 లక్షల 11 వేల రూపాయల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేసిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ యం సంజయ్ కుమార్ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో జగిత్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని పట్టణంలో నాణ్యతతో అభివృద్ధి పనులు చేస్తున్నానన్నారు లే అవుట్ ప్రకారం ఇండ్ల నిర్మాణాలు చేపట్టాలని చెరువు బాగుంటే మనం బాగుంటాం చెరువులు కలుషితం కాకుండా చూడాలన్నారు జగిత్యాల పట్టణ మోతే చెరువు అభివృద్ధికి 3 కోట్ల 50 లక్షలు కండ్ల పల్లి చెరువు కు 3 కోట్ల పైగా నిధులు మంజూరు చేయటం జరిగిందని జగిత్యాల తిప్పన్న పెట్ కు 10 కోట్లతో బ్లాక్ స్పాట్ రోడ్డు మంజూరు అయ్యాయని శంకులపల్లి ఎన్ కే ఎన్ ఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో 15 లక్షల లీటర్ల వాటర్ ట్యాంక్ 2 కోట్ల 70 లక్షలు మంజూరు అయ్యాయని ఆయా వార్డులలో నీటి కొరత తీరనుందన్నారు 18 వేల ఇండ్ల కు ఉచిత కరెంట్ ఇస్తున్నామని సన్న బియ్యం తో ఆహార భద్రత రాష్ట్రంలో ఎక్కడా లేని విదంగా 4520 ఇండ్ల నిర్మాణం జగిత్యాలలో చేపట్టడం జరిగిందన్నారు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ చేస్తామని జగిత్యాల పట్టణ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని డబల్ బెడ్ రూం ఇండ్ల కోసం మౌలిక సదుపాయాలు కల్పన చేపడతామని జగిత్యాల ప్రజలకు నిరంతరం అండగా ఉంటానని స్థానిక సంస్థల ఎన్నికల్లో నాకు మద్దతుగా ఉండండి అన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ లు గిరి నాగభూషణం మాజీ వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్ మాజీ జడ్పీటీసీ ఎల్లారెడ్డి అడువాల లక్ష్మణ్ ఎమ్మార్వో రామ్మోహన్ నాయకులు బాలే శంకర్ ములసపు మహేష్ గోడిసెల గంగాధర్ రాజేశ్వర్ రెడ్డి దుమాల రాజ్ కుమార్ జంబర్తి శంకర్ శ్రీరామ్ భిక్షపతి ఫిరోజ్ ప్రభాకర్ మాజీ కౌన్సిలర్ లు సర్పంచ్ లు ఎంపీటీసీ లు నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి కి 66 ఫిర్యాదులు



నారాయణపేట టౌన్ జూన్23(వుదయం ప్రతినిధి) ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 66 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీదారుల దరఖాస్తుల లో పేర్కొన్న సమస్యల పై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 66 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, ట్రైని కలెక్టర్ కొయ్యడ ప్రణయ్ కుమార్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# యు జి డి పనులను ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి.



కుత్బుల్లాపూర్, జూన్ 23,(వుదయం ప్రతినిధి),నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ సాయిహనురాగ్ కాలనీ రోడ్డు నం 4 తన్వి హిల్స్ నుండి రోడ్డు నం 1 కావ్య అవెన్యూ వరకు యూజీడీ అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కొరకు దాదాపు 23 లక్షల ఫండ్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఇంచార్జి కోలన్ హనుమంత్ రెడ్డి ద్వారా మంజూరు చేపించిన డివిజన్ మాజీ కార్పొరేటర్ కోలన్ వీరేందర్ రెడ్డి కాలనీ వాసులతో కలిసి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ మున్సిపాల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ కోలన్ జీవన్ రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ సెక్రటరీ కోలన్ బాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ 18వ డివిజన్ అధ్యక్షులు రాజేందర్, యూత్ ప్రెసిడెంట్ జీతూ, నందనవనం మురళీ, తన్వి హిల్స్ వంశీ, కావ్య అవెన్యూ ప్రెసిడెంట్ శ్రీకాంత్, జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సేవ సమితి ప్రెసిడెంట్ షెబిర్, రామకృష్ణ, శ్రీనివాస్, సాయి అనురాగ్ కాలనీ శ్రీనివాసరెడ్డి, కాలనీ వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు ద్వారా కూలీలకు పాత బట్టలు పంపిణీ



మధిర జూన్ 23 (వుదయం ప్రతినిధి) మధిర పట్టణంలో సామాజిక నిస్వార్థ సేవకుడు లంక కొండయ్య ఆధ్వర్యంలో రాజమండ్రి నుంచి మధిరలో కాలువలు పూడికలు తీయటానికి వచ్చిన కూలీలకు మహాత్మా గాంధీ ఓల్డ్ క్లాత్ బ్యాంకు ద్వారా సేకరించిన పాత బట్టలను కూలీలకు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కర్నాటి రామారావు, షేక్ జహంగీర్, మైలవరపు చక్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మధిర పట్టణంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎయిడ్స్, కరోనా పై ప్రజలకు అవగాహన కల్పించి,ఎన్నో అవార్డులు పొందిన లంకా కొండయ్య నిరుపేదలకు పాత బట్టలు సేకరించి వాళ్ళకి అందజేయటం హర్షించదగ్గ విషయం అన్నారు. భవిష్యత్తులో లంక కొండయ్య ఇలాంటి మరెన్నో కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

# మధిర బిజెపి ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ కార్యక్రమం.



మధిర జూన్ 23 (వుదయం ప్రతినిధి) జనసంఘ వ్యవస్థాపకులు శ్యాంప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా బలిదాన్ దివస్ కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ మధిర రూరల్, టౌన్ విభాగాల ఆధ్వర్యంలో బలిదాన్ దివస్ కార్యక్రమం మధిర బిజెపి కార్యాలయంలో నిర్వహించడం జరిగింది. శ్యాం ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం మొక్కలు నాటడం జరిగింది. ఈ కార్యక్రమంలో మధిర రూరల్, టౌన్ అధ్యక్షులు గడ్డం శ్రీహరి చౌదరి, శివరాజు సుమంత్, బిజెపి జిల్లా అధికార ప్రతినిధి రామిశెట్టి నాగేశ్వరరావు, కార్యవర్గ సభ్యులు కుంచం కృష్ణారావు, మర్సకట్ల స్వర్ణాకర్, పాపట్ల రమేష్, రామకృష్ణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

# వరంగల్ రీజియన్ గౌరవ అధ్యక్షులుగా ఈ.వి. శ్రీనివాసరావు నియామకం

## –తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం
## –రాష్ట్ర మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించిన గౌరవ అధ్యక్షులు ఈ.వి. శ్రీనివాసరావు



హనుమకొండ, జూన్ 23(వుదయం జిల్లా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం వరంగల్ రీజియన్ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షులుగా టిపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈ.వి. శ్రీనివాసరావు ను నియమించారు. సోమవారం సంఘానికి చెందిన వరంగల్ రీజియన్ అధ్యక్షుడు గొలనుకొండ వేణు, సెక్రటరీ మాదారపు సాంబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ బండారు శ్రీనివాస్, హన్మకొండ డిపో చీఫ్ అడ్వైజర్ బి.ఎన్. చారీ, డిపో సెక్రటరీ విమలాకర్, వరంగల్ 1 డిపో అధ్యక్షుడు దుంపేటి యాదగిరి, సెక్రటరీ పోతరాజు రమేష్ లు కలిసి ఈ.వి. శ్రీనివాసరావు ను మర్యాదపూర్వకంగా కలిసి గౌరవ అధ్యక్షులుగా కొనసాగాలని విజ్ఞప్తి చేయగా ఆయన అంగీకరించారు. ఈ సందర్భంగా ఈ.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ లో పనిచేస్తున్న బీసీ ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు, వారి సంక్షేమానికి నేను పూర్తిగా అండగా ఉంటాను. వారికి ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో రేపు జరగనున్న సంఘం 8వ రాష్ట్ర మహాసభకు సంబంధించిన పోస్టర్‌ను గౌరవ అధ్యక్షులు ఈ.వి. శ్రీనివాసరావు ఆవిష్కరించారు.

# నర్సంపేట డివిజన్ లో అనుమతి లేని ప్రైవేట్ పాఠశాలను సీజ్ చేయాలి.

## –ఏ.ఐ.ఎఫ్.డీ.ఎస్ , ఏ.ఐ.ఎస్.బి విద్యార్థి సంఘాలు.



నర్సంపేట జూన్ 23 (వుదయం ప్రతినిధి): నర్సంపేట పట్టణంలోని ఓంకార్ భవన్ లో వామపక్ష విద్యార్థి సంఘాలు, ఏ.ఐ.ఎఫ్.డీ.ఎస్ ఏ.ఐ.ఎస్.బి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున ఏ.ఐ.ఎస్.బి రాష్ట్ర కన్వీనర్ హకీమ్ నవీద్ లు మాట్లాడుతూ నర్సంపేట పట్టణ కేంద్రంలోని 25 ప్రైవేటు పాఠశాలలకు పర్మిషన్ ఉంటే , అనధికారికంగా 14 ప్రైవేట్ పాఠశాలలు అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని వారు ఆరోపించారు. నర్సంపేట పట్టణంలో ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు ఇష్టా రాజ్యాంగ వివరిస్తున్న కూడా స్థానికంగా ఉన్నటువంటి మండల విద్యాశాఖ అధికారులు చూసి చూడకుండా వదిలేయడం సిగ్గుచేటని వారు అన్నారు. నర్సంపేట పట్టణంలో అనధికారికంగా నడపబడుతున్నటువంటి ప్రైవేట్ పాఠశాలలపై స్థానిక ఎం.ఈ.ఓ లు విచారణ జరిపించి తక్షణమే వాటిని మూసివేసి ఆ స్కూల్ యాజమాన్యాలపై చట్టరీత్యా క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఉద్యమాలను చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎఫ్.డి .ఎస్. రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మాస్ సావిత్రి , ఏ.ఐ.ఎస్.బి జిల్లా కన్వీనర్. రోహిత్ , ఏ.ఐ.ఎఫ్.డి.ఎస్ జిల్లా సహాయ కార్యదర్శి మార్త నాగరాజు, పోలబోయిన రాజు, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పరుపాటి శ్రీనివాస్ రెడ్డి జన్మదిన వేడుకలో బిఆర్ఎస్ పార్టీ నేతలు



రాయపర్తి జూన్ 23 (వుదయం ప్రతినిధి ):బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు విరాభిమాని ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి పుట్టినరోజును పురస్కరించుకొని బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఎలమంచ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ను కట్ చేసి, అనంతరం టపాసులు కాల్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి,జెడ్పిటిసి రంగు కుమార్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు,ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మాజీ సర్పంచ్ గారే నర్సయ్య, మండల యూత్ ప్రధాన కార్యదర్శి సంకినేని ఎల్ల స్వామి, మండల అధికార ప్రతినిధి తాళ్లపల్లి సంతోష్ గౌడ్, ఫౌండేషన్ ప్రతినిధులు గజవెల్లి ప్రసాద్, ఎండి యూసుఫ్, ఐత రామచందర్ , సుధాకర్, రాము, సింహాద్రి, ప్రవీణ్ ,శ్రీధర్,బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు, తన అభిమానులు, ఫౌండేషన్ ప్రతినిధులు, యువజన నాయకులు భారీ ఎత్తున పాల్గొన్నారు.

# కలెక్టర్ కు పెన్షనర్ల మెగా మెమోరాండం.



జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి) కేంద్ర ప్రభుత్వం లోకసభలో ఇటీవల ఆమోదించుకున్న పెన్షన్ సవరణ బిల్లును వెంటనే రద్దు చేయాలని కోరుతూ సోమవారం తెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్షులు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ కు పెన్షనర్లు మెగా మెమోరాండం ను సమర్పిస్తూ ప్రధాన మంత్రికి పంపాలని కోరారు ఈసందర్భంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా అధ్యక్షులు హరి ఆశోక్ కుమార్ సహాయ అధ్యక్షులు పి హన్మంత రెడ్డి కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం లు మాట్లాడుతూ మెగా మెమోరాండం లో పేర్కొన్న అంశాలను వివరించారు పెన్షనర్లను పాత కొత్త పెన్షన్ దారులుగా విడదీయడం ఈ బిల్లులోని ముఖ్య విషయమన్నారు ఈ బిల్లు చట్ట రూపంలో అమల్లోకి వస్తే పెన్షనర్లు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతారని ఆ బిల్లును రద్దు చేయడానికి సుదీర్ఘ ఉద్యమాన్ని సాగించడానికి సంసిద్ధంగా ఉండాలని వారు పిలుపునిచ్చారు ఈకార్యక్రమంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షులు పిసి హన్మంత రెడ్డి కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం ఉపాధ్యక్షులు ఎండి యాకూబ్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు పూసాల అశోక్ రావు కే సత్యనారాయణ సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్ కోరుట్ల అధ్యక్షులు పబ్బా శివానందం కార్యదర్శి రాజ్ మోహన్ కోశాధికారి లక్ష్మీనారాయణ సంయుక్త కార్యదర్శి టి రాజయ్య మెట్ పల్లి అధ్యక్షులు వి ప్రభాకర్ రావు ధర్మపురి అధ్యక్షులు కే గంగాధర్ జగిత్యాల యూనిట్ అధ్యక్షులు బి రాజేశ్వర్ మల్యాల అధ్యక్షులు ఎండి యాకూబ్ నాయకులు కొక్కు నారాయణ దేవేందర్ రావు ఎండి ఇక్బాల్ మనోహర్ కరుణ విజయలక్ష్మి జిల్లా డివిజన్ మండలాల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సురభి నవీన్ కుమార్



కోరుట్ల జూన్ 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం జోగిని పల్లి గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు మధు గౌడ్ మాతృమూర్తి గత కొద్ది రోజుల క్రితం మరణించగా సోమవారం జోగిన్ పల్లి లోని మరి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ పరామర్శలో సురభి నవీన్ కుమార్ తో పాటు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి బంగారు భవిష్యత్తుకు బాటలు వెయ్యాలి



కాసిపేట జూన్ 23 (వుదయం విలేకరి) యువత, విద్యార్థులు మత్తు పదార్థాలకు, గంజాయి కి దూరంగా ఉండాలని దేవాపూర్ ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సోమవారం మండలంలోని మల్కె పల్లి పాఠశాలలోని విద్యార్థులకు మత్తు పదార్థాల నివారణ, వాటి పరిణామాలపై అవగాహన కల్పించారు. ముందుగా విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు అనంతరం ఎస్సై ఆంజనేయులు మాట్లాడుతూ ఇటీవల కాలంలో యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలు సేవిస్తున్నారని, ఇది సరైంది కాదన్నారు. మత్తులో నేరాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. వ్యసనాలకు బానిసైతే జీవితం అంధకారం అవుతుందని చెప్పారు. విద్యార్థులు, యువకులు క్రమ శిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. అనంతరం మాదక ద్రవ్యాలు సేవించకుండా విద్యార్థుల చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన



లక్షెట్టిపేట, జూన్ 23 (వుదయం ప్రతినిధి): పట్టణంలోని గుడ్ షెఫర్డ్ పాఠశాలలో స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో సోమవారం డ్రగ్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సురేష్ మాట్లాడుతూ...డ్రగ్స్ వాడకం వల్ల సమాజంలో వచ్చే దుష్పరిణామాలు,ఆరోగ్య సమస్యల గురించి విద్యార్థులకు వివరించారు. చాలా మంది విద్యార్థులు డ్రగ్స్ కు బానిసలై తమ విలువైన జీవితాలు నాశనం చేసుకుంటున్న సంఘటనలు చాలా ఉన్నాయి అన్నారు. కాబట్టి విద్యార్థులు ఎవరు డ్రగ్స్ కు అలవాటు పడవద్దు అన్నారు. విద్యార్థి దశ చాలా కీలకమైంది కాబట్టి చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై శ్రద్ధ వహించి పట్టుదల క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమం లో పాఠశాల కరెస్పాండెంట్ వై.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ సెబాస్టియన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చోరి సొత్తును రికవరి చేసిన పోలీసులు



నిజాంసాగర్, జూన్ 23(వుదయం ప్రతినిధి): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలోని ఓ ఇంట్లో ఈనెల 8వ తేదీనా చోరీకి పాల్పడిన చేసిన నిందితుడు అత్రం ప్రశాంత్ ను సోమవారం ఉదయం నిజాంసాగర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చోరీకి పాల్పడిరది చేసింది తానేనని ఒప్పుకున్న ప్రశాంత్ తాను చోరీ చేసిన వస్తువులను రికవరీ చేయడం జరిగిందని ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం మహ్మద్‌నగర్ మండల కేంద్రానికి చెందిన మన్నె శేఖర్ కుటుంబీకులు పని నిమిత్తం హైదరాబాద్ వెళ్ళగా వారు మూడు రోజుల వరకు హైదరాబాద్‌లోనే ఉండిపోయారు. ఇది గమనించిన ప్రశాంత్ తాళం వేసిన ఇంట్లోకి చొరబడి 40 తులాల వెండి పట్టీలతో పాటు రూ 40 వేలు అపహరించినట్లు పేర్కొన్నారు. స్థానికుల సహకారంతో మన్నె శేఖర్ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సోమవారం వాహనాల తనిఖీచేస్తున్న పోలీసులను చూసి ప్రశాంత్ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని విచారించారు. దీంతో చోరీకి పాల్పడిరది తానేనని ఆయన ఒప్పుకున్నారు. అతని వద్ద చోరి చేసిన 40 తులాల వెండి వస్తువులను 10,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

# ద్విచక్ర వాహనం దొంగ అరెస్ట్



నిజాంసాగర్, జూన్ 23(వుదయం ప్రతినిధి): గత నెల 26వ తేదీనా నిజాంసాగర్ మండలంలోని మాగి గ్రామంలో కుస్తీ పోటీలు నిర్వహించడం జరిగింది. ఈ కుస్తీ పోటీలు తిలకించేందుకు పద్దేపల్లి గ్రామానికి చెందిన పొట్టోళ్ల సాయిరాం మాగి గ్రామానికి రాగా పార్కింగ్‌లో ఉంచిన తన పల్సర్ ద్విచక్ర వాహనాన్ని గుర్తు తెలియని వ్యక్తి దొంగిలించినట్లు బాధితుడు నిజాంసాగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో సోమవారం ఎస్సై శివకుమార్ నర్సింగ్‌రావుపల్లి చౌరస్తాలో వాహనాల తనిఖీ సమయంలో చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన గురేగ్ రెడ్డి పల్సర్ వాహనంపై అనుమానస్పదంగా కనిపించడంతో అతన్ని అదుపులోకి తీసుకుని విచారించగా తానే చోరి చేసినట్లు ఒప్పుకున్నాడని, అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని ఎస్సై శివకుమార్ పేర్కొన్నారు.

# డాక్టర్ శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు



కోరుట్ల జూన్ 23 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కథలాపూర్ మండల కేంద్రంలో స్వతంత్ర భారత రాజనీతిజ్ఞులు అగ్రగన్యులు గొప్ప విద్యావేత్త మహోన్నత దేశభక్తులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు అనంతరం పలువురు నేతలు మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలను చిన్నప్రాయంగా సమర్పించిన ఆ మహనీయుడికి శతకోటి వందనాలు తెలిపారు సాంస్కృతిక ఆర్థిక జాతీయవాదమే పునాదిగా భారతీయ సనాతన ధర్మ రక్షణ ధ్యేయంగా భారతీయ జన సంఘ్ ను స్థాపించి మార్గదర్శి అయ్యారు అఖండ భారత మే ఆదర్శంగా దేశ ప్రజల సంఘటితమే సిద్ధాంతంగా పని చేసిన కర్మశీలియన్నారు ఏక్ దేశ్ మే దో విధాన్ దో విధాన్ దో నిషాన్ నినదించిన ధైర్యశాలియన్నారు ప్రతిష్ఠ జాతీయ భావజాల నిర్మాణమే పరమావధిగా తన జీవితాంతం హైందవ సాంస్కృతిక వికాసమే ధ్యేయంగా కృషి చేసిన నిత్య చైతన్య శీలి అని తెలిపారు ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ కథలాపూర్ మండల అధ్యక్షులు మల్యాల మారుతి భారతీయ జనతా పార్టీ జగిత్యాల జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు కోడిపెల్లి గోపాల్ రెడ్డి నాయకుడు కంటే సత్యనారాయణ గాంధారి శ్రీనివాస్ మహేష్ బండ అంజయ్య శాంతారాం సునీల్ ప్రసాద్ లక్ష్మీనర్సయ్య రాజేష్ శివ సాయి రెడ్డి లింగమూర్తి రాజశేఖర్ రాజు అనిల్ భారతీయ జనతా పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన సురభి నవీన్ కుమార్



కోరుట్ల జూన్ 23 (వుదయం ప్రతినిధి) భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు న్యాయవాది సిహెచ్ మదన్మోహన్ తల్లి గత కొద్ది రోజుల క్రితం మరణించగా సోమవారం జగిత్యాలలోని వారి నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ పరామర్శలో సురభి నవీన్ కుమార్ తో పాటు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# ఆత్మ కమిటీ చైర్మన్ ను సన్మానించిన మండల అధికారులు



కాసిపేట జూన్ 23 (వుదయం విలేకరి) కాసిపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆత్మ కమిటీ చైర్మన్ గా పదవి బాధ్యతలు చేపట్టిన రౌతు సత్తయ్య డైరెక్టర్ లు మైదం రమేష్, శ్రీనివాస్ లను ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, తహసీల్దార్ భోజన్నా ఎం పి ఓ షేక్ సప్దర్ అలీ ఏవో ప్రభాకర్ పశువుల డాక్టర్ సరిత సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ ఏపీఎం వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి వేడుకలు.

**శ్యాం ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన సురభి నవీన్ కుమార్**



కోరుట్ల జూన్ 23 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ బీముని దుబ్బ లో గల భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ స్వగృహం సురభి నవీన్ కుమార్ కార్యాలయంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ వర్ధంతి (బలి దాన్ దివస్) సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోరుట్ల నియోజకవర్గ నాయకులు సురభి నవీన్ కుమార్ ఈ కార్యక్రమంలో సురభి నవీన్ కుమార్ తో పాటు భారతీయ జనతా పార్టీ భారతీయ జనతా యువ మోర్చా వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కేజీబీవీ పాఠశాలలో గెస్ట్ టీచర్ పోస్టు కోసం దరఖాస్తుల ఆహ్వానం

**-మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్**



పెద్దవంగర, జూన్ 23 (వుదయం ప్రతినిధి ): మండలంలోని కేజీబీవీ పాఠశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ టీచర్ కోసం అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి బుధారపు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ లో ఇంగ్లీష్ సీఆర్టీ పోస్టు, పాఠశాలలో భోదించుటకు ఖాళీగా ఉందని తెలిపారు. ఈ పోస్టు కోసం ఎంపికైన వారు ప్రస్తుత విద్యా సంవత్సరానికి 2025-26 కు మాత్రమే పని చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గ్రాడ్యుయేషన్ ఇన్ ఇంగ్లీష్ లిటరేచర్, పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఇన్ ఇంగ్లీష్, బీఈడీ, టెట్ అర్హత కలిగిన అభ్యర్థులు చిన్నవంగర కేజీబీవీ లో ఈనెల 25, సాయంత్రం 4 గంటల వరకు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# పాఠశాలలో కంప్యూటర్ కొనుగోలుకు విరాళం అందజేత



నిజాంసాగర్, జూన్ 23(వుదయం ప్రతినిధి): మహ్మద్‌నగర్ కాంప్లెక్స్ అవసరాల నిమిత్తం సోమవారం నాడు పీఆర్‌టీయు మహ్మద్‌నగర్ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నారాయణ, వెంకట్‌రాంరెడ్డిలు కంప్యూటర్ కొనుగోలు కొరకు 10 వేల రూపాయలను విరాళం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూధన్ రాజుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయు సంఘ భాద్యులు వెంకటరమణ, పండరి, ఉపాధ్యాయబృందం తదితరులు పాల్గొనగా దాతలకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తమ కృతజ్ఞతలు తెలియజేశారు.

# రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి



కాసిపేట జూన్ 23 (వుదయం విలేకరి) దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ లిమిటెడ్ (అదానీ సిమెంట్) వారు నేడు ఓరియంట్ కాలనీ లేడీస్ క్లబ్ ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుండి రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో నిర్వహించనున్న మహా రక్తదాన శిబిరానికి యువతీ యువకులు విద్యార్థులు అందరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చి విజయవంతం చేయాలని కోరారు థలస్సేమియా, సికిల్ సెల్స్, బ్లడ్ కేన్సర్ వంటి వ్యాధులతో బాధపడుతున్న ఎందరో రోగులకు సహాయం చేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు రక్తం అవసరమైన రోగులకు సహాయం చేయాలనే ఉన్నతమైన లక్ష్యంతో, ఒరియంట్ సిమెంట్ లిమిటెడ్ (అదానీ సిమెంట్) మహా రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు

# వంగల శ్రీనివాస్ రావు సంతాప సభ

**-అనారోగ్యంతో చికిత్స పొందుతూ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మృతి**



భద్రాద్రి కొత్తగూడెం జూన్ 23 ( వుదయం ప్రతిని):కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ డిపార్ట్మెంట్లో ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తూ అనారోగ్య రీత్యా హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతూ జూన్ 23 సోమవారం హఠాత్ మరణం పొందిన వంగల శ్రీనివాసరావుకి కొత్తగూడెం ఏరియా సెక్యూరిటీ విభాగం తరఫున సెక్యూరిటీ ఆఫీసర్ అభిలాష్ ఆధ్వర్యంలో మరణించిన శ్రీనివాస్ రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సెక్యూరిటీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్గా విధులు నిర్వహిస్తూ అకాల మరణం పొందటం చాలా బాధాకరమని వారి కుటుంబా సభ్యులకు సెక్యూరిటీ అధికారులు సిబ్బంది తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ వారి కుటుంబానికి అండగా ఉంటామని వారు అన్నారు. రెండుసార్లు సెక్యూరిటీ అధికారిగా కొత్తగూడెం ఏరియాలో పనిచేసిన శ్రీనివాస్ కు ఇద్దరు కుమార్తెలు స్వస్థలం ఇల్లందు విధుల పట్ల అంకితభావంతో పనిచేసే శ్రీనివాసు కోల్పోవడం చాలా బాధాకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి ఫిట్ సెక్రటరీ మోహన్ రెడ్డి, జూనియర్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ,షిఫ్ట్ జమిందార్ కె కుమార్ ,ఎగ్జిక్యూటివ్ మెంబర్ హానోక్ రాజ్, యాక్టింగ్ క్లర్క్ సురేష్ ,ఏ ఐ టి యు సి ఫిట్ సెక్రటరీ జె రాంబాబు, మల్లికార్జున్, మైసరాజేష్ ,కోడి నవీన్ , జితుకు రాంబాబు ,క్రాంతి, కప్పల శ్రీనివాస్ , పిట్టల చంద్రమోహన్ ,సుద్దాల శంకర్, ప్రైవేట్ సెక్యూరిటీ నూకరాజు, ఈశ్వర్, కిరణ్ ,జూల రాజేష్, ప్రవేట్ సెక్యూరిటీ గార్డులు, డ్రైవర్లు పాల్గొని నివాళులర్పించారు.

# అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**-23 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ**

**-ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

కల్వకుర్తి జూన్ 23 (వు దయం ప్రతినిధి) అభివృద్ధి సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంగా కోట్లాది రూపాయలు వెచ్చించి రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎంపీ మల్లు రవి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిలు పేర్కొన్నారు సోమవారం కల్వకుర్తి నియోజకవర్గంలో 23 కోట్ల 75 లక్షలు నిధులతో కల్వకుర్తి మండలం లోని ముకురాల, గుండూరు, చారగొండ మండలం చంద్రాయన్ పల్లి, వెల్దండ మండలం పెద్దాపూర్, బైరాపూర్ బీటీ రోడ్లు, బ్రిడ్జిలు నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు దీంతోపాటు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కమిటీ మెంబర్ బాలాజీ సింగ్, మాజీ సర్పంచులు , భూపతి రెడ్డి, ఆనంద్ కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా మనీలా సంజీవ యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు విజయకుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయ ప్రకాష్, నాయకులు మోతిలాల్ నాయక్, పర్వత్ రెడ్డి, పిఏసిఎస్ డైరెక్టర్ మట్ట వెంకట గౌడ్, అలీ సాబ్, రాజు యాదవ్, తక్కలపల్లి శేఖర్, పోలే రాజు, హరికిషన్ నాయక్, పుల్లయ్య, రషీద్, నారాయణ, ఎర్ర శీను, తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు

# మంత్రాలు వస్తాయని కల్లెడ గ్రామ వృద్ధ దంపతులపై దాడి.



పర్వతగిరి , జూన్ 23 ( వృదయం ప్రతినిధి ) : పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన బాల్య వెంకటయ్య మరియు అతని భార్య లచ్చమ్మల మూడు సంవత్సరాలుగా మంత్రాలు చేస్తున్నారని ఎల్లమ్మ మరియు అతని కుమారుడు రాజు, కూతురు జ్యోతిలతో కలసి దాడి చేశారని పోలీస్ స్టేషన్లు ఫిర్యాదు చేశారని బాధితులకు కుమారుడు రాజు తెలిపారు గతంలో కూడా తమపై అక్రమ కేసులు పెట్టించారని పోస్టల్ డిపార్ట్మెంట్లో పని చేస్తున్న తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని గ్రామంలో పరువు తీసుకుంటూ తిరుగుతున్నారని దొంగ సాక్షాలు పెట్టి కేసులు పెట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని వాపోయాడు.తండ్రి పై లేనిపో అబాండాలు వేస్తూ మంత్రాల నెపంతో కక్షపూరితంగా ఇంటి పై దాడి చేయడానికి ప్రయత్నం చేశారని,ఇంట్లో ఉన్న నన్ను బయటికి రారా అని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేశారని బాధితుల కుమారుడు మీడియా, పత్రిక విలేకరుల ముందు వాపోయాడు

# ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరించాలి.

**-ప్రజావాణి ఫిర్యాదులు :61**

**-జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్**



జగిత్యాల జూన్ 23 (వుదయం ప్రతినిధి) ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు వినతులను జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ స్వయంగా స్వీకరించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడం తో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 61 పిర్యాదులు వినతులు వచ్చాయని వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బిఎస్ లత జగిత్యాల ఆర్డీవో మధుసూదన్ కోరుట్ల ఆర్డీఓ జివాకర్ రెడ్డి వివిధ జిల్లా అధికారులు తహసీల్దర్లు కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఎమ్మెల్యే నాగరాజును కలిసిన సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొచ్చు చందర్



హనుమకొండ జూన్ 23(వుదయం జిల్లా ప్రతినిధి) : వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు ను సోమవారం రోజున హనుమకొండ లోని ఎమ్మెల్యే గృహములో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షులు బొచ్చు చందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో కాంగ్రెస్ సేవాదళ్ ను విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలలో తీసుకెళ్లాలని బొచ్చు చందర్ కు సూచించారు. రానున్న స్థానిక ఎలక్షన్లలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లను గెలిపించుటకు కృషి చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిన్నాల గోనాద్, హనుమకొండ నియోజవర్గ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షులు తాళ్లపల్లి రాజు, కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా జనరల్ సెక్రెటరీ తాటికొండ ప్రసాద్, పరకాల ఎస్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు పాలకుర్తి శ్రీనివాస్, కాంగ్రెస్ సేవాదళ్ ఇన్స్పెక్టర్ పి యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కిష్టయ్య, కొక్కిరాల తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.




# బిజినెస్




## బిట్ కాయిన్‌పై పెట్టుబడి పెట్టే వారికి రాబర్ట్ కియోసాకి సూచన!



రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి 2030 నాటికి బిట్‌కాయిన్ ధర 1 మిలియన్ డాలర్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ఆయన ఆస్తుల యాజమాన్యం ధర కంటే ముఖ్యమని, దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి పెట్టాలని సూచించారు. బిట్‌కాయిన్, బంగారం వంటి ఘనమైన ఆస్తులు భవిష్యత్తును సురక్షితం చేస్తాయని ఆయన విశ్వసిస్తున్నారు. 'రిచ్ డాడ్ పూర్ డాడ్' పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి మరోసారి క్రిప్టోకరెన్సీ గురించి ఒక పెద్ద విషయం వెల్లడించారు. ఈ సారి 2030 నాటికి బిట్‌కాయిన్ ధర 1 మిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ. 8.3 కోట్లకు చేరుకుంటుందని పేర్కొన్నారు. చాలా కాలం పాటు ఆస్తులను కూడబెట్టుకోవడాన్ని తాను నమ్ముతానని, రోజువారీ ధరలను చూసి భయపడనని అన్నారు. తన పోస్ట్‌లో "పేదలు ధరపై దృష్టి పెడతారు, ధనవంతులు పరిమాణంపై దృష్టి పెడతారు" అని రాశారు. అంటే ధనవంతులు తమ వద్ద ఎంత సంపద ఉందో దానిపై దృష్టి పెడతారు, ధర గురించి చింతించకండి. కియోసాకి తాను బిట్‌కాయిన్‌ను మొదట కొనుగోలు చేసినప్పుడు దాని ధర 6,000 డాలర్లు అని చెప్పారు. ఆ సమయంలో అతను వీలైనంత ఎక్కువ బిట్‌కాయిన్‌ను కొనుగోలు చేశారు. ఇంకా ఎక్కువ కొనలేకపోయినందుకు చింతిస్తున్నారు. తన పోస్ట్‌లో "బిట్‌కాయిన్ 2030లో 1 మిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది" అని పేర్కొన్నారు. భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవాలంటే మీకు బిట్‌కాయిన్, బంగారం, వెండి వంటి ఘనమైన ఆస్తులు ఉండటం ముఖ్యమని కూడా ఆయన విశ్వసిస్తున్నారు. మీ ధరల కంటే మీ వద్ద ఉన్న ఆస్తుల మొత్తం ముఖ్యమని అంటున్నారు. అంటే మీరు చాలా కాలంగా పెట్టుబడి పెడుతుంటే ప్రతిరోజూ ధరలు పెరుగుతూ తగ్గుతూ ఉండటం గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ఉద్దేశం. కియోసాకి అభిప్రాయం గురించి మార్కెట్లో చర్చ జరుగుతోంది. కొంతమంది పెట్టుబడిదారులు అతని ఆలోచనతో ఏకీభవిస్తున్నారు. బిట్‌కాయిన్, బంగారం వంటి ఆస్తులు ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభం నుండి రక్షించడంలో సహాయపడతాయని నమ్ముతున్నారు. అదే సమయంలో కొంతమంది ఇంత అధిక ధరల అంచనాపై సందేహాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్ సాంకేతికత ప్రభుత్వ నిబంధనలలో అనిశ్చితి ఉందని వారు అంటున్నారు. అయితే కియోసాకి ఇంత పెద్ద అంచనా వేయడం ఇదే మొదటిసారి కాదు. ఈ సంవత్సరం ఏప్రిల్‌లో కూడా 2035 నాటికి బిట్‌కాయిన్ ధర 1 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువగా ఉండవచ్చని అంచనా వేశారు.

## గ్లోబల్‌గా అతిపెద్ద బంగారు కొండ మన ఇండియానే



పుత్తడి ప్రపంచం మొత్తాన్ని బొమ్మాడిస్తోంది. ఎస్.. దేశాల భవిష్యత్తును సైతం డిక్టేట్ చేసేంత సత్తా ఉంది బంగారానికి. తమ దగ్గరుండే బంగారం నిల్వల్ని చూపెట్టి.. తిరుగులేని పవర్‌సెంటర్స్‌గా చెలామణీ ఔతాయి కొన్ని దేశాలు. టాప్‌టెన్ గోల్డెన్ కంట్రీస్ లిస్ట్ తీస్తే.. అందులో నేనే నంబర్ వన్ అంటూ కాలరెగరేస్తుంది అమెరికా. ప్రపంచంలోనే అత్యధికంగా 8 వేల 133 టన్నుల బంగారం అమెరికా దగ్గరే మూలుగుతోంది. తర్వాతి నాలుగు స్థానాలు జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, రష్యావి. పుత్తడి నిల్వల్లో ప్రపంచంలో ఎనిమిదో స్థానంలో ఉంది ఇండియా. 25 వేల టన్నుల బంగారానికి ఒరిజినల్ కేరాఫ్ హమారా ఇండియా. ఎస్.. మన దేశంలోని ఇళ్లు, గుళ్లలో ఉండే పసిడి దాదాపు రెండున్న కోట్ల కిలోలు. దీని విలువ అక్షరాలా 200 లక్షల కోట్ల రూపాయలు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన జీడీపీ అంచనాల్లో ఇది 56 శాతం. పాకిస్తాన్ ఎకానమీ కంటే ఆరు రెట్లు ఎక్కువ. అంతే కాదు.. ప్రపంచంలోని ప్రైవేట్ గోల్డ్ నిల్వల్లో 14 శాతం వాటా భారతదేశానిదే. ఈ లెక్కన గ్లోబల్‌గా అతిపెద్ద బంగారు కొండ మన ఇండియానే. ఇందులో ఐతే నో మోర్ డౌట్స్. 2020 నుంచి బంగారం ధరలు రాకెట్ వేగంతో పెరిగి దాదాపు రెట్టింపయ్యాయి. ఏడాది కాలంగా ఐతే.. పుత్తడి ధర ముట్టుకుంటే భగ్గుమంటోంది. పదిగ్రాముల పసిడి ధర లక్షకు అటూఇటూ అనగానే మిడిల్ క్లాసోడి గుండెలు గుభేల్ మంటున్నాయి. దిగువ మధ్యతరగతి మనిషైతే బంగారం షాపుల వైపే చూడ్డం మానేశాడు. ఫంక్షన్లు, పార్టీలైతే తప్ప తులమో అరతులమో కొనుక్కుని సర్దుకుంటున్నాడు. అంతమాత్రం చేత.. మన దేశమేం గోల్డు విషయంలో గొడ్డుపోలేదు. ధరలు రికార్డులు బద్దలుకొడుతున్నా కొనుగోళ్లు మాత్రం కోటలు దాటుతూనే ఉన్నాయి. గత ఏడాది ఇండియాలో బంగారం డిమాండ్ ఏకంగా 782 టన్నులకు చేరింది. కరోనా ముందటి యావరేజ్ కంటే ఇది 15 శాతం ఎక్కువ. ఆర్నమెంట్ బంగారం డిమాండ్ కాస్త మందగించినా.. బంగారం కడ్డీలు, కాయిన్లలో పెట్టుబడులు అమాంతం పెరిగాయి. కస్టమ్స్ డ్యూటీ 15శాతం నుంచి 6శాతానికి తగ్గడంతో బంగారం రిటైల్ ఇన్వెస్ట్‌మెంట్లు ఘనంగా పెరిగాయి. కన్జ్యూమర్ల ఉత్సాహం ఇదే రేంజ్‌లో కొనసాగితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మన దేశంలో బంగారం డిమాండ్ 725 టన్నులకు చేరుతుందన్నది యూబీఎస్ అంచనా. 2026 తర్వాత నెమ్మదించినా గోల్డ్ డిమాండ్ 800 టన్నుల దగ్గర స్థిరపడే ఛాన్సుంది. సో.. ప్రస్తుతం ఇండియాలో దాచిన బంగారం 25 వేల టన్నులు. ఏటా సగటున 8 వేల టన్నులు యాడవుతుంటే.. మన దేశపు బంగారం నిల్వలు ఏ స్థాయిలో పెరుగుతాయో ఊహలకే అందేలా లేదు. యూబీఎస్ అంచనా ప్రకారం.. ఇళ్లలో ఉన్న బంగారంలో 2 శాతం కంటే తక్కువ మాత్రమే తనఖా కోసం గృహస్థులు బైటికి తీస్తున్నారు. మిగతాదంతా బీరువాల్లోనో బంకర్లలోనో రహస్య భాండాగారాల్లోనో దాక్కునే ఉంది. అలా నక్కిన కనకాన్ని బైటికి తీసే ప్రయత్నాల్లో భాగంగా బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు గోల్డు లోన్లపై వడ్డీ రేట్లు తగ్గించినా లాభం లేకుండా పోతోంది. ఎందుకంటే % భారతీయులకు బంగారంతో ముడిబడ్డ అంత గట్టిది. మనోళ్లు బంగారాన్ని కేవలం ఆస్తిగా కాదు.. ప్రతిష్టగా భావిస్తారు. పసిడి ఆభరణాలతో ఉండే ఎమోషనల్ అటాచ్‌మెంట్ కారణంగా దాన్ని అంత ఈజీగా తనఖా పెట్టరు.. తెగనమ్ముకోరు. బంగారాన్ని బంగారంగా ఉంచుకోడానికే ఇష్టపడతారు. ఇటువంటి భావోద్వేగాల వల్లే గోల్డ్ మానిటైజేషన్ స్కీమ్, సావరిన్ గోల్డ్ బాండ్స్ లాంటివన్నీ పెద్దగా సక్సెస్ కావడం లేదు. ఇండియాలో బంగారం నిల్వలు భారీగా పెరుగుతున్నప్పటికీ.. దీన్ని సరిగ్గా లెక్కగట్టే మానిటైజేషన్ వ్యవస్థ మన దగ్గర లేదు. కానీ.. గత నిల్వలను, తాజా కొనుగోళ్లను కలుపుకుని వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ ఎప్పటికప్పుడు మన పసిడి ఖజానా సైజును కాలిక్యులేట్ చేస్తూనే ఉంది. సో.. పాతిక వేల టన్నుల బంగారం పేరుకు మనోళ్లదే ఐనా.. అది పూర్తిగా వ్యక్తిగతం. దీన్ని జాతీయ సంపదగా చెప్పుకునే అవకాశమే లేదు. ఆ మాటకొస్తే 200 లక్షల కోట్ల విలువైన ఈ పసిడి భాండాగారం ఎందుకూ కొరగాని నిరర్థక ఆస్తిగానే మిగిలిపోతోందా..? అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి.

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..



భారతదేశంలో బంగారం, వెండి ప్రియులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. కొన్ని రోజుల క్రితం లక్ష రూపాయలకు చేరుకున్న ఈ ధరలు స్వల్పంగా తగ్గిపోయాయి. దేశంలో ఇటీవల లక్ష రూపాయలకు చేరుకున్న 10 గ్రాముల పసిడి ధరలు ఇంకా అలాగే కొనసాగుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో వీటి ధరలు భారీగా పుంజుకున్నాయి. కానీ నేడు (జూన్ 23, 2025న) గత ధరలతో పోలిస్తే స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. ఇటీవల భారీగా పెరిగిన తర్వాత గోల్డ్ రేట్లు కొంత వరకు తగ్గడం ఒత్తిడిలో ఉన్న వినియోగదారులకు కొంత ఊరట కలిగించే విషయమని చెప్పవచ్చు. డాలర్?తో పోల్చుకుంటే రూపాయి విలువ పెరగడం, మార్కెట్‌లో స్థిరత్వం వంటి పలు అంశాల కారణంగా దేశీయ మార్కెట్లో పసిడి ధరలు తగ్గే ఛాన్స్ ఉంది. ఈ నేపథ్యంలో జూన్ 23, 2025న గుడ్‌రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం ఉదయం 6.30 గంటల నాటికి హైదరాబాద్,

విజయవాడలో 24 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ రేటు రూ.100,740గా ఉంది. ఈ రేటు నిన్నటితో పోల్చుకుంటే రూ. 10 తగ్గింది. ఇక 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 92,340కి చేరింది. ఇదే సమయంలో ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.100,890కి చేరుకోగా, 22 క్యారెట్ల గోల్డ్ రేటు 10 గ్రాములకు రూ. 92,490గా ఉంది. మరోవైపు వెండి ధరలు కూడా తగ్గిపోయాయి. ఢిల్లీలో కేజీ వెండి ధర రూ. 100 తగ్గి రూ.1,09,900 స్థాయికి చేరుకుంది. ఇక చెన్నై, హైదరాబాద్?లో రూ. 1,19,900గా ఉంది. మరోవైపు పూణేలో రూ.109,900లో ఉండగా, బెంగళూరు, వడోదర, కేరళ, ఢిల్లీలో కూడా రూ.109,900 స్థాయిలో ఉంది. స్టాక్ మార్కెట్లు ప్రారంభమైన తర్వాత బంగారం, వెండి రేట్లలో మార్పులు జరిగే అవకాశం ఉంది. కాబట్టి వీటిని కొనుగోలు చేసే ముందు వీటి ధరలను తప్పక తెలుసుకోవాలి.

## ప్రపంచం నెత్తిన పిడుగు వేసిన ఇరాన్..

ఇరాన్ అన్నంత పనీ చేసింది. భారత్‌తో సహా ప్రపంచ దేశాల నెత్తిన పిడుగు వేసింది. గత కొద్ది రోజులుగా హార్ముజ్ జలసంధిని మూసివేస్తామని బెదిరిస్తున్న ఇరాన్.. అన్నంత పనీ చేసింది. హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధి మూసివేతకు ఆ దేశ పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. ఇరాన్ అన్నంత పనీ చేసింది. భారత్‌తో సహా ప్రపంచ దేశాల నెత్తిన పిడుగు వేసింది. గత కొద్ది రోజులుగా హార్ముజ్ జలసంధిని మూసివేస్తామని బెదిరిస్తున్న ఇరాన్.. అన్నంత పనీ చేసింది. హార్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు స్పష్టం చేసింది. హార్ముజ్ జలసంధి మూసివేతకు ఆ దేశ పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా దాడుల తర్వాత ఓపిక నశించిన ఇరాన్ ఇక హార్ముజ్ జలసంధి మూసివేతే లక్ష్యంగా పావులు కదిపింది. దీనికనుగుణంగా పార్లమెంట్ ద్వారా ఆమోద ముద్ర వేయించుకున్న ఇరాన్.. ప్రపంచ దేశాలకు ఎంతో కీలకమైన ఆ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది. ఇరాన్ నిర్ణయం, ముడి చమురు ధరల పెరుగుదలకు దారితీయనుంది. హార్ముజ్ జలసంధి ద్వారా ప్రపంచానికి 20 శాతం ముడి చమురు సరఫరా అవుతుంది. క్రూడాయిల్, గ్యాస్ దిగుమతులపై ఆధారపడ్డ భారత్ లాంటి దేశాలపై ఇరాన్ తీసుకున్న నిర్ణయం తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. నిత్యం హార్ముజ్ జలసంధి ద్వారా భారత్‌కు చేరే ముడి చమురు సుమారు 15 లక్షల బ్యారెళ్లు. ఈ రవాణా ఆగిపోయిందంటే.. రోజుకు 10 నుంచి 12 కోట్ల లీటర్ల పెట్రోలు ఉత్పత్తి నిలిచిపోనుంది. అయితే భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తోంది. అమెరికా, రష్యాల నుంచి చమురు దిగుమతి పెంచేందుకు అడుగులు వేస్తోంది. ఇరాన్ నిర్ణయంతో ప్రపంచ దేశాలు క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనే అవకాశాలే ఎక్కువ..! ఇతర ఆసియా దేశాల మాదిరిగానే, భారతదేశం తన చమురు అవసరాలలో ఎక్కువ భాగాన్ని మధ్యప్రాచ్య దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది. భారతదేశ చమురు, గ్యాస్‌లో దాదాపు 50 శాతం హార్ముజ్ జలసంధి నుండి వస్తుంది. భారతదేశం తన LNGలో 40 శాతం ఖతార్ నుండి, 10 శాతం ఇతర గల్ఫ్ దేశాల నుండి దిగుమతి చేసుకుంటుంది.

## భారీ నష్టాల్లో దేశీయ స్టాక్ మార్కెట్లు!



అమెరికా ఇరాన్‌లోని అణు కేంద్రాలపై దాడి చేయడంతో ప్రపంచ మార్కెట్లు కుప్పకూలాయి. BSE సెన్సెక్స్, NSE నిఫ్టీ తీవ్రంగా పడిపోయాయి. ఐటీ స్టాక్స్‌కు తీవ్ర నష్టం వాటిల్లింది. అయితే, చమురు ధరలు పెరిగాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితి పెరిగింది. నిపుణులు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ప్రశాంతంగా ఉండాలని సూచిస్తున్నారు. ఇరాన్‌లోని కీలకమైన అణు కేంద్రాలపై అమెరికా వైమానిక దాడులు నిర్వహించిన తర్వాత శుక్రవారం ప్రారంభ ట్రేడింగ్‌లో బెంచ్‌మార్క్ మార్కెట్ సూచీలు పడిపోయాయి. ఇది కొత్త భౌగోళిక రాజకీయ అనిశ్చితికి దారితీసింది. ఉదయం 9:31 గంటల ప్రాంతంలో BSE సెన్సెక్స్ 679.12 పాయింట్లు తగ్గి 81,729.05 వద్ద ట్రేడవుతుండగా, NSE నిఫ్టీ 50 199.30 పాయింట్లకు పైగా పడిపోయి 24,913.10 వద్ద ముగిసింది. విస్తృత మార్కెట్ సూచికలు ఈ పతనానికి అద్దం పట్టాయి. అస్థిరత సూచికలు తీవ్రంగా పెరిగాయి. ఐటీ స్టాక్స్ తీవ్రంగా దెబ్బతిన్న వాటిలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్‌టెక్, శ్రీరామ్ ఫైనాన్స్ అత్యధికంగా నష్టపోయాయి. ప్రపంచ వృద్ధి ఆందోళనలు, పెరుగుతున్న భౌగోళిక రాజకీయ అస్థిరత ఈ రంగంపై తీవ్ర ప్రభావం చూపాయి. దీనికి విరుద్ధంగా చమురు, ఇంధన స్టాక్‌లు కొంత బలాన్ని పొందాయి. ముడి చమురు ధరలు ఐదు నెలల గరిష్ట స్థాయికి పెరగడంతో మార్కెట్ ఊపందుకుంది. గల్ఫ్ ప్రాంతంలో సరఫరా అంతరాయాలు సంభవించవచ్చనే పెట్టుబడిదారుల ఆందోళనను ఇది స్పష్టం చేస్తోంది. జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లో చీఫ్ ఇన్వెస్ట్‌మెంట్ స్ట్రాటజిస్ట్ డాక్టర్ వికె విజయకుమార్ మాట్లాడుతూ.. అమెరికా బాంబు దాడి పశ్చిమాసియాలో తీవ్రమైన పెరుగుదలను సూచిస్తున్నప్పటికీ, మార్కెట్లు ఇంకా పూర్తి స్థాయి భయాందోళనలో లేవని అన్నారు. ఇరాన్‌లోని మూడు అణు కేంద్రాలపై అమెరికా బాంబు దాడి పశ్చిమాసియాలో సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసినప్పటికీ, మార్కెట్‌పై దాని ప్రభావం పరిమితంగా ఉండే అవకాశం ఉందని విజయకుమార్ పేర్కొన్నారు. ఇరాన్ అమెరికాపై తిరిగి దాడులు చేస్తుందా? లేదా అనేదానిపై అనిశ్చితి నెలకొంది. ఇరాన్ అమెరికా రక్షణ సౌకర్యాలను లక్ష్యంగా చేసుకుని దెబ్బతీస్తే లేదా అమెరికన్ సిబ్బందికి హాని కలిగిస్తే, పతనం మరింత తీవ్రంగా ఉంటుంది. హార్ముజ్ జలసంధిని పూర్తిగా మూసివేత జరిగే అవకాశం లేదని, అలాంటి చర్య అమెరికా లేదా యూరప్ కంటే ఇరాన్, దాని మిత్రదేశాలకు ఎక్కువ హాని కలిగిస్తుందని పేర్కొన్నారు. ప్రస్తుత అస్థిరతల మధ్య, దీర్ఘకాలిక పెట్టుబడిదారులు ప్రశాంతంగా ఉండాలని, మొండి చర్యలకు దూరంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. మార్కెట్ నిర్మాణం 'కొనుగోలుపై తగ్గుదల' వ్యూహానికి అనుకూలంగా కొనసాగుతోంది," అని విజయకుమార్ పేర్కొన్నారు. భౌగోళిక రాజకీయ షాక్‌లు సాధారణంగా స్వల్పకాలిక అల్లకల్లోలానికి కారణమవుతాయి. కానీ అవి నిరంతర సంఘర్షణకు దారితీస్తే తప్ప, దీర్ఘకాలిక ప్రభావం ఉండదని అన్నారు. విశ్లేషకులు అధిక-నాణ్యత గల స్టాక్‌లతోనే ఉండాలని, తగినంత ద్రవ్యతను కొనసాగించాలని, లివరేజ్డ్ పందెం వేయకుండా ఉండాలని కూడా సిఫార్సు చేస్తున్నారు. ప్రపంచ మార్కెట్లలో రిస్క్ సెంటిమెంట్ మరింత దిగజారితే ఐటీ స్టాక్‌లు ఒత్తిడిలో ఉండవచ్చు. ఇంధనం, రక్షణ సంబంధిత రంగాలు స్వల్పకాలిక ప్రతికూలతలను చూడవచ్చు. రాబోయే రోజుల్లో అమెరికా, ఇరాన్ నుండి వచ్చే సంకేతాలను నిశితంగా గమనించాలని పెట్టుబడిదారులకు సూచించారు.

# జాతీయం – అంతర్జాతీయం



## దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉపఎన్నికల కౌంటింగ్

దేశవ్యాప్తంగా ఉప ఎన్నికల లెక్కింపు కొనసాగుతోంది. గుజరాత్, కేరళ, పంజాబ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో ఉప ఎన్నికలు జరగ్గా ఆయా పార్టీలు ముందంజలో ఉన్నాయి. కేరళలోని నిలంబూర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలోని యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ముందంజలో ఉండగా, పంజాబ్‌లోని లూధియానా వెస్ట్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఆధిక్యంలో ఉంది. పశ్చిమబెంగాల్‌లోని కలిగంజ్‌లో తృణమూల్ కాంగ్రెస్ ఆధిక్యంలో ఉండగా, గుజరాత్‌లోని కడీ, విసావదార్ నియోజకవర్గాల్లో బీజేపీ ఆధిక్యంలో ఉంది. నాలుగు రాష్ట్రాల్లోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు సోమవారం ప్రారంభమైంది. జూన్ 19న గుజరాత్‌లోని కడీ, విసావదార్, పంజాబ్‌లోని లుధియానా వెస్ట్, బెంగాల్‌లో కలిగంజ్, కేరళలో నిలంబూర్‌లో ఉప ఎన్నికలు జరిగాయి.పశ్చిమ బెంగాల్, కేరళలో వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీజేపీతో పాటు %×చీణ×ూ% కూటమి ఆత్మవిశ్వాసానికి పరీక్షగా మారనున్నాయి. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పరాజయం తర్వాత నిశ్శబ్దంగా ఉన్న ఆప్ ప్రదర్శనపై గుజరాత్, పంజాబ్‌లో చూపిన స్పందన కీలకంగా మారనుంది.

## ఏడాది పాలనలో ఒడిశాకు సున్నా నిధులు




ఒడిశాలో బీజేపీ ఏడాది పాలనపై బిజు జనతా దళ్ నేత భృగు బాక్సీపాత్ర తీవ్ర విమర్శలు చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉన్నా.. రాష్ట్ర అభివృద్ధికి సమృద్ధిగా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. గత పాలనతో పోల్చుకుంటే ప్రస్తుత సంవత్సరానికి నిధుల కేటాయింపులు తగ్గాయని ఆయన వివరించారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నా కేంద్ర పథకాలకు మొండిచేయి చూపించారని మండిపడ్డారు. మోడీ ప్రభుత్వం గొప్పగా చెప్పుకునే కేంద్ర పథకాలైనా..పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్ స్కీంలకు జీరో నిధులు కేటాయించారని ఆరోపించారు. బీజేపీ ఏడాది పాలనలో ఒడిశాకు ఆశించిన స్థాయిలో కేంద్ర నిధులు, అభివృద్ధి జగరలేదన్నారు. అంతేకాకుండా రాష్ట్రంలో నేరాలు పెరిగిపోతున్నాయని, మహిళలకు,పిల్లలకు రోజురోజుకు భద్రత కరువైందన్నారు. గడిచిన ఏడాదిలో 15 లైంగిక దాడులు, 26వేల పైగా FIRs నమోదైయ్యాయని తెలిపారు. గత సంవత్సరంలో, మహిళలు పిల్లలపై అత్యాచారాలలో ఒడిశా అగ్రస్థానంలో ఉందని ఆయన తెలియజేశారు. రాష్ట్రంలో పెట్టుబడులు నిలిచిపోయాయని, గత సంవత్సరం రూ.37,000 కోట్లుగా ఉన్న పెట్టుబడులు ఈ సంవత్సరం రూ.40 కోట్లకు గణనీయంగా తగ్గాయని చెప్పారు. ఐదేండ్ల పాలనలో ఒక సంవత్సరం పూర్తయింది, కానీ ఒడిశాకు ఎటువంటి ప్రయోజనాలు లభించలేదని బీజేపీ ప్రభుత్వంపై భృగు బాక్సీపాత్ర మండిపడ్డారు.

## అమెరికా దాడులను ఖండించిన పాకిస్థాన్..

ఇరాన్‌లోని ఫోర్డో, ఇస్ఫహాన్, నతాంజ్ అణు కేంద్రాలపై అమెరికా చేసిన దాడులను పాకిస్థాన్ ఖండించింది, ఇది అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమేనని, తనను తాను రక్షించుకునే హక్కు ఇరాన్ కు ఉందని పేర్కొంది. అయితే ఈ దాడులకు ఒక రోజు ముందు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌ను 2026 నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ చేసింది. భారత్–పాకిస్థాన్ సంక్షోభంలో ట్రంప్ చూపిన దౌత్యపరమైన జోక్యాన్ని ప్రశంసిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పింది. అయితే, ఇరాన్‌పై దాడులతో పాకిస్తాన్ ధోరణి మారింది ఇప్పుడు ఈ దాడులను "తీవ్రంగా ఆందోళనకరం" అని విమర్శించింది. ఈ దాడులతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరుగుతాయిని, ప్రజల జీవన భద్రతకు ముప్పు వాటిల్లుతుందని పాకిస్థాన్ విదేశాంగ శాఖ పేర్కొంది. దౌత్య చర్చల ద్వారా సంక్షోభాన్ని పరిష్కరించాలని, అన్ని పక్షాలూ అంతర్జాతీయ చట్టాలను గౌరవించాలని కోరింది. పాకిస్థాన్, ఇరాన్‌తో 900 కి.మీ. సరిహద్దు పంచుకుంటుంది కాబట్టి, ప్రాంతీయ శాంతి కోసం సంయమనం అవసరమని వాదిస్తున్నది.

## 'హర్మూజ్ జలసంధి' మూసివేత

వరుస దాడులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ఇరాన్ అనుకున్నంత పని చేసింది. తమ దేశంలోని అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయిల్, అమెరికా బాంబుల వర్షం కురిపించిన నేపథ్యంలో.. ప్రపంచ చమురు మార్కెట్‌కు జీవనాడిగా ఉన్న హర్మూజ్ జలసంధిని మూసివేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇరాన్ పార్లమెంట్ ఆమోదం తెలిపినట్టు తెలిసింది. శత్రువులపై ప్రతీకారం తీర్చుకోవడంతోపాటు ప్రపంచదేశాల మద్దతును కూడగట్టేందుకే ఇరాన్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. ప్రపంచవ్యాప్తంగా రోజువారీ చమురు అవసరాల్లో 20 శాతం హర్మూజ్ ద్వారానే రవాణా అవుతోంది. అరేబియా సముద్రంలో ఒమన్‌కు చెందిన ముసాండం ద్వీపకల్పం–ఇరాన్ మధ్య ఉన్న అత్యంత ఇరుకైన జలసంధి ఇది. దీనిలో ఓ చోట అత్యంత ఇరుకుగా కేవలం 33 కిలోమీటర్లు మాత్రమే ఉంటుంది. ఈ మార్గం నుంచి నిత్యం రెండుకోట్ల బారెళ్ల చమురు వివిధ దేశాలకు వెళుతుంది. సౌదీ, ఇరాన్, యూఏఈ, కువైట్, ఇరాక్‌ల నుంచి ఎగుమతి అవుతోంది. ఇక లిక్విఫైడ్ నేచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జీ) రవాణాకు కూడా అత్యంత కీలకం. మూడింట ఒక వంతు ఎల్ఎన్‌జీ కూడా ఇక్కడి నుంచే వివిధ దేశాలకు చేరుతుంది. ఇరాన్ నిర్ణయం అంతర్జాతీయ వాణిజ్యంపైనా ప్రభావం పడుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా భారత్ తన అవసరాల్లో 90శాతం ముడి చమురును విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటోంది. అందులో 40శాతం హర్మూజ్ జలసంధి ద్వారానే రవాణా అవుతోంది. ప్రభుత్వం తన 74 రోజుల చమురు నిల్వలను తగ్గించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇరాన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచ మార్కెట్‌లో రూపాయి విలువపైనా ప్రభావం చూపిస్తుంది.ఇప్పటికే బ్యారెల్ ముడిచమురు ధర 90 డాలర్ల వద్ద కదలాడుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, యూఏఈ దేశాల నుంచి అత్యధిక మొత్తంలో భారత్ ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఈ చమురును తీసుకొచ్చే నౌకలు ఒమన్–ఇరాన్ సముద్ర మార్గంలో ఉన్న హర్మోజ్ జల సంధిలో ప్రయాణిస్తుంటాయి. ప్రపంచ దేశాలు వినియోగించే ఎల్ఎన్‌జీలోనూ 20 శాతం ఇక్కడి నుంచే సరఫరా జరుగుతోంది. ఈ నౌకలన్నీ హర్మూజ్ జలసంధి నుంచే రాకపోకలు సాగించాలి. ఈ నేపథ్యంలో హర్మోజ్ జల సంధిని మూసివేస్తూ ఇరాన్ తీసుకున్న నిర్ణయం కారణంగా భారత్‌లో ఇంధన ధరలు పెరిగే అవకాశం ఉందని వాణిజ్య రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.




## ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించొద్దు

గాజాలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణ హోమానికి వ్యతిరేకంగా లండన్‌లో ప్రజలు ఎలుగెత్తారు. పాలస్తీనాకు మద్దతుగా వేలాది మంది మార్చ్ నిర్వహించారు. ఇజ్రాయిల్ నరమేధాన్ని ఖండించారు. పాలస్తీనాలో అక్రమణలకు ఇజ్రాయిల్ ముగింపు పలకాలని డిమాండ్ చేశారు. అలాగే ఇరాన్‌పై దాడులను కూడా ఇజ్రాయిల్ ఆపాలని డిమాండ్ చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు కారణమవుతున్న ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయించడం ఆపాలని బ్రిటన్ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. బ్రిటన్ ప్రధాని చేతులు రక్తంతో తడిసాయని నినాదాలు చేశారు. బ్యానర్లు ప్రదర్శించారు. 'నేషనల్ మార్చ్ ఫర్ పాలస్తీనా' పేరుతో నిర్వహించిన ఈ ర్యాలీలో వేలాది మంది పాల్గొన్నారు. సెంట్రల్ లండన్‌లోని బ్రిటీష్ మ్యూజియంకు సమీపంలోని రస్సెల్ స్క్వేర్ నుంచి బ్రిటీష్ పార్లమెంట్‌కు ఆనుకొని ఉన్న వీధి వరకూ ఈ ర్యాలీ జరిగింది. ఈ వీధిలోనే ప్రధానమంత్రి కీర్ స్టార్మర్, ఇతర ప్రముఖుల నివాసాలు ఉన్నాయి. దాదాపు నాలుగు గంటల పాటు ఈ ర్యాలీ జరిగింది. ఇజ్రాయిల్‌కు ఆయుధాలు విక్రయిస్తున్నందుకు, గాజాలో ఇజ్రాయిల్ హత్యాకాండను ఆపడానికి తక్షణ చర్యలు తీసుకోనందుకు బ్రిటన్ ప్రధాని చేతులు రక్తంతో తడిసాయని ప్లకార్డులు ప్రదర్శించారు. 'ప్రధాని.. మీరు.. సిగ్గుపడాలి' అని బిగ్గరగా నినాదాలు చేశారు.

## ఇరాన్‌లో ఇంకా 700 మంది కశ్మీరీ విద్యార్థులు



జమ్మూకశ్మీర్‌కు చెందిన 700 మందికిపైగా విద్యార్థులు ఇరాన్‌లోని టెహ్రాన్, కెర్మాన్, గిలాన్, షిరాజ్, అరాక్ వంటి పలు ప్రాంతాల్లో ఇంకా చిక్కుకుపోయి ఉన్నారని, వారిని వెనక్కి రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని జమ్మూకశ్మీర్ విద్యార్థుల సంఘం తెలిపింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి అక్కడి నుంచి స్వదేశానికి తీసుకురావాల్సి ఉందని పేర్కొంది. వారి భద్రత, సకాలంలో తరలింపు కోసం తాము విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ, టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం, జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి కార్యాలయంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్టు తెలిపింది.ప్రస్తుతం విద్యార్థులందరూ సురక్షితంగా ఉన్నారని తల్లిదండ్రులకు తాము హామీ ఇస్తున్నట్టు సంఘం ప్రతినిధులు తెలిపారు. గాయపడిన ఇద్దరు విద్యార్థులను ఇప్పటికే సురక్షిత ప్రాంతాలకు తరలించామని, రాబోయే రెండు రోజుల్లో వారిని స్వదేశానికి పంపేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని కూడా వారు తెలిపారు. చిక్కుకుపోయిన ప్రతి విద్యార్థి క్షేమం తమకు ముఖ్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఇంటికి చేరే వరకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూనే ఉంటామని పేర్కొన్నారు.ఈ విషయంపై ఇరాన్ రాయబార కార్యాలయ డిప్యూటీ చీఫ్ ఆఫ్ మిషన్, మహమ్మద్ జవాద్ హొస్సేనీ మాట్లాడుతూ భారతీయులను తాము తమ సొంత ప్రజల్లా భావిస్తామని, తమ గగనతలం మూసివేసినప్పటికీ భారతీయ పౌరుల సురక్షిత ప్రయాణం కోసం దానిని తెరిచేందుకు ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. టెహ్రాన్ తమ గగనతలాన్ని తెరవడంతో శుక్రవారం రాత్రి, శనివారం ఇరాన్ నుంచి దాదాపు 1000 మంది విద్యార్థులతో కూడిన విమానాలు ఢిల్లీలో సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి.

'ఆపరేషన్ సింధు' ద్వారా మిగిలిన విద్యార్థులను కూడా త్వరలోనే స్వదేశానికి తీసుకువచ్చేందుకు భారత ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది.

## డీఎన్ఏ నమూనాలు సరిపోలడం లేదు..

అహ్మదాబాద్: అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమాన ప్రమాదంలో మరణించిన వారి గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పటివరకు 231 మృతదేహాలను గుర్తించగా.. మరికొందరి డీఎన్ఏ నమూనాలు సరిపోలడం లేదని అధికారులు వెల్లడించారు. దీంతో మిగతా రక్త సంబంధీకుల నమూనాలు ఇవ్వాలని ఎనిమిది కుటుంబాలకు సూచించినట్లు తెలిపారు. డీఎన్ఏ సరిపోలితేనే మృతదేహాలను అప్పగిస్తామని అధికారులు స్పష్టం చేయడం, పదిరోజులు గడిచినా తమవారి మృతదేహాలు ఇంకా అందకపోవడంతో కొన్ని కుటుంబాల్లో తీవ్ర ఆవేదన వ్యక్తమవుతోంది. "సాధారణంగా తండ్రి లేదా కుమారుడు/ కుమార్తె నమూనాలు తీసుకుంటాం. డీఎన్ఏతో సరిపోలని పక్షంలో మరో బంధువు/రక్త సంబంధీకుల నమూనాలు ఇవ్వాలని అడుగుతాం. గతంలో ఒక తోబుట్టువు నమూనా ఇచ్చినట్లయితే, ఇప్పుడు మరొకరి డీఎన్ఏ నమూనా ఇవ్వాలని బాధిత కుటుంబాలను అడుగుతున్నాం. చాలా కేసుల్లో తోబుట్టువుల నమూనాలు సరిపోలుతున్నాయి'' అని అహ్మదాబాద్ ప్రభుత్వాస్పత్రి వైద్యులు వెల్లడించారు. అయితే, ఎనిమిది కుటుంబాల నమూనాలు సరిపోలలేదని, దీంతో మరొకరి నమూనాలను ఇవ్వాలని కోరామన్నారు. విమాన



ప్రమాదంలో మరణించిన వారిని గుర్తించేందుకు డీఎన్ఏ పరీక్ష ఒక్కటే మార్గమని పేర్కొన్న అధికారులు శుక్రవారం నాటికి 231 మృతదేహాలను గుర్తించామన్నారు. వీటిలో 210 మృతదేహాలను వారి కుటుంబీకులకు అందజేసినట్టు తెలిపారు. డీఎన్ఏ సరిపోల్చే ప్రక్రియ అత్యంత సున్నితమైందని, వీటిలో చట్టపరమైన అంశాలు ఇమిడి ఉంటాయని వైద్య నిపుణులు పేర్కొన్నారు. అందుకే అత్యంత జాగ్రత్తగా ఈ ప్రక్రియ కొనసాగుతోందని, బాధిత కుటుంబాలకు మృతదేహాలు అందించేందుకు అన్ని విభాగాలు తీవ్ర కృషి చేస్తున్నాయన్నారు.

## అమెరికాకు ఇరాన్ మంత్రి వార్నింగ్

ఫోర్డో సహా తమ దేశంలోని మూడు అణుకేంద్రాలపై దాడులు చేయడం ద్వారా అమెరికా తీవ్రమైన నేరానికి పాల్పడిందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ ఆరోపించారు. తాము శాంతియుతంగా ఏర్పాటు చేసుకుంటున్న అణు కేంద్రాలపై అమెరికా దాడులు చేయడాన్ని ఆయన ఖండించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి దాడులు చేసిన అమెరికాకు తగిన గుణపాఠం చెబుతామని స్పష్టం చేశారు. ఈ దాడులకు ప్రతీకారంగా తాము చేయబోయే గాయం అమెరికాకు శాశ్వతంగా గుర్తుండిపోతుందని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశమైన అమెరికా ఇలా నేరపూరితంగా ప్రవర్తించడం సరికాదన్నారు. ఇటువంటి నేరపూరిత ప్రవర్తన ఉన్న అగ్రరాజ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని ఐరాసలోని సభ్యులకు అబ్బాస్ సూచించారు. యూఎన్ చార్టర్ ప్రకారం.. ఆత్మరక్షణ హక్కును వినియోగించుకుంటూ ఇరాన్ తన సార్వభౌమత్వాన్ని,



ప్రజలను రక్షించుకోవడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటుందని తెలిపారు. అమెరికా ప్రవర్తనను ఖడించాలని ప్ర పంచ దేశాలకు అబ్బాస్ పిలుపునిచ్చారు.

## సామ్రాజ్యవాద ఆధిపత్యం కోసమే..

న్యూఢిల్లీ: ఇరాన్‌పై అమెరికా దాడులను వామపక్ష పార్టీలు తీవ్రంగా ఖండించాయి. ఇది ఇరాన్ సార్వభౌమత్వాన్ని, ఐరాస ఛార్టర్‌ను ఉల్లంఘించడమే అవుతుందని మండిపడ్డాయి. అమెరికా దాడులు అంతర్జాతీయంగా ఉద్రిక్తతలు పెంచుతాయని, పశ్చిమాసియాను అస్థిరపరుస్తా యని, తీవ్రమైన ఆర్థిక పరిణామాలు సంభవిస్తా యని తెలిపాయి. ఈ మేరకు సీపీఐ (ఎం) ప్రధాన కార్యదర్శి ఎంఏ బేబీ, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, సీపీఐ (ఎం–ఎల్ లిబరేషన్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ఫార్వర్డ్‌బ్లాక్ ప్రధాన కార్యదర్శి దేవరాజన్ ఆదివారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. 'ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తున్నందుకే దాడులు చేశామంటూ అమెరికా, ఇజ్రాయిల్ తమ చర్యను సమర్థించుకుంటున్నాయి. కానీ ఇక్కడ ఓ విషయాన్ని గమనించాల్సిన అవసరం ఉంది. అంతర్జాతీయ అణు శక్తి సంస్థ (ఐఏఈఏ) డైరెక్టర్ జనరల్ రఫేల్ గ్రాస్సీ ఈ నెల 19న ఒక ప్రకటన చేస్తూ ఇరాన్ ఓ పద్ధతి ప్రకారం అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని చెప్పడానికి తమ వద్ద ఎలాంటి ఆధారం లేదని తెలిపారు. ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేస్తోందని నిర్ధారణకు రావడానికి తమ వద్ద నిర్దిష్ట ఆధారమేదీ లేదని అమెరికా ఇంటెలిజెన్స్ సంస్థలు కూడా అంగీకరిం చాయి. అదీకాక అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందంపై (ఎన్‌పీటీ) ఇరాన్ సైతం సంతకం చేసింది. వాస్తవాలు ఇలా ఉండగా ఈ నెల 12న ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి ప్రారంభించింది. ఇరాన్, అమెరికా మధ్య చర్చలు జరగకుండా అడ్డుకునేందుకు ఇజ్రాయిల్ ఈ దాడులు జరుపుతోంది. ఇప్పుడు అమెరికా కూడా ఈ దుందుడుకు చర్యలో ఇజ్రాయిల్‌తో చేతులు కలిపింది.

## ట్రంప్ తీరును ఖండించిన కాంగ్రెస్



అకారణంగా ఇరాన్ దేశంపై అమెరికా దాడులు చేసిన విషయం తెలిసిందే. దీంతో యూఎస్ తీరుపై ప్రపపంచ వ్యాప్తంగా నిరసన వ్యక్తమువుతున్నాయి. తాజాగా ఇరాన్ మూడు అణు కేంద్రాలపై అమెరికా జరిపిన దాడిని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఖండించింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌తో చర్చలు కొనసాగించాలన్న.. యూఎస్ ఇచ్చిన పిలుపును అపహాస్యం చేసిందని కాంగ్రెస్ పేర్కొంది. అమెరికా దాడులను మోడీ ప్రభుత్వం ఖండించకపోవడాన్ని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ఇరాన్‌తో తక్షణమే దౌత్యపరమైన చర్చలు జరపాలని, ఇప్పటివరకు ప్రదర్శించిన దానికంటే.. ఇంకా ఎక్కువ నైతిక ధైర్యాన్ని ప్రదర్శించాలి అని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జి జైరాం రమేష్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ సందర్భంగా మోడీ గాజాలో జరుగుతున్న మారణహోమంపైనా.. మాట్లాడకపోవడం.. మౌనం వహించడం తగదని ఎక్స్ పోస్టులో జైరాం రమేష్ అన్నారు.

# చక్కని ఆరోగ్యం



## భోజనం చేసిన వెంటనే యోగా చేస్తే..!

యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు, ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? ఆరోగ్యంగా ఉండాలంటే రోజువారీ కార్యకలాపాల్లో శారీరక వ్యాయామాన్ని భాగం చేసుకోవడం చాలా అవసరం. ముఖ్యంగా చిన్నపాటి యోగాసనాలు ఆరోగ్యానికి చెప్పలేనంత మేలు చేస్తాయి. యోగా శరీర వశ్యతను పెంచడంలో సహాయపడటమే కాకుండా, మొత్తం ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. యోగికి ఎటువంటి వ్యాధి లేనట్లుగా, యోగా చేసేవారి ఆరోగ్యానికి ఏ ఢోకా ఉండదని చెబుతున్నారు నిపుణులు. యోగాతో పాటు,

ఆహారానికి కూడా మంచి ప్రాముఖ్యత ఇవ్వాలి. ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం ఎలా ఉండాలి? ఆహారం తినడానికి, యోగా చేయడానికి మధ్య ఎంత సమయం ఉండాలి? అనే విషయాల గురించి సీనియర్ డైటీషియన్, డయాబెటిస్ నిపుణుడు డాక్టర్ నిషా జైన్ మాట్లాడుతూ.. యోగా చేయడానికి ముందు మీ కడుపు సాధ్యమైనంత వరకు ఖాళీగా ఉండాలని అన్నారు. భోజనానికి, యోగాకు మధ్య కనీసం 8 నుంచి 10 గంటల గ్యాప్ నిర్వహించడం మంచిదని సూచించారు. సాయంత్రం త్వరగా భోజనం తినవచ్చు. ఆ తర్వాత ఆ మరుసటి రోజు ఉదయం పూట యోగా క్షేమంగా చేయవచ్చు. అయితే పగటిపూట యోగా చేస్తుంటే మాత్రం తినడానికి, యోగాకి మధ్య కనీసం 1 గంట గ్యాప్ అవసరమని చెప్పారు. అంటే భోజనం తిన్న 1 గంటలోపు యోగా చేయకుండా ఉండాలని అంటున్నారు. యోగా చేసే ముందు తేలికైన ఆహారాలు తినవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. యోగా చేసే ముందు గ్రీన్ టీ, బ్లాక్ కాఫీ, అరటిపండ్లు, ఆపిల్స్ తినవచ్చు. నట్స్, డ్రైఫ్రూట్స్ వంటి ఆహారాలు తినవచ్చు. ఈ ఆహారాలు శరీరంలో నెమ్మదిగా శక్తిని విడుదల చేస్తాయి. ఇది యోగా సమయంలో శరీరాన్ని చురుగ్గా ఉంచుతుంది కూడా. ముఖ్యంగా యోగా చేసే ముందు వేయించిన లేదా కారంగా ఉండే ఆహారాన్ని పూర్తిగా మానేయడం మంచిది. ఇది కడుపు ఉబ్బరం, కడుపులో భారమైన అనుభూతి, వికారం వంటి లక్షణాలను కలిగిస్తుంది. యోగా చేసిన 30 నిమిషాల తర్వాత పుష్కలంగా నీరు తాగాలి. ఇది శరీరాన్ని తిరిగి హైడ్రేట్ చేస్తుంది. దీనితో పాటు, కొబ్బరి నీరు లేదా నిమ్మకాయ నీరు కూడా తాగవచ్చు. అలాగే యోగా తర్వాత ప్రోటీన్ ఆహారాలు కూడా తీసుకోవచ్చు. ఇందుకోసం ఉడికించిన గుడ్లు తినవచ్చు.

## ఖాళీ కడుపుతో బెండకాయ నీరు తాగితే..?

మనకు సులభంగా దొరికే కూరగాయల్లో బెండకాయ ఒకటి. ఇది మన వంటకాల్లో తరచుగా వాడతాం. తక్కువ కేలరీలు, ఎక్కువ పోషకాలు ఉన్న బెండకాయ నీళ్లు ఆరోగ్యానికి చాలా మంచివని నిపుణులు చెబుతున్నారు. బెండకాయను రాత్రి నీటిలో నానబెట్టి ఆ నీటిని ఉదయం ఖాళీ కడుపుతో తాగితే శరీరానికి చాలా మంచిదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కానీ దీన్ని ఎంత మోతాదులో తీసుకోవాలి, ఎవరు తాగాలి, ఎవరు తాగకూడదు అన్నదానిపై పూర్తి అవగాహన ఉండాలి. బెండకాయలో ఎక్కువగా ఉండే ఫైబర్ పేగుల పనితీరును మెరుగుపరుస్తుంది. దీని వల్ల మలబద్ధకం తగ్గుతుంది. అజీర్తి లాంటి సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. బెండకాయలో గ్లూకోజ్ను శరీరం తీసుకోకుండా తగ్గించే గుణం ఉంది. ఇది షుగర్ను అదుపులో ఉంచడంలో సాయపడుతుంది. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్ చెడు కొలెస్ట్రాల్ ను తగ్గిస్తాయి. గుండెకు రక్షణ ఇస్తాయి. రక్తనాళాల్లో వాపు తగ్గి గుండె సంబంధిత సమస్యల నుంచి కాపాడుతుంది. బెండకాయలో కాల్షియం, మెగ్నీషియం, విటమిన్ %ఖ% లాంటి పోషకాలు చాలా ఉంటాయి. ఇవి ఎముకలు గట్టిగా అయ్యేలా చేస్తాయి. ఈ నీళ్లు తాగిన తర్వాత కడుపు నిండినట్లు అనిపిస్తుంది. దీని వల్ల ఆకలి తగ్గి ఎక్కువ ఆహారం తీసుకోవడం తగ్గుతుంది. దాంతో బరువు అదుపులో ఉంటుంది. బెండకాయలో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉండటం వల్ల చర్మ సమస్యలు తగ్గుతాయి. ముడతలు, మొటిమలు తగ్గడంలో



సాయపడతాయి. చర్మం కాంతివంతంగా మారుతుంది. వాంతులు, గ్యాస్, కడుపు ఉబ్బరం.. ఎక్కువ ఫైబర్ వల్ల కొందరికి అజీర్తి లాంటి ఇబ్బందులు రావచ్చు. అలర్జీ వచ్చే అవకాశం.. కొందరు బెండకాయకు అలర్జీ కలిగి ఉంటారు. అలాంటి వారు ఈ నీటిని తాగకూడదు. ఫ్రక్టోజ్ వల్ల అసౌకర్యం.. బెండకాయలో ఉండే ఫ్రక్టోజ్ వల్ల కొందరికి గ్యాస్, అసౌకర్యం కలగవచ్చు. కిడ్నీలో రాళ్లు ఉన్నవారు జాగ్రత్త.. ఇందులో ఉండే ఆక్సలేట్ పదార్థం రాళ్లు ఏర్పడటానికి కారణం అవుతుందని పరిశోధనలు చెబుతున్నాయి. బెండకాయ నీళ్ల తయారీ విధానం: ఐదు తాజా బెండకాయలు తీసుకోండి. వాటి చివర్లు కట్ చేసి మధ్యలో చీల్చండి.వీటిని రెండు గ్లాసుల నీటిలో రాత్రంతా నానబెట్టండి.ఉదయం ముక్కలను తీసివేసి ఆ నీటిని ఖాళీ కడుపుతో తాగండి. బెండకాయ నీళ్లు సహజంగా ఆరోగ్యాన్ని పెంచే ఒక మంచి మార్గం. కానీ దీన్ని రోజూ తీసుకునే ముందు మీ ఆరోగ్య పరిస్థితులను ఆలోచించుకోండి. అవసరమైతే డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది.

## జ్వరానికి అసలు కారణం ఏంటి..?



మన శరీరానికి చాలా రకాల ఇన్ ఫెక్షన్లు వస్తాయి. వాటిలో ముఖ్యంగా వైరస్ లు, బ్యాక్టీరియా వల్ల వచ్చేవి ఎక్కువగా ఉంటాయి. ఒక వ్యక్తిని పరీక్ష చేసిన తర్వాత డాక్టర్ ఇది వైరల్ ఫీవర్ అని చెప్పడం మనం తరచూ వింటాం. కానీ అది వైరస్ వల్ల వచ్చిందని ఎలా అర్థం చేసుకోవాలి..? బ్యాక్టీరియా వల్ల వచ్చిందా లేదా వైరస్ వల్ల వచ్చిందా అని ఎలా తెలుసుకోవాలి..? ఈ రెండింటి మధ్య తేడాలు తెలుసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరం. వైరస్ లు, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఈ రెండు జబ్బులు సూక్ష్మజీవుల వల్ల వస్తాయి. కానీ అవి శరీరంపై పని చేసే విధానం వేరుగా ఉంటుంది. బ్యాక్టీరియా అనేది సొంతంగా బతకగల ఒకే కణం జీవి. కొన్ని రకాల బ్యాక్టీరియా శరీరానికి హానికరం కావు. కానీ కొన్ని రకాల బ్యాక్టీరియా జబ్బులు కలిగిస్తాయి. ఉదాహరణకు టీబీ (ట్యూబర్క్యులోసిస్), యూరినరీ ట్రాక్ట్ ఇన్ ఫెక్షన్లు, గొంతు నొప్పి లాంటివి ఈ రకానికి చెందుతాయి. ఇవి యాంటీబయోటిక్ మందులతో నయం అవుతాయి. వైరస్ లు చాలా చిన్న జీవులు. ఇవి శరీరంలోకి వెళ్ళిన తర్వాత మంచి కణాలను ఆక్రమించి పెరుగుతాయి. వాటి వల్ల జలుబు, దగ్గు, జ్వరం, కోవిడ్ లాంటి జబ్బులు వస్తాయి. వైరల్ ఇన్ ఫెక్షన్ కు యాంటీబయోటిక్స్ పని చేయవు.వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లకు కొన్ని లక్షణాలు ఒకేలా కనిపించవచ్చు. ఉదాహరణకు జ్వరం, గొంతు నొప్పి, అలసట, ఒళ్ళు నొప్పులు రెండింటిలోనూ రావచ్చు. కానీ వైరల్ ఇన్ ఫెక్షన్లు సాధారణంగా నెమ్మదిగా వస్తూ 5 నుంచి 10 రోజుల్లో తగ్గిపోతాయి. అయితే బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు రోజురోజుకూ తీవ్రంగా మారతాయి. వాటిని వదిలేస్తే ఇతర శరీర భాగాలకు వ్యాపించే ప్రమాదం ఉంటుంది.చాలా సార్లు డాక్టర్లు లక్షణాలను చూసి చెబుతారు. అయితే కచ్చితంగా తెలుసుకోవాలంటే రక్త పరీక్ష, మూత్ర పరీక్ష లాంటివి అవసరం. కొన్నిసార్లు గొంతు స్రావాన్ని కూడా చూడాలి. కొన్ని వైరల్ జబ్బులు పొక్కులు లాగా కనిపిస్తాయి.. ఉదాహరణకు ఆటలమ్మ, అమ్మవారు లాంటివి. కానీ కొన్నింటిని గుర్తించడానికి టెస్టులు అవసరం.. ఉదాహరణకు కోవిడ్, హెపటైటిస్. చికిత్స పూర్తిగా జబ్బుకు కారణాన్ని బట్టి నిర్ణయించాలి. వైరస్ వల్ల వచ్చిన ఇన్ ఫెక్షన్ లకు ఎక్కువగా విశ్రాంతి, ద్రవ పదార్థాలు తీసుకోవడం, కొన్ని ఉపశమనం ఇచ్చే మందులు వాడటమే చేస్తారు. బ్యాక్టీరియల్ ఇన్ ఫెక్షన్లు అయితే డాక్టర్ సూచన మేరకు యాంటీబయోటిక్స్ తీసుకోవాలి. కానీ వాటిని అనవసరంగా వాడకూడదు. అది రోగనిరోధక శక్తిని తగ్గిస్తుంది. అలాగే జాగ్రత్తలు తీసుకోవడం వల్ల జబ్బులు రాకుండా చూసుకోవచ్చు. ఈ రెండు రకాల జబ్బులను కొన్ని సాధారణ జాగ్రత్తలతో ఆపవచ్చు. జబ్బుతో ఉన్నవారికి దూరంగా ఉండడం.గోరువెచ్చని నీళ్లు తాగడం.చేతులు కడగకుండా ముఖాన్ని తాకకూడదు. మాస్క్ వాడటం, శుభ్రత పాటించడం ముఖ్యమైనవి. వైరల్, బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్ల లక్షణాలు కొంతవరకు ఒకేలా కనిపించినా.. చికిత్స పూర్తిగా వేరుగా ఉంటుంది. సరైన పరీక్షల ద్వారానే సరైన వైద్యం అందుతుంది. అందుకే మనం జాగ్రత్తగా ఉండి.. ఏ లక్షణాలు కనిపించినా డాక్టర్లను కలిసి కారణాన్ని కచ్చితంగా తెలుసుకొని చికిత్స తీసుకోవాలి.

## ఈ అలవాట్లు ఉంటే పాతిక ఏళ్లకే వృద్ధాప్యం..

కొంత మంది పాతికేళ్లకే నలబై ఏళ్ల మాదిరి కనిపిస్తుంటారు. ముఖ్యంగా అబ్బాయిల్లో ఈ లక్షణాలు ఎక్కువగా కనిపిస్తుంటాయి. నిజానికి.. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని నిపుణులు అంటున్నారు. అంతేకాదు వృద్ధాప్యానికి కూడా ఈ అలవాట్లే కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మన రోజువారీ ఆహార అలవాట్లు ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. అంతేకాదు వృద్ధాప్యానికి కారణమవుతాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. ఏమి తింటారు అనే దాని నుంచి స్ట్రెస్‌ని ఎలా ఎదుర్కొంటారు అనే దాని వరకు.. అన్ని అంశాలు మీ వయస్సు ఎంత వేగంగా క్షీణిస్తుందో నిర్ణయించగలవట. అలాగే ఈ అలవాట్లు దీర్ఘకాలిక ఆరోగ్యంపై కూడా పెద్ద ప్రభావాన్ని చూపుతుందని చెబుతున్నారు.ధూమపానం: వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేసే విషయంలో ధూమపానం అత్యంత హానికరమైన అలవాట్లలో ఒకటి. ఇది చర్మం స్థితిస్థాపకతను దెబ్బతీస్తుంది. ఇది రక్త ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ముడతలు, నిస్తేజమైన చర్మానికి దారితీస్తుంది. ఇది కాలేయంతో సహా మొత్తం శరీర ఆరోగ్యంపై చెడు ప్రభావాన్ని చూపుతుంది.మద్యం సేవించడం: అధికంగా మద్యం సేవించడం వల్ల వృద్ధాప్య సంకేతాలు కనిపిస్తాయి. మద్యం చర్మాన్ని డీహైడ్రేట్ చేస్తుంది. వాపుకు కారణమవుతుంది. అధికంగా మద్యం సేవించడం వల్ల కాలక్రమేణా కాలేయ పనితీరు దెబ్బతింటుంది. అధిక వేడి: విటమిన్ డి కోసం సూర్యరశ్మి చాలా



అవసరం. అయినప్పటికీ.. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య సూర్యరశ్మిని నివారించడం మంచిది. ఎందుకంటే ఇది చర్మం వృద్ధాప్యాన్ని వేగవంతం చేస్తుంది. సన్ స్క్రీన్ ఉపయోగించకపోతే, చర్మాన్ని సూర్య రశ్మి నుంచి కాపాడుకోవడానికి రక్షణ దుస్తులు ధరించకపోతే సూర్యరశ్మి వల్ల మచ్చలు, సన్నని గీతలు, ముడతలు చర్మంపై ఏర్పడి వృద్ధాప్య ప్రక్రియను వేగవంతం చేస్తాయి.దీర్ఘకాలిక నిర్జలీకరణం: సరైన హైడ్రేషన్.. అంటే తగినంత నీరు తాగకపోతే డీహైడ్రేషన్ సమస్యలు వస్తాయి. తగినంత నీరు త్రాగకపోవడం వల్ల చర్మం పొడిబారి, పొలుసులుగా మారి నిర్జీవంగా కనిపిస్తుంది.ప్రాసెస్ చేసిన ఆహారాలు, చక్కెర తీసుకోవడం: చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలు జీవక్రియను ప్రభావితం చేయడమే కాకుండా చర్మ సమస్యలు, వాపుకు కూడా కారణమవుతాయి. ఇది చర్మం జీవం కోల్పోవడం, ముడతలు వంటి వృద్ధాప్య అకాల సంకేతాలకు దారితీస్తుంది. ఒత్తిడి: వృద్ధాప్యానికి ఒత్తిడి ప్రధాన కారణం. దీర్ఘకాలిక ఒత్తిడి హార్మోన్ల సమతుల్యతను దెబ్బతీస్తుంది. నిద్రను ప్రభావితం చేస్తుంది. ముఖంపై మచ్చలు లేదా కళ్ళ కింద నల్లటి వలయాలకు దారితీస్తుంది. ఒత్తిడిని నిర్వహించడానికి, మొత్తం ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి "భ్రమరి ప్రాణాయామం" చేయడం మంచి మార్గం.

## ఉదయాన్నే ఈ తెల్లటి రసం తాగి చూడండి..

ప్రతి రోజు ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ రసం తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది. చాలా మంది ఉదయాన్నే కాఫీ, టీ తాగుతారు. వాటికి బదులు ఈ సహజ రసం తీసుకుంటే శరీరానికి మేలు చేస్తుంది. మనసుకు ప్రశాంతతను ఇస్తుంది. తెల్ల గుమ్మడికాయలో చాలా పోషకాలు ఉంటాయి. ఇవి నరాలకు శక్తిని ఇస్తాయి. మెదడును ప్రశాంతంగా ఉంచడంలో సహాయపడుతాయి. దాంతో ఉదయాన్నే ఈ రసం తాగితే ఒత్తిడి తగ్గుతుంది. ఆందోళన లేకుండా రోజంతా ఉత్సాహంగా ఉంటారు. ఈ రసం మూత్రపిండాలకు ఎంతో మేలు చేస్తుంది. మూత్రంలో వచ్చే ఇన్ ఫెక్షన్లు, మూత్రంలో రక్తం రావడం, పైల్స్ వల్ల రక్తం పోవడం లాంటి సమస్యలను తగ్గిస్తుంది. తెల్ల గుమ్మడికాయ రసం చల్లగా ఉంటుంది. శరీరాన్ని ప్రశాంతంగా ఉంచుతుంది.అల్సర్ తో బాధపడేవారు తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం తాగితే కడుపు లోపల గాయాలు త్వరగా తగ్గుతాయి. కడుపులోని పురుగులను బయటకు పంపిస్తుంది. కొత్త ఇన్ ఫెక్షన్లు రాకుండా ఆపుతుంది.బరువు తగ్గాలని అనుకునే వారికి ఇది బాగా ఉపయోగపడుతుంది. రోజూ ఉదయం ఈ రసం తాగడం వల్ల శరీరంలోని అదనపు నీరు బయటకు పోతుంది. ఇది బరువు తగ్గించడమే కాకుండా.. శరీరాన్ని తేలికగా, శక్తివంతంగా ఉంచుతుంది. శరీరంలో వేడి ఎక్కువగా ఉన్నవారికి కూడా ఇది చాలా మంచిది. ఈ రసం తాగితే శరీరం చల్లబడుతుంది. తేమగా మారుతుంది. వేసవిలో వేడి సమస్యలతో బాధపడే వారికి ఇది మంచి పరిష్కారం.తెల్ల గుమ్మడికాయ రసాన్ని తేనెతో కలిపి ఉదయం, సాయంత్రం తాగితే రక్తం శుభ్రపడుతుంది. ఇది శరీరం లోపల అవయవాలకు సాయపడుతుంది. రక్తం కారడాన్ని నియంత్రించడంలో కూడా తోడ్పడుతుంది. ఈ గుమ్మడికాయలో విటమిన్ బి, సి, కాల్షియం, పొటాషియం, ఫాస్ఫరస్, ఫైబర్, ఐరన్, నీరు ఎక్కువగా ఉంటాయి. ఇవన్నీ ఆరోగ్యానికి అవసరమైన ముఖ్యమైన పదార్థాలు. ప్రతి ఉదయం ఒక గ్లాసు తెల్ల గుమ్మడికాయ జ్యూస్ తాగడం మన శరీరానికి, మనసుకు చాలా మంచిది. ఇది ఒక చిన్న అలవాటు. కానీ దీని వల్ల చాలా గొప్ప ఫలితాలు ఉంటాయి.

## చియా సీడ్స్, నల్లఎండు ద్రాక్ష

**కలిపి నానబెట్టిన నీటితో ఇన్ని లాభాలా..?**



వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి. నల్ల ఎండుద్రాక్ష, చియా సీడ్స్ కలిపి తయారు చేసిన వాటర్ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఈ రెండింటినీ కలిపి తాగడం వల్ల శరీరానికి లోపలి నుంచి పోషణ, శక్తి లభిస్తాయని ఆరోగ్య నిపుణులు అంటున్నారు. నల్ల ఎండుద్రాక్షలో ఐరన్, చియా విత్తనాలలో ఫైబర్, ఖనిజాలు పుష్కలంగా ఉంటాయి. వీటి నీటిని తాగడం వల్ల శరీరంలో హిమోగ్లోబిన్ పెరిగి రక్తహీనత సమస్య తొలగిపోతుంది. చియా విత్తనాలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఎండుద్రాక్ష కూడా జీర్ణక్రియకు సహాయపడుతుంది. ఇవి నానబెట్టిన నీరు మలబద్ధకం, గ్యాస్, అజీర్తి వంటి సమస్యలను తొలగిస్తుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ సహజ చక్కెర మరియు ప్రోటీన్ కలిగి ఉంటాయి, ఇవి శరీరానికి తక్షణ శక్తిని ఇస్తాయి. ఉదయాన్నే వీటి నీటిని తాగడం వల్ల రోజంతా చురుగ్గా ఉండవచ్చు. చియా విత్తనాలు ఎక్కువసేపు కడుపు నిండుగా ఉంచుతాయి. ఎండుద్రాక్ష స్వీట్ తినాలన్న కోరికను తగ్గిస్తుంది. వాటి నీరు కొవ్వును వేగంగా కరిగిస్తుంది. బరువు తగ్గడానికి సహాయపడుతుంది. నల్ల ఎండుద్రాక్ష, చియా విత్తనాలు రెండూ యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉంటాయి. ఇవి నానబెట్టిన నీటిని ప్రతిరోజూ ఉదయం తాగడం వల్ల చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. ఎండుద్రాక్ష, చియా విత్తనాలలో ఒమేగా -3 కొవ్వు ఆమ్లాలు, పొటాషియం ఉంటాయి. ఇవి కొలెస్ట్రాల్ ను నియంత్రిస్తాయి. వాటి నీరు గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటిలో కాల్షియం, మెగ్నీషియం, పొటాషియం వంటి ఖనిజాలు ఉన్నాయి. ప్రతిరోజూ వాటి నీటిని తాగడం వల్ల ఎముకలు బలోపేతం అవుతాయి. ఎండుద్రాక్షలో విటమిన్ సి, చియా విత్తనాలలో యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. వీటి నీరు రోగ నరోధక శక్తిని పెంచుతుంది. జలుబు, ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు తగ్గుతాయి.




# సినిమా



## టీవీలో తండేల్ మూవీ ప్రీమియర్ షో.. రాజు ఎప్పుడొస్తున్నాడంటే..!



నాగ్ చైతన్య కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన చిత్రం తండేల్. యువ సామ్రాట్ అక్కినేని నాగచైతన్య, సాయి పల్లవి కలయి కలో వచ్చిన 'తండేల్'చిత్రాన్ని చందూ మొండేటి తెరకెక్కిం చగా, ఈ మూవీకి వచ్చిన ఆదరణ అంతా ఇంతా కాదు. ఈ చిత్రం రూ.106 కోట్లకు పైగా ప్రపంచ వ్యాప్తంగా గ్రాస్ వసూల్ చేసిందని తండేల్ నిర్మాతలు ప్రకటించారు. రూ.70 కోట్లతో ఈ చిత్రాన్ని బన్నీ వాసు నిర్మించారు. గీతా ఆర్ట్స్ అధినేత, టాలీవుడ్ అగ్ర నిర్మాత అల్లు అరవింద్ సమర్పించిన సంగతి తెలిసిందే. లవ్, యాక్షన్, దేశభక్తి మిళితమైన ఈ చిత్రం ఆడియెన్స్ నుంచి సూపర్బ్ రెస్పాన్స్ ను సొంతం చేసుకుంది. థియేటర్ల వద్ద 'తండేల్' మూవీ కలెక్షన్ల ప్రభంజనం సృష్టించగా, అటు ఓటీటీలోనూ మంచి రెస్పాన్స్ వచ్చింది. కాగా ఈ చిత్రం ఇప్పుడు బుల్లితెర ప్రేక్షకులను కూడా అలరించడానికి సిద్ధంగా ఉంది. జూన్ 29న, 2025న సాయంత్రం 6 గంటలకు జీ తెలుగులో టెలివిజన్ ప్రీమియర్ కి రెడీ అయింది. ఈ మేరకు సదరు సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ తమ సోషల్ మీడియాలో పోస్టు చేసింది.ఈ క్రమంలో చైతన్య, సాయి పల్లవి జంట రెండు తెలుగు రాష్ట్రాల టీవీ ఛానళ్లలో సందడి చేయనున్నారు. ఆదివారం రోజు ఈ జంట ప్రేక్షకులకి మంచి వినోదం పంచనున్నారు. తండేల్ సినిమాలో మ్యూజిక్‌తో పాటు చైతన్య, సాయి పల్లవి నటనకు కూడా విమర్శకుల నుంచి ప్రశంసలు లభించాయి. మొత్తమ్మీద ఈ డీసెంట్ ఎమోషనల్ లవ్ డ్రామా, బలమైన ఎమోషన్స్ అండ్ ఫీల్ గుడ్ సీన్స్ తో సాగుతూ బాగా ఆకట్టుకుంది. డీసెంట్ టేకింగ్ సినిమా స్థాయిని పెంచాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి స్వరాలు అందించారు. సంగీతం కూడా ఎంతగానో ఆకట్టుకుంది. తండేల్ సక్సెస్ తో ఫుల్ జోష్ లో ఉన్న చైతన్య తన తర్వాతి సినిమాను కార్తీక్ దండు దర్శకత్వంలో చేస్తున్న సంగతి తెలిసిందే. చైతూ కెరీర్లో 24(%చీజ%24)వ సినిమాగా తెరకెక్కుతున్న ఈ మూవీ థ్రిల్లర్ గా తెరకెక్కుతోంది. మీనాక్షి చౌదరి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు వృష కర్మ అనే టైటిల్ ను పరిశీలిస్తున్నారు.





## ప్రేమలు బ్యూటీకి బర్త్‌డే విషెస్ తెలిపిన 'డ్యూడ్' టీమ్

ప్రేమలు సినిమాతో స్టార్ నటిగా గుర్తింపు తెచ్చుకుంది మల్లు బ్యూటీ మమితా బైజు. ఈ భామ ప్రస్తుతం వరుస సినిమాలతో దూసుకుపోతుంది. ఆమె ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం డ్యూడ్  ఈ సినిమాకు కీర్తిశ్వరన్ దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్నారు. 'లవ్ టుడే' 'డ్రాగన్' సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తున్నాడు. నేడు మమితా బైజు బర్త్‌డే కావడంతో ఆమెకి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ.. కొత్త పోస్టర్‌ని పంచుకుంది. ఈ సినిమాలో మమితా కురల్ అనే పాత్రలో నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది.

## తెలుగమ్మాయిలకు 20 శాతమే.. ఇంత కష్టం ఎక్కడా లేదు



టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు అవకాశాలు చాలా తక్కువ అనే కంప్లైంట్ ఎప్పటి నుంచో ఉంది. ఇది ఇప్పటికీ కొనసాగుతుందని చెబుతోంది యంగ్ హీరోయిన్ అనన్య నాగళ్ల  టాలీవుడ్‌లో తెలుగమ్మాయిలకు 20 శాతం మాత్రమే అవకాశాలు వస్తాయని..దాని కోసమే పదేళ్లు కొట్టుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తోంది. తాజాగా ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. ఇండస్ట్రీలో తెలుగు అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో  వివరించింది. 'తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా అనిపిస్తుంది. ఇండియాలో ఏ లాంగ్వేజ్ అమ్మాయికి అయినా ఇంత కష్టం ఉండదేమో. తెలుగులో మన వాళ్లకు 20 శాతం మాత్రమే అవకాశం ఉంటుంది. వందలో 80 సినిమాలకు పరభాష హీరోయిన్లనే తీసుకుంటారు. అదే మలయాళం, తమిళ్ తో పాటు ఇతర భాషల్లో చూస్తే..అక్కడ లోకల్ అమ్మాయిలకే 80 శాతం అవకాశం ఇస్తారు. ఇలా ఎక్కడ చూసిన తెలుగు అమ్మాయిలకు 20 శాతం మాత్రమే చాన్స్ ఉంటుంది. ఇందులోనే తమ టాలెంట్‌ని నిరూపించుకోవాలి.  చిన్నప్పటి నంచి సినిమాలు చూసి ఇష్టం పెంచుకొని, పెరెంట్స్ ఒప్పించి ఇండస్ట్రీలోకి వస్తే.. ఈ 20 శాతం కోసమే పదేళ్లు కొట్టుకోవాలి. మిగతావాళ్లకి లోకల్‌తో పాటు మన దగ్గర కూడా 80 శాతం అవకాశాలు ఉంటాయి. అందుకే నాకు తెలుగు అమ్మాయిలను చూస్తే గర్వంగా ఉంటుంది. వాళ్లు మానసికంగా చాలా స్ట్రాంగ్‌గా ఉంటారు' అని అనన్య చెప్పుకొచ్చింది.  ఇక ఇదే ఇంటర్వ్యూలో పొట్టేల్ సినిమాకు గాను  తనకు వచ్చిన స్పెషల్ జ్యూరీ గద్దర్ అవార్డు గురించి మాట్లాడుతూ..  ఇలాంటి అవార్డు తనకు వస్తుందని అసలు ఊహించలేదని చెప్పింది. 'అవార్డులు ప్రకటించిన రోజు నా మూడ్ బాగోలేదు. ఇంట్లో పడుకొని ఉన్నాను. లేవగానే.. పాజిటివ్ విషయం గురించి థింక్ చేస్తూ.. ఏదైనా అవార్డు వస్తే బాగుండు అనుకున్నాను. అయితే ఆ రోజు గద్దర్ అవార్డులు ప్రకటిస్తారనే విషయం కూడా నాకు తెలియదు.  బెడ్ రూం నుంచి హాల్‌లోకి రాగానే.. టీవీలో గద్దర్ అవార్డుల ప్రకటన న్యూస్ చూస్తూ.. 'ఇంత మంచి సినిమాలు చేస్తున్నా..నాక్కూడా వస్తే బాగుండు' కదా అని అన్నయ్యతో చెబుతున్నా..అంతలోనే నాకు పొట్టేల్ మూవీ నిర్మాత ఫోన్ చేసి'మన సినిమాకు అవార్డు వచ్చింది' అని చెప్పగానే షాక్ అయ్యాను. ఆరేళ్ల కెరీర్‌లో మీడియాతో పాటు ఇండస్ట్రీలో చాలా మంది సపోర్ట్ చేశారు. అందుకే నేను ఇప్పుడు  ఈ స్థాయిలో ఉన్నాను' అని అనన్య చెప్పుకొచ్చింది




## విజయ్ దేవరకొండపై అట్రాసిటీ కేసు!

టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండపై కేసు నమోదు అయింది. ఏప్రిల్ 26న జరిగిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో గిరిజనులను అవమానించలేలా మాట్లాడారంటూ విజయ్‌పై గిరిజన సంఘం నాయకుడు అశోఖ్ కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ సెక్షన్ల కింద విజయ్ దేవరకొండపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. హీరో వ్యాఖ్యలపై విచారణ జరిపుతున్నట్లు వారు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్ 26న హైదరాబాద్‌లో తమిళ హీరో సూర్య హీరోగా నటించిన రెట్రో సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్ జరిగింది. ఈ ఈవెంట్‌కి విజయ్ దేవరకొండ ముఖ్య అతిథిగా వెళ్లాడు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడి గురించి మాట్లాడుతూ.. ఇండియా పాకిస్తాన్‌పై దాడి చేయాల్సిన అవసరం లేదు.. అక్కడి ప్రజలకే విరక్తి వచ్చి పాక్ ప్రభుత్వంపై తిరగబడతారు. 500 ఏళ్ల క్రితం ట్రైబల్స్ కొట్టుకున్నట్లు.. బుద్ధి లేకుండా, కనీస కామన్ సెన్స్ లేకుండా ఇలాంటి పనులు చేస్తున్నారు. మనమంతా ఐకమత్యంగా ఉండాలి' అని విజయ్ అన్నారు. ఈ వ్యాఖ్యలు గిరిజనులను ఉగ్రవాదులతో పోల్చాయని, వారిని అవమానించాయని గిరిజన సంఘం నాయకుడు అశోక్‌కుమార్ రాథోడ్ రాయదుర్గం పోలీసులకు ఫిర్యాదు చేడయంతో విజయ్‌పై కేసు నమోదు చేశారు. ఈ వివాదంపై విజయ్ అప్పుడే స్పందించాడు. తాను ట్రైబ్స్ అనే పదం వాడిన మాట నిజమే కానీ.. దాని అర్థం గిరిజనులు కాదని చెప్పారు. 'వందల ఏళ్ల కిందట సమాజం, ప్రజలు గుంపులుగా వ్యవస్థీకృతమై ఉండేవాళ్లని నా ఉద్దేశం. అలాంటి సమయంలో రెండు వర్గాల మధ్య తరచూ ఘర్షణలు చోటు చేసుకునేవి. ఆ సెన్స్‌లోనే ట్రైబ్స్  అనే పదం వాడాను. అంతేకానీ, ఇప్పుడున్న షెడ్యూల్ ట్రైబ్‌ని ఉద్దేశించి నేను వ్యాఖ్యలు చేయలేదు. అయినా కూడా నా వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకొని హర్ట్ అయితే విచారం వ్యక్తం చేస్తున్నాను' అని విజయ్ అప్పుడే సోషల్ మీడియా వేదికగా వివరణ ఇచ్చాడు.

## ఇజ్రాయెల్,అమెరికా విరుచుకు పడుతున్న వేళ..

# ఇరాన్‌కు ప్రధాని మోదీ ఫోన్ కాల్!

**ఢిల్లీ:** ఇరాన్‌పై ఇజ్రాయెల్,అమెరికా దాడులకు తెగబడుతున్న వేళ కీలక పరిణామం చోటు చేసుకుంది. ఇరు దేశాలు శాంతి నెలకొల్పేలా చర్చలు జరపాలంటూ భారత ప్రధాని మోదీ ఇరాన్ అధ్యక్షుడితో ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈమేరకు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో 'ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియన్‌తో నేను మాట్లాడాను. ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా జరుపుతున్న దాడుల గురించి చర్చించాం. ఈ దాడులపై ఆందోళన వ్యక్తం చేశాం. ప్రాంతీయంగా శాంతి, భద్రత, స్థిరత్వాన్ని త్వరగా పునరుద్ధరించడానికి, తక్షణ ఉద్రిక్తతలను తగ్గించడం, శాంతి చర్చలు జరపాలని చెప్పినట్లు ' పేర్కొన్నారు. సుదీర్ఘకాలం నుంచి ఇరాన్‌తో పాటు ఇరాన్ మద్దతిస్తున్న హమాస్, హెజ్‌బొల్లా వంటి మిలిటెంట్లు గ్రూపులు ఇజ్రాయెల్‌పై దాడులకు తెగబడుతున్నాయి. ఈ దాడులు తన భద్రతకు ముప్పుగా భావిస్తోంది. అందుకే ఇజ్రాయెల్ హమాస్, హెజ్‌బొల్లాతో పాటు ఇరాన్‌పై దాడుల్ని తీవ్రతరం చేసింది.



**ఇరాన్‌పై అమెరికా ఎందుకు దాడులు చేస్తోంది?**

ఈ ఇరు దేశాల యుద్ధంలో ఇప్పుడు అగ్రరాజ్యం అమెరికా ప్రత్యక్షంగా రంగంలోకి దిగింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆదేశాలతో అమెరికా సైన్యం శనివారం (జూన్ 21, 2025న) ఇరాన్‌లోని మూడు ప్రధాన అణు కేంద్రాలపై వైమానిక దాడులు చేసింది. ఫోర్డో, నటాంజ్, ఇస్ఫహాన్ అనే అణు కేంద్రాలపై %దీ%-2 స్పిరిట్ బాంబర్లతో భారీ బాంబుల వర్షం కురిపించింది. ట్రంప్ సైతం ఈ దాడి విజయవంతమైందని పేర్కొన్నారు. ఈ దాడి ద్వారా అమెరికా అధికారికంగా యుద్ధంలోకి దిగినట్టయింది. ఇరాన్ అణు ఆయుధాలు తయారు చేయకుండా అడ్డుకోవడమే ప్రధాన ఉద్దేశమని ట్రంప్ తెలిపారు. అయితే, ఈ చర్యపై ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఇది యుద్ధాన్ని మరింత పెంచుతుందా లేక శాంతికి దారి తీస్తుందా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఇది మూడో ప్రపంచ యుద్ధానికి నాంది కావొచ్చని పలువురు నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**ఇరాన్‌పై ఇజ్రాయెల్ యుద్ధానికి కారణం**

ఇరాన్ ప్రధానంగా హమాస్ (పాలస్తీనా), హెజ్బొల్లా (లెబనాన్) వంటి మిలిటెంట్ గ్రూపులకు ఆర్థిక సహాయం, ఆయుధాలు, శిక్షణ అందిస్తోంది. ఈ శిక్షణను ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)లోని ఖుద్స్ ఫోర్స్ అనే విభాగం నిర్వహిస్తోంది. హమాస్: ఇజ్రాయెల్‌పై అక్టోబర్ 7,2023న జరిగిన దాడికి ముందు, హమాస్ మిలిటెంట్లు ఇరాన్‌లో శిక్షణ పొందినట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. వీరికి డబ్బు,ఆయుధాలు,సాంకేతిక సహాయం కూడా అందించినట్లు ఆరోపించింది.

హెజ్ బొల్లా: ఇది లెబనాన్‌లో ఉన్న షియా మిలిటెంట్ గ్రూప్. దీనికి ఇరాన్ మద్దతు ఇస్తుంది. హెజ్ బొల్లాకు ఆయుధాలు, శిక్షణతో పాటు వ్యూహాత్మక సలహాలు సూచనలు ఇస్తోంది. అందుకు హెజ్‌బొల్లా, హమాస్‌తో పాటు ఇరాన్‌పై ఇజ్రాయెల్ దాడుల్ని తీవ్రతరం చేసింది. హెజ్‌బొల్లా,హమాస్ గ్రూపుల్ని నిర్వీర్యం చేసింది. ఆ రెండు గ్రూపులకు కీలకంగా వ్యవహరిస్తున్న టాప్ కమాండర్లను హతమార్చింది. ఇప్పుడు ఇరాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడుతోంది.

# ఇరాన్ అన్నంత పని చేసింది..

**టెహ్రాన్:** గత కొన్ని రోజులు హోర్ముజ్ జలసంధిని మూసివేస్తామంటూ చెబుతూ వస్తున్న ఇరాన్.. అన్నంత పని చేసింది. హోర్ముజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు తాజాగా స్పష్టం చేసింది. హోర్ముజ్ జలసంధి మూసివేతకు ఆ దేశ పార్లమెంట్ ఆమోద ముద్ర వేయడంతో ఇరాన్ ఈ నిర్ణయం తీసుకుంది. అమెరికా దాడుల తర్వాత ఓపిక నశించిన ఇరాన్ ఇక హోర్ముజ్ జలసంధి మూసివేతే లక్ష్యంగా పావులు కదిపింది. దీనికనుగుణంగా పార్లమెంట్ ద్వారా ఆమోద ముద్ర వేయించుకున్న ఇరాన్.. ప్రపంచ దేశాలకు ఎంతో కీలకమైన ఆ జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యే అవకాశముంది. అయితే, ఇరాన్ నిర్ణయం ప్రపంచ ముడి చమురు ధరలలో పెరుగుదలకు దారితీయనుంది.



భారత్‌పై చమురు దిగుమతుల ప్రభావం

హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేస్తున్నట్లు ప్రకటించిన తరుణంలో చమురు, గ్యాస్ దిగుమతులపై ఆధారపడ్డ భారత్ లాంటి దేశాలపై అత్యంత ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రతి రోజు హార్మూజ్ జలసంధి ద్వారా భారత్‌కు చేరే ముడిచమురే సుమారు 15 లక్షల బ్యారెళ్లు మరి!. ఈ రవాణ ఆగిపోయిందంటే.. రోజుకు 10 నుంచి 12 కోట్ల లీటర్ల పెట్రోలు ఉత్పత్తి కాదన్నమాట. కొంచెం అటు ఇటుగా ఇది మన రోజువారీ వినియోగానికి సమానం. చమురు రవాణా నిలిచిపోవడం వల్ల డీజిల్‌తోపాటు అనేక ఇతర పదార్థాల ఉత్పత్తి కూడా నిలిచిపోతుంది. ఈ కొరతను ఎదుర్కొనేందుకు దేశాలు పోటాపోటీగా చమురు కొనుగోళ్లు మొదలుపెడతాయి. తద్వారా డిమాండ్ పెరిగి ఎక్కువ డాలర్లు ఖర్చు పెట్టాల్సి వస్తుంది. దీంతో రూపాయి విలువ పడిపోతుంది. వస్తువుల ధరలు పెరుగుతాయి. ద్రవ్యోల్బణమూ అదుపులో ఉండదు. అయితే భారత్ ప్రత్యామ్నాయ మార్గాలు చేపట్టింది. అమెరికా, రష్యాల నుంచి చమురు నిల్వలు దిగుమతి పెంచేందుకు భారత్ అడుగులు వేస్తోంది. ఏది ఏమైనా ఇరాన్ నిర్ణయంతో ప్రపంచ దేశాలు చమురు కోసం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనే అవకాశాలే ఎక్కువ.

## శాంతి నెలకొని ఒక దశాబ్దం..


# సమైక్యతా సమయం

కొలంబియా రాజధాని బొగొటాలోని ప్రఖ్యాత శాంటా మారియా ప్లాజాలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. వేలాది యోగ సాధకులు, ఔత్సాహికులు పాల్గొన్న ఈ వేడుకకు ప్రపంచ ప్రఖ్యాత యోగా గురువు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ స్వయంగా హాజరయ్యారు. సరిగ్గా ఒక దశాబ్దం కిందట కొలంబియా ప్రభుత్వం, తీవ్రవాద ఫార్క్ గెరిల్లా సంఘాలు శాంతి ఒప్పందం చేసుకోవటంలో గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ అత్యంత కీలక పాత్ర పోషించిన విషయం విదితమే. ఆ విధంగా దశాబ్దాలపాటు కొనసాగిన తీవ్రవాద సాయుధ సంఘర్షణకు స్వస్తి చెప్పి పది సంవత్సరాలు పూర్తైన సందర్భంగా ఈ సంవత్సరపు యోగా దినోత్సవ వేడుకలు ప్రత్యేక ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇది కొలంబియాలో శాంతి దశాబ్దానికి గుర్తుగా నిలిచింది. ఈ సందర్భంగా ప్రసంగించిన గురుదేవ్, యోగాను కేవలం శారీరక వ్యాయామంగా మాత్రమే అనుకోవద్దని, అది మన మానసిక స్థితిని సైతం మార్చగలదని గుర్తు చేశారు. నేడు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందిన యోగా దినోత్సవపు కార్యాచరణను రూపొందించటం గురించి మాట్లాడుతూ, మొట్టమొదటి కామన్ యోగా ప్రోటోకాల్ ను రూపొందించిన కమిటీకి తానుఅధ్యక్షత వహించిన జ్ఞాపకాలను పంచుకున్నారు. "ప్రపంచ జనాభాలో మూడు వంతులకు పైగా ప్రజలు ఈ ప్రోటోకాల్‌ను అనుసరిస్తుండటం నాకు చాలా ఆనందంగా ఉంది. అయితే మానసిక ఆరోగ్య రంగంలో మన పని ఇక్కడితో ఆగదు. ఇది వాస్తవానికి ఆరంభం మాత్రమే." అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బొగోటా కల్చరల్ సెక్రటేరియట్‌కి చెందిన ఆబ్జర్వేటరీ ఆఫ్ కల్చర్ అండ్ కల్చరల్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ మాట్లాడుతూ, "గత కొన్ని వారాలుగా దేశంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొని ఉంది, ఆ ఉద్రిక్తతలను చల్లార్చి, సమతుల్యం తీసుకురావడానికి, బొగోటా దేశ ప్రజలందరికీ ఒక సానుకూల సందేశాన్ని ఇచ్చేందుకు ఈనాడు సరైన సమయం వచ్చింది." అని వ్యాఖ్యానించారు.



2015వ సంవత్సరంలో, కొలంబియాలో శాంతిస్థాపన ఇక అసాధ్యమని చాలామంది అనుకున్న సమయంలో దానిని గురుదేవ్ సాధించారు. దాదాపు 50 సంవత్సరాల పాటు ఫార్క్ (%ఖీూ=జ%) తిరుగుబాటుదారులు, కొలంబియా ప్రభుత్వం మధ్య జరిగిన ఉద్రిక్తతలు, ఘర్షణలు కొనసాగాయి. అనేక శాంతి ఒప్పందాలు విఫలమై, అవిశ్వాసపు అగాధం ఇరువర్గాలలో నెలకొన్న ఆ తరుణంలో గురుదేవ్ ఫార్క్ కమాండర్లతో మూడు రోజుల మధ్యవర్తిత్వ చర్చలు నిర్వహించారు. అహింసను ఆయుధంగా స్వీకరించమని, దేశ భవిష్యత్తు కోసం విస్తృత దృక్పథంతో చర్చలను అంగీకరించమని వారిని కోరారు. ఆయన చొరవతో సంక్షోభానికి పరిష్కారం లభించింది. ఒక సంవత్సరం పాటు సంపూర్ణ కాల్పుల విరమణ ను ఫార్క్ ప్రకటించింది ౦ అభూతపూర్వమైన ఈ చర్య తరువాతి శాంతి ఒప్పందానికి మార్గాన్ని సిద్ధం చేసింది. పది సంవత్సరాల తరువాత, ఈరోజున గురుదేవ్ మళ్లీ కొలంబియాను సందర్శించారు. కేవలం దశాబ్ది ఉత్సవాన్ని జరుపుకోవడానికి మాత్రమే కాక, మరింత శాంతియుతంగా, ఐక్యతతో కూడిన దక్షిణ అమెరికాను సాధించే దిశగా వారు తమ దృష్టిని సారించారు. బొగోటా, మెడెలిన్, కార్టాజెనా వంటి నగరాల్లో, ఆయన కొలంబియా పార్లమెంట్ సభ్యులు, వ్యాపారవేత్తలు, విద్యావేత్తలను కలుసుకుని, వారికి ధ్యానపు లోతైన అనుభూతిని పరిచయం చేశారు. కొలంబియా పార్లమెంట్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ గురుదేవ్, "కష్టాలనుండి విముక్తమైన ప్రపంచం, మరింత ప్రేమభరితమైన, ఆనందంగా, శాంతితో నిండిన ప్రపంచం అనేది ఇది ఊహా ప్రపంచంలా అనిపించవచ్చు. అది ఒక కలగానే ప్రారంభమవుతుంది. మనం ఈ కలను కనటం ప్రారంభిస్తే, దాన్ని తప్పక నిజం చేయగలమని నేను నమ్ముతున్నాను." అని అన్నారు. అంతకు ముందు జూన్ 20వ తేదీన, సమాజ నిర్మాణంలో గురుదేవ్ చూపిన శ్రద్ధ, నిబద్ధత, ఇంకా స్ఫూర్తివంతమైన, నిరంతర సేవలకు గుర్తింపుగా కార్టాజెనా డే ఇండియాస్ నగర మేయర్ డుమెక్ టుర్‌బే పాజ్ శ్రీశ్రీ ని లిబొలీవార్ గవర్నరేట్ మెడల్ తో సత్కరించి, ప్రపంచంలో శాంతి, ఆనందాలను ప్రోత్సహించడంలో గురుదేవుల పాత్రను శ్లాఘించారు. 2016లో న్యూఢిల్లీలో జరిగిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ వరల్డ్ కల్చర్ ఫెస్టివల్‌కు హాజరైన చిత్రదర్శకురాలు మరియు ఫోటోగ్రాఫర్ లికా గవీష్ తన అనుభవాన్ని పంచుకుంటూ, "నా భాగస్వామి ఒక కేమెరామన్‌గా ఘర్షణ ప్రాంతాల్లో పనిచేశాడు. అక్కడి పరిస్థితులు ఎంత కఠినంగా ఉంటాయో నాకు బాగా తెలుసు. అటువంటి ప్రాంతానికి శాంతిని తీసుకురావడంలో గురుదేవ్ పాత్ర పోషించారన్న విషయం నన్ను బాగా కదిలించింది. ప్రపంచం ఆయనకు ఎంతో ఋణపడి ఉంటుంది." అని ఉద్వేగ భరితంగా గుర్తుచేసుకున్నారు.

## 'వర్షాకాలంలోనూ ఏరివేస్తాం'



**ఇంటర్నెట్ డెస్క్:** వర్షాకాలంలోనూ మావోయిస్టు ఏరివేత ఆపరేషన్లు కొనసాగిస్తామని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయుధాలు వీడి, అభివృద్ధి పథంలో కలిసి రావాలని మావోయిస్టులకు పిలుపునిచ్చారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం ఛత్తీస్‌గఢ్ చేరుకున్న అమిత్ షా.. రాయ్‌పూర్ అటల్ నగర్‌లో నేషనల్ ఫోరెన్సిక్ సైన్స్ యూనివర్సిటీ (ఎన్ఎఫ్ఎస్‌యూ) క్యాంపస్, సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లకు శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రసంగించారు. "ప్రతిసారి వర్షాకాలంలో పరిస్థితులను అనుకూలంగా తీసుకుని మావోయిస్టులు విశ్రాంతి తీసుకునేవారు. కానీ, ఈసారి వర్షాకాలంలో వారిని నిద్రపోనివ్వం. 2026 మార్చి నాటికి మావోయిస్టు రహిత భారత్ లక్ష్యాన్ని సాధించే దిశగా మరింత ముందుకెళ్తాం" అని అమిత్ షా పేర్కొన్నారు. మావోయిస్టులు లొంగిపోవాలని, ఆయుధాలు వీడి.. అభివృద్ధి ప్రయాణంలో చేరాలని పిలుపునిచ్చారు. వారితో చర్చలు అవసరం లేదన్నారు. సాయుధ పోరాటాన్ని వదులుకుని జనజీవన స్రవంతిలో చేరే వారికి మరింత సాయం చేసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.

**అమెరికా దాడులు.. ఇరాన్ అధ్యక్షుడికి ప్రధాని మోదీ ఫోన్**

2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలనే ప్రధాని మోదీ దార్శనికత చాలా స్పష్టంగా ఉందని అమిత్ షా అన్నారు. "మా ప్రభుత్వం కేవలం ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిపైనే దృష్టి పెట్టడం లేదు. సకాలంలో న్యాయం అందించేందుకూ చర్యలు తీసుకుంటోంది. కొత్త చట్టాలు దీనికి దోహదపడతాయి" అని తెలిపారు. ఇదిలా ఉండగా.. నక్సలిజం సమస్యపై ఛత్తీస్‌గఢ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ఝార?ండ్, ఒడిశా ఉన్నతాధికారులతో అమిత్ షా సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు.

## రాహుల్‌కు 'మేకిన్ ఇండియా' అంటే ఏంటో తెలియదు



**ముంబయి:** 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇండియా'గా మారిందంటూ కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన పోస్టుపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్ మండిపడ్డారు. రాహుల్‌కు మేకిన్ ఇండియా అంటే ఏమిటో తెలియదన్నారు. అంతేకాకుండా మన దేశంలో ఏం తయారవుతుందో కూడా ఆయనకు తెలియదని ఆక్షేపించారు. ముంబయిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. యూపీఏ ప్రభుత్వ హయాంలో భారతదేశ ఆర్థిక వ్యవస్థ 11వ స్థానంలో ఉండేదని, ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చాక పదేళ్లలో దేశాన్ని ఐదో ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దారని కూడా ఆయనకు తెలియకపోవచ్చని విమర్శించారు. రాబోయే రెండేళ్లలో దేశం ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అవుతుందని తెలిపారు. రాహుల్ కొంత హోం వర్క్ చేయాలని హితవు పలికారు. ప్రధాని మోదీ నినాదాలివ్వడంలోనే ఆరితేరారని, దేశ సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారని రాహుల్ గాంధీ 'ఎక్స్' వేదికగా విమర్శలు గుప్పించిన విషయం తెలిసిందే. 'మేకిన్ ఇండియా' నినాదంతో మోదీ ఊదరగొడుతున్నా దేశంలో ఉత్పాదకత కనిష్ఠ స్థాయికి పడిపోయిందని, నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. 'మేకిన్ ఇండియా' కాస్తా 'అసెంబ్లింగ్ ఇన్ ఇండియా'గా మారిందని ధ్వజమెత్తారు. దిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ 'నెహ్రూ ప్లేస్'లో తాజాగా పర్యటించిన రాహుల్.. అక్కడ పనిచేసే టెక్నీషియన్లతో ముచ్చటించిన వీడియోను ఆయన షేర్ చేసుకున్నారు.

## 'పహల్గామ్' ఉగ్రవాదులకు ఆశ్రయం.. ఇద్దరు అరెస్ట్




న్యూఢిల్లీ: పహల్గామ్ ఉగ్రదాడిలో భాగస్వామ్యం కలిగిన ఉగ్రవాదులకు ఆశ్రయం కల్పించిన ఇద్దరిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ఆదివారం అరెస్టు చేసింది. వీరిని పహల్గామ్‌కు చెందిన పర్వైజ్ అహ్మద్ జోథర్, బషీర్ అహ్మద్ జోథర్‌లుగా గుర్తించింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా (ఎల్ఈటీ)తో సంబంధం కలిగిన ముగ్గురు సాయుధ ఉగ్రవాదులకు వీరు ఆశ్రయం కల్పించడంలో పాటు వారికి ఆహారం, ఇతర సదుపాయాలు కల్పించారని ఎన్ఐఏ ఒక ప్రకటనలో తెలిపింది. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఉగ్రదాడి కేసుపై ఎన్ఐఏ దర్యాప్తు చేస్తోంది. ఈ దాడికి ముందు హిల్ పార్క్ ప్రాంతంలోని ఈ ఉగ్రవాదులను నిందితులు దాచి ఉంచారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. విచారణ సమయంలో పర్వైజ్, బషీర్ ఈ ఉగ్రదాడిలో పాల్గొన్నవారి గుర్తింపులను వెల్లడించారని, వారు పాకిస్తానీ జాతీయులని నిర్ధారించారని దర్యాప్తు అధికారులు వెల్లడించారు. పర్యాటకులను వారి మతపరమైన గుర్తింపు ఆధారంగా ఉగ్రవాదులు దాడులకు పాల్పడ్డారు. ఇది ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో జరిగిన భారీ ఉగ్రదాడులలో ఒకటిగా నిలిచింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం, 1967లోని సెక్షన్ 19 కింద వీరిద్దరినీ అరెస్టు చేశారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లోని బైసరన్ లోయలో పాకిస్తాన్ ఉగ్రవాదులు పర్యాటకులపై కాల్పులు జరిపి, 26 మందిని పొట్టనపెట్టుకున్నారు. ఈ దాడుల్లో16 మంది గాయపడ్డారు.

Printed, Published & Owned by **SIRIKONDA MARIA,** Printed at ASHISH PUBLICATIONS H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-1-12/45/1, P.H.C. Colony, Adilabad - 504001, Telangana. Editor : **SIRIKONDA AUGUSTIN . RNI No.: APTEL/2013/52694.** E-mail: voodayam2007@gmail.com, Cell : 9247698676, 7075458621. Telefax. No. 040-27678676.